

వాటర్ షెడ్ నమూనాను పరిశీలిస్తున్న రాష్ట్ర వాటర్‌షెడ్ డైరెక్టర్ షణ్ముఖ్‌కుమార్, పక్కన కలెక్టర్ అన్సారియా, ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి తదితరులు

నీటి సంరక్షణతోనే సమగ్రాభివృద్ధి

రాష్ట్ర వాటర్‌షెడ్ డైరెక్టర్ షణ్ముఖ్ కుమార్

పీసీపల్లి, ఫిబ్రవరి 5 (ఆంధ్ర జ్యోతి) : నీటి సంరక్షణతోనే సమగ్ర అభివృద్ధి సాధ్యమని రాష్ట్ర వాటర్‌షెడ్ డైరెక్టర్ షణ్ముఖ్ కుమార్ పేర్కొన్నారు. వాటర్‌షెడ్ పథకం కింద డ్వామా ఆధ్వర్యంలో అమలుచేస్తున్న పథకాలపై అవగాహన కల్పించేందుకు పీసీపల్లి మండలంలోని జంగాలపల్లి గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. తొలుత ఈ పథకం వినియోగంపై ఢిల్లీ నుంచి కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివ రాజ్‌సింగ్ చౌహాన్, సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ప్రసంగాలను ప్రత్యక్ష ప్రసారం ద్వారా ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన స్ర్కీన్‌లపై ప్రజలతో కలిసి వీక్షించారు. అనంతరం డైరెక్టర్ మాట్లాడుతూ ప్రతి నీటిబిందువును పొదుపు చేయాల్సిన అవసరం ఉందన్నారు. నీటి సంరక్షణ అనేది ప్రతిఒక్కరి జీవనశైలిలో భాగం కావాలని పిలుపునిచ్చారు. కలెక్టర్ అన్సారియా మాట్లాడుతూ నీటిని పొదుపుగా వినియోగించుకోవడం, జల వనరులను కాపాడుకోవడం మనందరి బాధ్యత అని చెప్పారు. కనిగిరి శాసనసభ్యుడు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి మాట్లాడుతూ క్షామపీడిత పశ్చిమప్రాంతానికి వాటర్‌షెడ్ పథకం ఒక వరం లాంటిదని అన్నారు. నీటి వనరులను జాగ్రత్తగా కాపాడుకుంటే కనిగిరి నియోజకవర్గం నుంచి వలసలను నివారించవచ్చని అభిప్రాయపడ్డారు. అనంతరం నీటిని పొదుపుగా వినియోగించుకుంటామని, నీటివనరులను కాపాడుకుంటామని స్థానికులు, అధికారులు ప్రతిజ్ఞ చేశారు. ముందుగా గ్రామసమీపంలోని పొలాల్లో సేద్యపు నీటి కుంట పనులను కలెక్టర్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఉపాధి హామీ స్పెషల్ విజిలెన్స్ ఆఫీసర్ భవానీహర్ష, డిప్యూటీ కమిషనర్ సాగర్‌కుమార్, డ్వామా పీడీ జోసఫ్‌కుమార్, ఏపీడీ వండర్‌మ్యాన్, ఏపీడీ చంద్రశేఖర్‌రెడ్డి, మర్రిపూడి డబ్ల్యూసీసీ ప్రాజెక్టు ఆఫీసర్ రాజేష్‌కుమార్ , ఎంపీడీవో ప్రభాకరశర్మ, తహసీల్దార్ ఉష, నాయకులు కసిరెడ్డి ఓబుల్‌రెడ్డి, కసిరెడ్డి హనుమారెడ్డి, గడ్డం బాలసుబ్బయ్య, వేమూరి రామయ్య, చాగంరెడ్డి మాలకొండారెడ్డి పాల్గొన్నారు.



నీటిని పొదుపుగా వినియోగించుకుంటామని ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ అన్సారియా, వేదికపై వాటర్‌షెడ్ డైరెక్టర్ షణ్ముఖ్‌కుమార్, ఎమ్మెల్యే ఉగ్ర, అధికారులు, ప్రజాప్రతినిధులు

వెంగళాయపల్లి వద్ద బయోగ్యాస్ ప్లాంటు

- గ్రామ సమీపంలో 475.57 ఎకరాల భూమి సేకరణ
- పరిశీలించిన కలెక్టర్ అన్సారియా , ఎమ్మెల్యే ఉగ్ర

6

ఉన్నాయో.. లేవో!



గిద్దలూరులో వ్యవసాయ ఉపకరణాలను పరిశీలిస్తున్న అధికారులు

ఎట్టకేలకు యంత్రాంగంలో కదలిక మొదలైంది. జిల్లాలో వైసీపీ ప్రభుత్వ కాలంలో రైతులకు ఇచ్చిన యంత్ర పరికరాల స్థితిగతులపై వ్యవసాయ శాఖ దృష్టి సారించింది. వాటిపై పరిశీలన ప్రారంభించింది. అప్పట్లో ఇచ్చిన ట్రాక్టర్లు, ఇతర వ్యవసాయ పరికరాలు ప్రస్తుతం అవే గ్రూపుల వద్ద ఉన్నాయా.. మార్పులు, చేర్పులు జరిగాయా? వారి వద్ద ఉన్నా పనిచేస్తున్నాయా? అనే అంశంపై సర్వే చేస్తోంది. వారంరోజుల నుంచి జిల్లావ్యాప్తంగా ఈ ప్రక్రియ కొనసాగుతోంది. స్థానిక అధికారులు కాకుండా పక్క సబ్ డివిజన్‌ల నుంచి ఏడీ స్థాయి అధికారులు తనిఖీలు చేస్తున్నారు.

- సాగు యంత్ర పరికరాల పరిస్థితేమిటి?
- తనిఖీలు చేపట్టిన వ్యవసాయశాఖ
- సబ్ డివిజన్ అధికారులను మార్చి పరిశీలన
- వైసీపీ ప్రభుత్వంలో ఇచ్చిన వాటిపై ఆరోపణలతో కదిలిన అధికారులు

ఒంగోలు, ఫిబ్రవరి 5 (ఆంధ్ర జ్యోతి) : జిల్లాలో 2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వ కాలంలో పెద్దఎత్తున రైతులకు వ్యవసాయ యంత్ర పరికరాలను అందజేశారు. ఒక్కో రైతును ఒక యూనిట్‌గా తీసుకొని ఉమ్మడి జిల్లాలో దాదాపు 1,200 మందికి రూ.20కోట్ల విలువైన ట్రాక్టర్లను రైతురథం పేరుతో ఇచ్చారు. అలాగే మరో 29వేల మంది రైతులకు రూ.100 కోట్ల విలువైన ఇతర పరికరాలను అందజేశారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ తరహా పరికరాల ఊసే ఎత్తలేదు. రైతుల నుంచి విమర్శలు రావడంతో రెండేళ్ల తర్వాత 2021-22, 2022-23 సంవత్సరాలలో సుమారు రూ.59 కోట్ల విలువైన పరికరాలు ఇచ్చారు. అయితే టీడీపీ కాలంలో వలే వ్యక్తిగతంగా కాకుండా ఐదారుగురు రైతులను ఒక గ్రూపుగా ఏర్పాటు చేశారు. గ్రూపును ఒక యూనిట్‌గా తీసుకొని కొన్నింటికి ట్రాక్టర్లు, మరికొన్ని గ్రూపులకు సేద్యం, పంటకోతలు, నూర్పిడిలకు

మిగతా 6వ పేజీలో

వైసీపీ నేతలదే పెత్తనం

నిబంధనల ప్రకారం గ్రూపు సభ్యులందరికీ వ్యవసాయ యంత్ర పరికరాలను వినియోగించుకునే హక్కు ఉంది. అలాగే అద్దెలకు కూడా ఇవ్వాలి. వాటిని ఆర్బీకేల వద్ద ఉంచాలి. కానీ.. అలా నిబంధనల ప్రకారం జరగలేదు. గ్రూపుల పేరుతో వైసీపీ నేతలు వాటిని తీసుకున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వీటిపై చర్చ జరిగింది. జిల్లాలో అవకతవకలు చోటుచేసుకున్నాయని, వాటిని పరిశీలించాలని మంత్రి డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి వ్యవసాయశాఖ అధికారులను ఆదేశించారు. పలువురు ఎమ్మెల్యేలు కూడా వివిధ సమావేశాల్లో ఈ అంశాన్ని ప్రస్తావించారు. దీంతో జిల్లావ్యాప్తంగా ఆ పరికరాల స్థితిగతులపై వ్యవసాయశాఖ దృష్టి సారించింది. జిల్లా వ్యవసాయశాఖ అధికారి సీహెచ్ శ్రీనివాసరావు అందుకోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు.

లాటరీ పేరుతో దోపిడీ

- సామాన్యులు విలవిల
- నగరంలో విచ్చలవిడిగా ఏజెంట్లు
- కార్మికులు, ఆటో డ్రైవర్లు, రోజువారీ కూలీలు లక్ష్యం
- పట్టించుకోని పోలీసులు



ఒంగోలులోని కేశవరాజుకుంటలో లాటరీలు విక్రయిస్తున్న వ్యక్తి (వృత్తంలో)

ఒంగోలు క్రైం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : నగరంలో సామాన్యుల నుంచి నగటు కార్మికుల వరకు అంతా కేరళ లాటరీ ఉచ్చులో చిక్కుకుని విలవిల్లాడుతున్నారు. రోజు వారీ సంపాదించిన డబ్బులు సరిపోక అప్పులు చేస్తున్నారు. తమ కుటుంబాలను బజారున పడేస్తున్నారు. ఎలాంటి గుర్తింపు లేని లాటరీ పేరుతో నంబర్లు వేసిన చీటీలు విక్రయించి గంట గంటకు ఫలితాలు అంటూ ఏజెంట్లు దోచుకుంటున్నారు. ఆ మాయలో పడిపోయిన వారు కష్టపడి సంపాదించిన సొమ్మును టికెట్ల కొనుగోలుకు ఉపయోగించి నష్టపోతున్నారు. ఏజెంట్లు మాత్రం సాయంత్రానికి జేబులు నింపుకొంటున్నారు. ఈ వ్యవహారం ఒంగోలు

మిగతా 6వ పేజీలో



ఒంగోలు కార్పొరేషన్ పాలకవర్గ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జనార్దన్, పక్కన సంతనూతలపాడు శాసనసభ్యుడు విజయ్‌కుమార్, హాజరైన కార్పొరేటర్లు (ఇన్‌సెట్‌లో) డిప్యూటీ మేయర్ సూర్యనారాయణ

రూ.200 కోట్లతో నగరాభివృద్ధి

- ఆరు నెలల్లో ఒంగోలుకు కొత్త రూపు
- వైసీపీ నిర్లక్ష్యంతోనే మార్కెట్‌లో పేరుకుపోయిన అద్దె బకాయిలు
- ఒంగోలు కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్యే దామచర్ల
- పేర్నమిట్ట చెరువును ఎస్‌ఎస్ ట్యాంకుగా మార్చాలి : ఎమ్మెల్యే బీఎన్

ఒంగోలు, కార్పొరేషన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : నగర అభివృద్ధి కోసం సుమారు రూ. 200 కోట్లు ఖర్చుచేయనున్నట్లు ఒంగోలు శాసనసభ్యుడు దామచర్ల జనార్దన్ వెల్లడించారు. మరో ఆరునెలల్లో ఒంగోలు రూపురేఖలు మారుస్తామన్నారు. బుధవారం ఒంగోలు నగరపాలక సంస్థ పాలకవర్గ సమావేశం డిప్యూటీ మేయర్ వేమూరి సూర్య నారాయణ (బుజ్జి) అధ్యక్షతన జరిగింది. ఎమ్మెల్యేలు దామచర్ల, బీఎన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జనార్దన్ మాట్లాడుతూ నగర అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నామని తెలిపారు. నిధుల కొరత ఉన్నప్పటికీ అన్ని డివిజన్‌లలో సమస్యల పరిష్కారానికి కార్పొరేషన్ ఆధ్వర్యంలో వార్డుకో వారం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. స్థానికంగా అప్పటికప్పుడే వీలైనంత వరకు సమస్యలను పరిష్కరిస్తున్నామని తెలిపారు. నగర అభివృద్ధి కోసం ప్రాథమికంగా రూ.126 కోట్లతో అధికారులు అంచనాలు వేశారని పేర్కొన్నారు. ఇంకా చేపట్టాల్సిన మరికొన్ని అభివృద్ధి పనులకు

మిగతా 6వ పేజీలో

నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు

- ప్రతి పోలీస్ స్టేషన్‌కు ఒక డ్రోన్ కెమెరా
- ఎస్పీ దామోదర్

దొనకొండ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : నేరాల నియంత్రణకు, ఘటన జరిగిన వెంటనే బాధితులకు తక్షణ న్యాయం చేసేందుకు సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగకరమని ఎస్పీ దామోదర్ అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌ను బుధవారం ఆయన తనిఖీ చేశారు. బ్రిటీష్ కాలంలో నిర్మించిన భవనాన్ని పరిశీలించారు. అనంతరం విలేకరులతో ఎస్పీ మాట్లాడారు. తాను స్టేషన్లను తనిఖీ చేస్తూ ప్రజలతో పోలీసులు ఏవిధంగా మెలగాలి, ప్రజల సమస్యలు విని ఏవిధంగా ముందుకు సాగాలన్న అంశాలను సిబ్బందికి వివరిస్తున్నానన్నారు. టెక్నాలజీని ఎక్కువగా ఉపయోగించుకుంటే వేగంగా మంచి ఫలితాలు అందించవచ్చన్న లక్ష్యంతో ప్రజల భాగస్వామ్యంతో సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నామన్నారు. జిల్లాలోని ప్రతి పోలీస్‌స్టేషన్‌లో ఒక డ్రోన్ కెమెరా, దొనకొండ మండలంలో 120 వరకు సీసీ కెమెరాలు ఏర్పాటయ్యేలా చూస్తున్నామన్నారు. దొనకొండ స్టేషన్‌కు ఎస్సై లేరని విలేకరులు ఆయన దృష్టికి తీసుకెళ్లగా మూడు రోజుల్లో నియమిస్తామన్నారు. అనంతరం సిబ్బందికి విధి నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఎస్పీ వివరించారు. ఆయన వెంట దర్శి డీఎస్పీ లక్ష్మీనారాయణ, త్రిపురాంతకం సీఐ హస్సాన్, ఎస్సై శివ బసవరాజు, ఏఎస్సై శ్రీనివాసరావు, ఇన్‌చార్జి హెచ్‌సీ రంగనాయకులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు దుగ్గెంపూడి చెంచయ్య, ఫణిదపు వీరాంజనేయులు, సురేష్‌లు ఎస్పీని శాలువాలతో సన్మానించారు. అనంతరం వారితో ఎస్పీ మాట్లాడుతూ మీ గ్రామమైన ఇండ్లచెరువులో సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించాలని కోరారు. అందుకు వారు సానుకూలంగా స్పందించారు.



దొనకొండ పోలీసు స్టేషన్‌ను తనిఖీ చేసిన అనంతరం సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ దామోదర్



పదింతల కృషితో..

- పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలే లక్ష్యంగా టీచర్ల ప్రత్యేక క్లాసులు
- మొత్తం 47 మంది విద్యార్థుల ఉత్తీర్ణతే లక్ష్యంగా ప్రణాళిక
- 2004 నుంచి ఏటా నూరుశాతం ఫలితాలు సాధిస్తున్న యు.అగ్రహారం జడ్పీ ఉన్నత పాఠశాల

7లో

ఐరన్ ఇంజక్షన్ వికటించి గర్భిణి మృతి



కొమరోలులో జగనన్న కాలనీని పరిశీలిస్తున్న విజిలెన్స్ సీఐ రవిబాబు

జగనన్న కాలనీల్లో అక్రమాలపై విచారణ

భూములను అధిక ధరకు కొనుగోలు చేసినట్లు ఆరోపణలు

కొమరోలు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): జగనన్న కాలనీలకు కేటాయించిన భూముల కొనుగోలులో చోటుచేసుకున్న అక్రమాలపై విచారణ మొదలైంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు రావడంతో విజిలెన్స్ సీఐ రవిబాబు విచారించారు. అధిక ధరలకు కొనుగోలు చేశారన్న ఫిర్యాదులపై కొమరోలులోని రెండు కాలనీలను ఆయన బుధవారం పరిశీలించారు. అప్పటి తహసీల్దార్ రాజా ప్రేమ్‌కుమార్ ఆధ్వర్యంలో కొమరోలులో జగనన్న కాలనీల కోసం రెండు వేర్వేరు చోట్ల భూములను సేకరించారు. ప్రైవేటు వ్యక్తుల నుంచి మొత్తం 5.58 ఎకరాలను రూ.74లక్షలతో కొనుగోలు చేసి కాలనీలు నిర్మించారు. కొమరోలు తహసీల్దార్ కార్యాలయం రోడ్డులోని కాలనీకి సర్వేనెం. 345-2ఏలో 1.50 ఎకరాలను రూ.12,75లక్షలకు కొనుగోలు చేశారు. డ్రీమ్ రెస్టారెంట్ ఎదురుగా ఇడమకల్లు ఇలాకాలోని 4.08 ఎకరాల భూమిని ఒక ఎకరాకు రూ.15లక్షల చొప్పున రూ.61.20 లక్షలను ఇద్దరు రైతులకు ఇచ్చి కొన్నారు. ఈ భూములపై సమగ్ర సమాచారాన్ని సేకరించినట్లు విజిలెన్స్ సీఐ తెలిపారు. సంబంధిత రైతులను కూడా విచారించామన్నారు. పూర్తి నివేదికను ప్రభుత్వానికి అందజేయనున్నట్లు తెలిపారు. ఆయన వెంట ఆర్‌ఐ నాయక్ ఉన్నారు.

‘గీత’ మద్యం షాపులకు దరఖాస్తు గడువు పెంపు

ఒంగోలు క్రైం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): గీత కార్మికుల కోసం కేటాయించిన 17 మద్యం షాపులకు దరఖాస్తు గడువును పెంచినట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఖాజామొహిద్దీన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 8 సాయంత్రం 5 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు చెప్పారు. ఈనెల 10న లాటరీ ద్వారా మద్యం దుకాణాల కేటాయింపు చేపడతామన్నారు. ఒంగోలులోని అంబేడ్కర్ భవన్‌లో కలెక్టర్ ఆధ్వర్యంలో లాటరీ పద్ధతిలో ఎంపిక చేయనున్నట్లు వివరించారు.

ఆశ్రయం.. అనాథైంది...!


ఆహార ప్యాకెట్లతో దుర్వాసన వెదజల్లుతున్న హాస్టల్ పాత భవనం


భవనం లోపల ఉన్న చెత్త, బూడిద


ఒకప్పుడు ఒక వెలుగు వెలిగిన వసతిగృహ భవనం

ఒకప్పుడు వందలాది మంది విద్యార్థులకు ఆశ్రయం కల్పించిన భవనం ప్రస్తుతం ఆలనాపాలనా కరువైంది. ఒంగోలు నడిబొడ్డున ఉన్న ఈ భవన రక్షణను విస్మరించడంతో శిథిలావస్థకు చేరింది. స్థానిక అంజయ్యరోడ్డులో సాంఘిక సంక్షేమశాఖ వసతిగృహ కాలేజీ హాస్టల్ భవనం పరిస్థితి మరింత అధ్వానంగా మారింది. ప్రస్తుతం హాస్టల్ ముందు కొత్త భవనం నిర్మించారు. దీంతో ఆ భవనాన్ని పట్టించుకోకపోవడంతో మరింత శిథిలావస్థకు చేరింది. కొద్దిపాటి మరమ్మతులు చేసి వినియోగంలో పెట్టాల్సిన భవనం అనాథలా మారింది. ప్రస్తుతం ఆ భవనం లోపల విద్యార్థులు తినిపడేసిన ఆహార పొట్లాలు, పైకప్పు నుంచి ఊడిపడిపోతున్న పెచ్చులతో కుప్పలు ఏర్పడ్డాయి. మరో వైపు ఆ ప్రాంతంలో ఉన్న కొంత మంది చెత్తను వేస్తుండటం, ఇంకొక వైపు మూగప్రాణాలు ఆ భవనంలోనే నివాసాలు ఏర్పాటుచేసుకోవడం వంటి కారణాలతో మరింత అధ్వానంగా తయారైంది. దీని బాగోగులు గురించి పట్టించుకోవాల్సిన అవసరం ఏర్పడింది. -ఒంగోలు కలెక్టరేట్, ఆంధ్రజ్యోతి

కంభం వైద్యశాలలో గుండెపోటుకు అత్యవసర చికిత్స

కంభం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): గుండె జబ్బుల మరణాలను నివారించేందుకు కంభం ప్రభుత్వ వైద్యశాలలో అత్యవసర చికిత్స అందిస్తున్నామని వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ శిరీష ప్రియదర్శిని బుధవారం తెలిపారు. గుండెజబ్బులకు, గుండెపోటు ఇంజక్షన్లు అందుబాటులో ఉన్నాయన్నారు. గుండెపోటు లక్షణాలు గురించి ఆమె మాట్లాడుతూ మొదట ఛాతినొప్పి, ఎడమ భుజం లాగడం, ఆకస్మిక ఆయాసం, గుండెదడ, స్పృహ కోల్పోవడం తదితర లక్షణాలు ఉంటాయన్నారు. గుండెపోటు వచ్చిన మొదటి గంటలోపు 108కు ఫోన్ చేసి దగ్గరలోని ప్రభుత్వ వైద్యశాలకు తీసుకుని వెళ్లాలన్నారు. ప్రాథమిక పరీక్షలు నిర్వహించి మొదటి గంటలోపే రూ.40వేలు విలువైన టెనెక్టిప్లస్ ఇంజక్షన్‌ను ఉచితంగా అందించి ప్రాణాలు కాపాడతామన్నారు. ఆ తరువాత సర్వజన ఆసుపత్రికి పంపిస్తామన్నారు. గుండెనొప్పి గుర్తించడానికి మొదటి గంట అత్యంత కీలకమన్నారు. ప్రాణాలు కాపాడుకోవడానికి త్రాంబోలైస్ ఇంజక్షన్లు కంభం ప్రభుత్వ వైద్యశాలలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

మౌలికవసతుల కల్పనతోనే గ్రామాల అభివృద్ధి

ఎంజీఎన్ఆర్జీఎస్ డైరెక్టర్ షణ్ముఖ్‌కుమార్

పీసీపల్లి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : మౌలిక వసతుల కల్పనతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ఎంజీఎన్ఆర్జీఎస్ డైరెక్టర్ షణ్ముఖ్‌కుమార్ చెప్పారు. మండలంలోని పలు గ్రామాల్లో నూతనంగా నిర్మించిన రోడ్లను కలెక్టర్ తమీమ్ అన్సారియా, కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డిలతో కలిసి బుధవారం ప్రారంభించారు. ఉపాధిహామీ నిధులతో మండలంలోని నేరేడుపల్లి గ్రామం నుంచి దళితకాలనీకు 60లక్షల రూపాయలతో తారురోడ్డు, జంగాలపల్లిలో 30లక్షల రూపాయలతో సీసీరోడ్లను ఇటీవల నూతనంగా నిర్మించారు. జంగాలపల్లిలో జరిగిన వాటర్‌షెడ్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన షణ్ముఖ్‌కుమార్ ఆ రెండు గ్రామాల్లో నిర్మించిన రోడ్లను కలెక్టర్, ఎమ్మెల్యే ఉగ్రతో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డీఈ శ్రీధర్‌రెడ్డి, ఏఈ తిరుపాలయ్య, టీడీపీ ఒంగోలు పార్లమెంట్ ఉపాధ్యక్షుడు గడ్డం బాలసుబ్బయ్య, సర్పంచ్ పల్లా మల్లికార్జున తదితరులు ఉన్నారు.


రిలయన్స్‌కు కేటాయించిన భూమి గురించి వివరాలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్, ఎమ్మెల్యే

బయోగ్యాస్ ప్లాంట్‌కు భూమి పరిశీలన

రిలయన్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న బయోగ్యాస్ కోసం కేటాయించిన భూమిని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డితో కలిసి బుధవారం పరిశీలించారు. ఇటీవల రాష్ట్రంలో బయోగ్యాస్ ప్లాంట్‌లను ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చిన రిలయన్స్ సంస్థ ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంది. అందులో భాగంగా రాష్ట్రంలోనే మొట్టమొదటిసారిగా నియోజకవర్గంలోని పీసీపల్లి మండలంలో ప్లాంట్ ఏర్పాటుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశించారు. ఈ ప్లాంట్ నిర్మాణం కోసం మండలంలోని వెంగళాయపల్లి సమీపంలో సర్వేనెంబరు 652లో ఉన్న 475.57 ఎకరాల ప్రభుత్వ భూమిని ఎంపికచేశారు. త్వరలో ప్లాంట్ ఏర్పాటుకు భూమిపూజ చేయనున్నారు.అందులో భాగంగా కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డిలు భూమిని పరిశీలించారు. కార్యక్రమం ఖరారయ్యేలోపు భూమిపూజకు అనువైన స్థలాన్ని ఎంపిక చేయడంతో పాటు ఏర్పాట్లు చేసుకోవాలని తహసీల్దార్ ఉష, రెవెన్యూ అధికారులను కలెక్టర్, ఎమ్మెల్యే ఆదేశించారు.

మార్కాపురం జిల్లా ఏర్పాటు తథ్యం

మున్సిపల్ శాఖ మంత్రి స్పష్టత ఇచ్చారు
ఈ నెల 8 నుంచి ప్రజాదర్బార్
రెండేళ్లలో వెలిగొండ పూర్తి
ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి

మార్కాపురం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మార్కాపురం జిల్లా ఏర్పాటు తథ్యమని, మంగళవారం మున్సిపల్ శాఖామంత్రి పి.నారాయణ స్పష్టత ఇచ్చారని ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి చెప్పారు. ప్రజా సమస్యల పరిష్కారానికి త్వరలో ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. స్థానిక జవహర్‌నగర్ కాలనీలోని టీడీపీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. నియోజకవర్గవ్యాప్తంగా ప్రజలు సమస్యలపై జిల్లా కేంద్రానికి వెళ్లి సమస్యలను తెలియజేస్తున్నారన్నారు. అంతేకాక డివిజన్ కేంద్రంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో కూడా ప్రతి సోమవారం సమస్యలపై ప్రజలు విరివిగా వస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో అన్ని శాఖల అధికారులతో ప్రతి శనివారం ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. పట్టణంతోపాటు అన్ని మండలాల నుంచి ప్రజలు సమస్యలపై వచ్చి తెలియజేయాలని కోరారు. పరిష్కరించదగిన సమస్యలు నేరుగా అక్కడే పరిష్కరిస్తామన్నారు. మిగిలిన సమస్యలకు నిర్ణీత కాలంలో పరిష్కారం చూపుతామన్నారు. వచ్చే బడ్జెట్‌లో పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టుకు రూ.2 వేల కోట్లు కేటాయించేలా జిల్లాలోని ప్రజాప్రతినిధులు ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తామన్నారు. మరో రెండేళ్లలో ప్రాజెక్టు కూడా తప్పక పూర్తవుతుందని ధీమా వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి రూ.1,200 కోట్లతో మరో రెండు రోజుల్లో టెండర్లు పిలవనున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో నీటి కోసం ఇబ్బందులు తలెత్తకుండా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. మంగళవారం మార్కాపురంలో జరిగిన రథసప్తమి వేడుకలను అందరూ సమన్వయంతో విజయవంతం చేసిన అన్ని శాఖలకు ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. సమావేశంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి సత్యనారాయణ, పట్టణ పార్టీ అధ్యక్షులు షేక్ మౌలాలి, టీడీపీ మండల అధ్యక్షుడు జవ్వాజి రామాంజులరెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్లు గుంటక సుబ్బారెడ్డి, కాకర్ల శ్రీనివాసులు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ షేక్ షెక్షావలి, కౌన్సిలర్ నాలి కొండయ్య, మయూరి ఖాశిం, పఠాన్ ఇబ్రహీం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

ఓపెన్ పరీక్షా విధానంలో మార్పులు

పది, ఇంటర్ రెగ్యులర్, ఓపెన్ విద్యార్థులకు ఒకేసారి పరీక్షలు
'ప్రైవేటు' పరీక్షల్లో అక్రమ దందాకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వ నిర్ణయం

ఒంగోలు విద్య, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : ఏపీ సార్వత్రిక విద్యాపీఠం(ఓపెన్ స్కూలు సొసైటీ) పదో తరగతి, ఇంటర్ పబ్లిక్ పరీక్షల నిర్వహణలో ప్రస్తుత విద్యా సంవత్సరంలో కీలక మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ఓపెన్ స్కూలు సొసైటీ పరీక్షల నిర్వహణలో కొన సాగుతున్న అక్రమ దందాకు చెక్ పెట్టేందుకు కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. గత ఏడాది వరకు పది, ఇంటర్ రెగ్యులర్, ఓపెన్ విద్యార్థులకు వేరువేరుగా పరీక్షలు నిర్వహించేవారు. ప్రస్తుత విద్యాసంవత్సరంలో ఆ విధానానికి స్వస్తి చెప్పి ఒకేసారి పరీక్షలు నిర్వహించాలని పాఠశాల విద్యా కమిషనర్ ఉత్తర్వులు జారీచేయడంతో ఆ మేరకు ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ చర్యలు చేపట్టారు. ఓపెన్ స్కూలు సొసైటీ ఇంటర్ విద్యార్థులకు కూడా రెగ్యులర్‌తో పాటు పరీక్షలు నిర్వహించాలని ప్రభుత్వ ఇంటర్ బోర్డును ఆదేశించింది.

ఒకే కేంద్రంలో ఓపెన్, రెగ్యులర్ విద్యార్థులు

ఈ ఏడాది మార్చి 17నుంచి పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రారంభంకానుండగా అదే రోజు నుంచి ఓపెన్ విద్యార్థులకు కూడా పబ్లిక్ పరీక్షలు నిర్వహిస్తారు. రెగ్యులర్ విద్యార్థుల పరీక్షా కేంద్రాలకు ఓపెన్ స్కూలు సొసైటీ పదో తరగతి విద్యార్థులనూ కేటాయిస్తారు. జిల్లాలో ఈ ఏడాది ఓపెన్ స్కూలుస్టడీసెంటర్లలో పదో తరగతికి సుమారు 1300 మంది విద్యార్థులు నమోదు కాగా, గతంలో ఫెయిలైన విద్యార్థులు సుమారు 2500 మంది కూడా పరీక్షలకు హాజరుకానున్నారు. పరీక్షా కేంద్రాలకు 80:20 నిష్పత్తిలో విద్యార్థులను కేటాయించనున్నారు.

ఇంటర్ పరీక్షలకూ ప్రత్యేక ఏర్పాట్లు

ఓపెన్ స్కూలు సొసైటీ ఇంటర్ పరీక్షల ఏర్పాట్ల బాధ్యతను ఆర్జేడీ, డీఈవోలకు అప్పగించారు. జిల్లాస్థాయిలో పరీక్షా కేంద్రాల ఏర్పాటు, చీఫ్‌లు, డిపార్ట్‌మెంట్ అధికారుల నియామకాలు ఇతర ఏర్పాట్లకు సంబంధించిన ప్రణాళికలను జిల్లా కలెక్టర్ ఆమోదంతో అమలు చేయనున్నారు. జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు అందుబాటులో ఉంటే వారి సేవలను వినియోగించుకోనున్నారు. హైస్కూలు హెచ్ఎంలు, సీనియర్ స్కూలు అసిస్టెంట్లను చీఫ్‌లు, డీవోలుగా నియమించనున్నారు.

రోజు మార్చి రోజు పరీక్షలు

ఓపెన్ ఇంటర్ విద్యార్థులకు మార్చి 3నుంచి 15 వరకు రోజు మార్చి రోజు పరీక్షలు జరుగుతాయి. 3న ఇంగ్లీషు, 5న హిందీ, తెలుగు, ఉర్దూ, 7న రసాయనశాస్త్రం, ఆర్థికశాస్త్రం, సామాజిక శాస్త్రం, 10న భౌతికశాస్త్రం, రాజనీతి శాస్త్రం, మనో విజ్ఞానశాస్త్రం, 12న గణితం, చరిత్ర, వ్యాపారగణాంక శాస్త్రం, 15న జీవ శాస్త్రం, వాణిజ్య/వ్యాపారశాస్త్రం, గృహ విజ్ఞాన శాస్త్రం పరీక్ష జరుగుతుంది. ఉదయం 9నుంచి 12 వరకు పరీక్ష జరుగుతుంది.

గ్రామీణ వైద్యులు ప్రాథమిక చికిత్స మాత్రమే చేయాలి

- నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు
- డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్లు హెచ్చరిక

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ వైద్యులు కేవలం ప్రాథమిక చికిత్స మాత్రమే చేయాలని, అంతకు మించి వైద్యసేవలు అందిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని డీఎంహెచ్‌వో డాక్టర్ టి.వెంకటేశ్వర్లు హెచ్చరించారు. స్థానిక రెడ్‌క్రాస్ భవన్‌లో గురువారం జిల్లా గ్రామీణ వైద్యుల సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామీణ వైద్యులు నిర్వహించే ప్రాథమిక చికిత్సలపై తగు సూచనలు చేశారు. గ్రామాల్లో అర్హతకు మించి వైద్యసేవలు అందించకూడదని, ఆ విధంగా వైద్యం చేస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. చికిత్స కేంద్రాలలో కేవలం ప్రాథమిక చికిత్సకు అవసరమైన మందులు మాత్రమే ఉండాలన్నారు. ప్రజల ప్రాణాలకు ముప్పు తెచ్చే హానికరమైన మందులు వారి పరిధిలో ఉండకూడదని, ఇటువంటి ఉన్నట్లు గుర్తిస్తే వెంటనే చర్యలు తప్పవని డీఎంహెచ్‌వో హెచ్చరించారు. ఎక్కడైనా గుర్తించిన సంక్రమణ వ్యాధులు ఉన్నట్లు అయితే వెంటనే సమీప ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి లేదా జిల్లా వైద్యాధికారికి సమాచారం అందించాలన్నారు. ఔషధనియంత్రణ అధికారి జ్యోతి మాట్లాడుతూ గ్రామీణ వైద్యుల వద్ద ఎటువంటి అనుమతులు లేని మందులు, వైద్య పరికరాలు ఉండకూడదన్నారు. గ్రామీణ వైద్యుడు పరిమితికి మించి వైద్యం చేస్తే ప్రజల ప్రాణాలకు ముప్పువాటిల్లే ప్రమాదం ఉందని, అందువల్ల నిబంధనలు తప్పకుండా పాటించాలని చెప్పారు. ప్రాణాంతకమైన వైద్యసేవలు అందిస్తే ఏడేళ్ల జైలు శిక్ష, రూ.లక్షకు పైబడి జరిమానా ఉంటుందని హెచ్చరించారు. కార్యక్రమంలో మాస్ మీడియా అధికారి డి.శ్రీనివాసరావు, గ్రామీణ వైద్యుల సంఘం అధ్యక్షుడు శివయ్య, కార్యదర్శి చంద్రశేఖర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ నాగరాజు, బాలాజీ, సుధాకర్ పాల్గొన్నారు.

పనిభారాన్ని తగ్గించాలి

అఫీఇఫీ

జిల్లాలోని అన్ని ఉద్యోగ సంఘాలను జేఏసీలోకి తెస్తాం
కాంట్రాక్టు, గ్రామ రెవెన్యూసహాయకులకు వేతనాలు పెంచాలి
జేఏసీ అమరావతి జిల్లా చైర్మన్ పిన్నిక



మాట్లాడుతున్న జిల్లా చైర్మన్ మధుసూదన్‌రావు

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో రెవెన్యూ ఉద్యోగులపై పనిభారం పెరిగిందని, ఆ భారం తగ్గించే విధంగా ఏపీ జేఏసీ అమరావతి ప్రత్యేక చొరవ తీసుకోవాలని జిల్లా జేఏసీ చైర్మన్, రెవెన్యూ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పిన్నిక మధుసూదన్‌రావు కోరారు. విజయవాడలోని జేఏసీ కార్యాలయంలో బుధవారం జరిగిన రాష్ట్ర కమిటీ సమావేశంలో జిల్లాకు సంబంధించిన పలుఅంశాలను ప్రస్తావించారు. పనిఒత్తిడితో రెవెన్యూ ఉద్యోగులు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. జిల్లాలో అన్ని ఉద్యోగ సంఘాలను ఏపీ జేఏసీ అమరావతిలో భాగస్వామ్యంచేసే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. అన్ని ఉద్యోగ సంఘాలకు ఒక వేదిక మీదకు తెచ్చి ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు జేఏసీ ముందుంటుందన్నారు. కాంట్రాక్టు ఉద్యోగులు, గ్రామ రెవెన్యూ సహాయకులకు వేతనాలు పెంచాలని, ఉద్యోగోన్నతులు కల్పించాలని చెప్పారు.

ఉన్నాయో.. లేవో..

(5వ పేజీ తరువాయి)

ఉపకరించే పలు రకాలయంత్ర పరికరాలను అందజేశారు.కొన్ని గ్రూపులకు ట్రాక్టర్లతోపాటు పరికరాలను కలిపి ఇచ్చారు. జిల్లాలో 616 రైతు భరోసా కేంద్రాలు(ఆర్బీ కేలు) ఉండగా 611 ఆర్బీకేల పరిధిలోని రైతులకు గత వైసీపీ ప్రభుత్వంలో వ్యవసాయ పరికరాలను ఇచ్చారు. అధికార వర్గాల సమాచారం ప్రకారం జిల్లాలో మొత్తం 611 గ్రూపులకు రూ.59.53 కోట్ల విలువైన 5,098 పరికరాలు అందజేశారు. అందులో ట్రాక్టర్లు కేవలం 365 మాత్రమే కాగా మిగతావాటిలో నాగళ్లు, విత్తనాలు, ఎరువులు ఎదబెట్టే గొర్రులు, స్ప్రేయర్లు వంటివి ఉన్నాయి. మొత్తం విలువలో ప్రభుత్వ సబ్సిడీ రూ.20.77 కోట్లు (40శాతం) మాత్రమే కాగా మిగిలిన 50శాతం బ్యాంకు రుణాలుగా, మిగిలిన పదిశాతం లబ్ధిదారుని వాటాగా ఉంది. ఒక్కో ఆర్బీకే పరిధిలో ఒక్కో గ్రూపునకు ఇవ్వడంతో జిల్లాలో దాదాపు అన్ని గ్రామాల్లో ఇవి ఉన్నాయి.

మార్కాపురం సబ్‌డివిజన్‌లో అధికం

స్థానిక అధికారులతో కాకుండా ఒక సబ్ డివిజన్ అధికారిని మరొక సబ్ డివిజన్‌లో పరిశీలనకు నియమించారు. అంటే ఒంగోలు సబ్ డివిజనల్ అధికారిగా ఉండే వ్యవసాయశాఖ ఏడీ సింగరాయకొండ సబ్ డివిజన్ పరిధిలో, అక్కడి ఏడీ మరో సబ్ డివిజన్‌లో ఈ పరిశీలన చేస్తారు. మార్కాపురం సబ్ డివిజన్‌లో ఆరోపణలు అధికంగా ఉండటంతో డిప్యూటీ డైరెక్టర్ సుబ్రమణేశ్వరరావును నియమించారు. ఇటీవల కంభం ప్రాంతంలో స్వయంగా డీఏవో శ్రీనివాసరావు పరిశీలించారు. ప్రధానంగా గతంలో ఇచ్చిన వ్యవసాయ యంత్ర పరికరాలు వినియోగంలో ఉన్నాయా లేక పనికిరాకుండా పోయాయా? ఎవరైనా అమ్ముకున్నారా? అన్న అంశాలను పరిశీలిస్తున్నారు. దీనిపై డీఏవో శ్రీనివాసరావు మాట్లాడుతూ..మరోవారంలో సర్వే పూర్తవుతుందన్నారు. ఎక్కడైనా అవకతవకలు తేలితే చర్యలు తీసుకుంటామన్నారు.

రూ.200 కోట్లతో నగర అభివృద్ధి

(5వ పేజీ తరువాయి)

మొత్తం రూ.200 కోట్లు అవసరం ఉందని తెలిపారు. ఇప్పటికే రూ.20 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, ఫిబ్రవరి, మార్చిలో మరో రూ.40 కోట్లకు టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ప్రజల అవసరాలను గుర్తించి, ప్రాధాన్యత ప్రకారం డ్రైన్లు, సీసీ రోడ్లు, విద్యుత్ సమస్యల, పారిశుధ్యం మెరుగు, నగరంలో పార్కులు, సెంటర్ డివైడర్ల అభివృద్ధి చేపట్టినట్లు తెలిపారు. రోడ్ల విస్తరణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఊరచెరువులోని కొత్త కూరగాయల మార్కెట్ నుంచి రూ.12 కోట్ల అద్దె వసూలు కావాల్సి ఉందన్నారు. గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే ఇంత పెద్దమొత్తంలో బకాయిలు పేరుకుపోయాయని దామచర్ల విమర్శించారు. డ్రైన్ల నిర్మాణంలో ఆక్రమణలు ఉంటే తొలగిస్తారని పేర్కొన్నారు. పారిశుధ్యం మెరుగుతోపాటు ప్రజలకు ప్రతిరోజు తాగునీరు ఇవ్వడానికి అసవరమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అమృత్ -1 కింద రూ.126 కోట్లతో గుండ్లకమ్మ నుంచి పైపులైను వేయగా, సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌లకు నీరు వస్తుందన్నారు. అమృత్-2 మరో రెండేళ్లలో రామతీర్థం నుంచి నీరు తీసుకొచ్చి తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపనున్నట్లు తెలిపారు. సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్. విజయ్‌కుమార్ మాట్లాడుతూ నగర పరిధిలోని పేర్నమిట్ట అభివృద్ధికి కృషిచేస్తున్నానని తెలిపారు. పేర్నమిట్ట చెరువును ఎస్ఎస్ ట్యాంకుగా మార్చాలని కోరారు. అక్కడ పారిశుధ్యం మెరుగుపరచాలన్నారు. అవసరమైన సీసీ రోడ్లు, కాలువలు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు బీఎన్ తెలిపారు. డిప్యూటీ మేయర్ వేమూరి వెంకటసూర్యనారాయణ మాట్లాడుతూ.. ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు, అధికారుల సమన్వయంతో కౌన్సిల్ అజెండాలో చర్చించి ఆమోదం పొందిన పనులను త్వరలోనే చేపడతామన్నారు. కమిషనర్ డాక్టర్ కోడూరు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఒంగోలును ప్లాస్టిక్ రహిత నగరంగా మార్చుతామని, ఇందుకు ప్రజలు సహకరించాలని కోరారు.

లాటరీ పేరుతో దోపిడీ

(5వ పేజీ తరువాయి)

నగరంలో కొత్తేమీ కాకపోయినా ఈ మధ్యకాలంలో అధికమైంది. ఒకరిద్దరు వ్యక్తులు ఈ లాటరీ దందా నడిపిస్తున్నారు. రోజుకు లక్షల రూపాయలు చేతులు మారుతున్నాయి. అనధికారికంగా ఇలాంటి తంతు జరుగుతుంటే పట్టించుకునే నాథుడు లేరు. నాలుగు నంబర్లు ఉన్న చీటీని రూ.60కు కొనుగోలు చేస్తారు. మధ్యాహ్నం 12 నుంచి 6 గంటల వరకు వేర్వేరు పేర్లతో ఈ లాటరీ ఫలితాలు వస్తూ ఉంటాయి. కేవలం ఏజెంట్లు చెప్పిన నంబర్లకు మాత్రమే ప్రైజ్ తగులుతుంది. అసలు ఆ నంబర్లు ఎలా కేటాయిస్తారు? ఎక్కడ నుంచి ఫలితాలు వస్తాయి? అంటే కేరళ నుంచి అని ఏజెంట్లు నమ్మబలుకుతున్నారు.

ఉదయం నుంచి 12 గంటల వరకు విక్రయం

ఎక్కువగా కూలీలు పనిచేసే ప్రాంతాలలో ఈ లాటరీ టికెట్ల విక్రయాలు చేపడతారు. నగరంలో కేశవస్వామిపేట సెంటర్, జయరాం సెంటర్ కొండ మీద, అద్దంకి బస్టాండ్ సెంటర్, నవభారత్ థియేటర్ సెంటర్, ట్రంక్ రోడ్డులోని కేరళ బేకరీ సమీపంలో, సంతపేట సాయి బాబా గుడి వెనుక, కొత్త మార్కెట్, మస్తాన్‌దర్గా సెంటర్లతోపాటుగా నగర శివార్లలో కూడా ఏజెంట్లు బైక్‌లపై వెళ్లి మహిళలతో కూడా లాటరీ చీటీలు కొనుగోలు చేయిస్తున్నారు.

12 గంటల నుంచి గంటగంటకు ఫలితాలు

ఒక్కో గంటకు ఒక్కో లాటరీ ఫలితం వస్తుంది. నాలుగు నంబర్లు కలిగిన చీటీ రూ.60, రూ.75 ఉంటాయి. నాలుగు నంబర్లలో చివరి అంకె కలిస్తే రూ.100, రెండు అంకెలు కలిస్తే రూ.1000, చివరి మూడు అంకెలు కలిస్తే రూ.25వేలు వస్తాయి అని నమ్మబలుకుతారు. అయితే ఇంతవరకు నగరంలో రూ.25 వేలు వచ్చిన వారు ఎవ్వరూ లేకపోవడం గమనార్హం. ఎక్కువ మందికి చివరి ఒక అంకె మాత్రమే కలుస్తుంది. ఇలా ప్రతిరోజూ సామాన్యుల ఆశను పెట్టుబడిగా చేసుకొని లక్షల్లో కొల్లగొడుతున్నారు

కన్నెత్తిచూడని పోలీసులు

నగరంలో నిత్యం లక్షల రూపాయల్లో లాటరీ పేరుతో దోపిడీ జరుగుతుంటే పోలీసులు కన్నెత్తిచూసిన పాపాన పోలేదు. ఓ విశ్రాంత పోలీసు అధికారి మధ్యవర్తిత్వం చేసి లాటరీ నడిపే యజమాని నుంచి పోలీసులకు మామూళ్లు చేర్చుతున్నారని ప్రచారం ఉంది. ఈ కారణంగానే లాటరీ దందా విచ్చలవిడిగా సాగుతున్నా పట్టించుకోవడం లేదని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

పదింతల కృషితో...

ఏడుగురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపిక



ప్రత్యేక క్లాసులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలే లక్ష్యంగా ఉపాధ్యాయులు ప్రత్యేక క్లాసులు

- 47 మంది విద్యార్థుల ఉత్తీర్ణతే లక్ష్యంగా ప్రణాళిక
- 2004 నుంచి ఏటా నూరుశాతం ఫలితాలు

కృషితో నాస్తి దుర్భిక్షం.. చదువులోనైనా, చేసే పనిలోనైనా శక్తి మేరకు కష్టపడితే అద్వితీయమైన ఫలితాలు సాధించవచ్చు. ఈ సూత్రాన్నే నమ్మి ఆచరిస్తున్నారు ముండ్లమూరు మండలంలోని ఉమామహేశ్వరపురం అగ్రహారం జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు. పకడ్బందీగా ప్రణాళికలు, సమర్థ కార్యాచరణతో ఈ ఏడాది మార్చిలో జరగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో నూరు శాతం ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తున్నారు. అందుకు విభిన్న పద్ధతులను అమలు చేస్తున్నారు.



ముండ్లమూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఉమామహేశ్వరపురం అగ్రహారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ ఏడాది మార్చిలో జరిగే పబ్లిక్ పరీక్షల్లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించేదిశగా ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టిపెట్టారు. రోజూ పాఠశాల ప్రారంభానికి ముందు, పాఠశాల విడిచిన అనంతరం రెండు గంటల పాటు ప్రత్యేక క్లాసులు నిర్వహిస్తున్నారు. అందుకు ప్రధానోపాధ్యాయులతో పాటు ఆయా సబ్జెక్టుల ఉపాధ్యాయులు ప్రత్యేక క్లాసులు తీసుకుంటున్నారు. సెలవు దినాల్లో సైతం క్లాసులు పెట్టి ప్రోత్సహిస్తున్నారు. ఏయే సబ్జెక్టుల్లో వెనుకబడి ఉన్నారో గుర్తించి వారి కోసం ప్రత్యేకంగా క్లాసులు నిర్వహిస్తున్నారు.

పరీక్షలకు సన్నద్ధం ఇలా...

- 500 నుంచి 600లోపు మార్కులు వచ్చే విద్యార్థులు ఏ గ్రేడు
- 400 నుంచి 500 మధ్య వచ్చే విద్యార్థులను బీ గ్రేడు
- 300 నుంచి 400 మధ్య మార్కులు వచ్చే వారిని సీ గ్రేడు
- మిగతా వారు డీ గ్రేడు
- బాగా వెనుకబడిన వారు ఉత్తీర్ణత అయ్యే విధంగా, బాగా చదివే విద్యార్థులు అత్యధిక మార్కులు తెచ్చుకునే విధంగా తీర్చిదిద్దుతున్నారు.
- ఏ సబ్జెక్టులో వెనుకబడి ఉన్నారో సంబంధిత ఉపాధ్యాయులు వారి కోసం అదనపు క్లాసులు తీసుకుంటున్నారు.
- ఏవారానికి ఆ వారంలో చదివించిన సబ్జెక్ట్‌లపై పరీక్షలు నిర్వహిస్తారు
- వచ్చిన మార్కుల ఆధారంగా కార్యాచరణ

పాఠశాల ప్రత్యేకతలివీ...

- ఉమామహేశ్వరపురం అగ్రహారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2004లో ప్రారంభించారు. అప్పటి నుంచి ప్రతిఏటా నూరు శాతం ఫలితాలు సాధిస్తూ జిల్లాలోనే ఉత్తమ పాఠశాలగా గుర్తింపు తెచ్చుకుంది.
- గత ఏడేళ్ల నుంచి ప్రతి ఏడాది ట్రిపుల్ ఐటీకి ఆ పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎంపికవుతున్నారు.
- పూర్వ విద్యార్థులు సాధు అనీల్ కుమార్‌రెడ్డి, సాధు కోమలి, సాధు లీలావతి, గూడాల కిరణ్మయి, గుంటూరు రాధా, చొప్పరపు శిరీషాతో పాటు మరి కొంత మంది నూజివీడు, ఇడుపులపాయలోని ట్రిపుల్ ఐటీ కళాశాలలో విద్యనభ్యసిస్తున్నారు.

నూరు శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ప్రత్యేక క్లాసులు

బా.శెట్టి శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయులు



మా పాఠశాలలో ఈ ఏడాది 47 మంది విద్యార్థులు పబ్లిక్ పరీక్షలకు సిద్ధమవుతున్నారు. ప్రతి విద్యార్థి ఉత్తీర్ణతే లక్ష్యంగా నెల రోజుల నుంచి ప్రత్యేక క్లాసులు తీసుకుంటున్నాం. ఈసారి ఎక్కువ మంది విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యేందుకు సాధన చేస్తున్నాం.

ప్రతి సబ్జెక్టులో ఉత్తీర్ణత సాధించేలా తర్ఫీదు

చెన్నుపల్లి శ్రీనివాసరావు, హిందీ ఉపాధ్యాయుడు



పదో తరగతి విద్యార్థులందరూ ప్రతి సబ్జెక్టులో ఉత్తీర్ణతే లక్ష్యంగా రోజూ ఉదయం రెండు, సాయంత్రం రెండు గంటల పాటు ప్రత్యేక క్లాసులు తీసుకుంటున్నాం. అందరూ ఆయా సబ్జెక్టుల్లో మంచి మార్కులు సాధించాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నాం.

మండల టాపర్‌గా నిలిచేందుకు కృషి

వేముల శ్రీరాం, విద్యార్థి



మండలంలో టాపర్‌గా నిలిచేందుకు కృషి చేస్తున్నా. నెల రోజుల నుంచి రోజూ ఉదయం, సాయంత్రం ప్రత్యేక క్లాసులు నిర్వహిస్తున్నారు. వీటిని ఉపయోగించుకొని 550 మార్కులకు పైగా సాధించాలని లక్ష్యంగా నిర్ణయించుకొని చదువుతున్నా.

ఉత్తీర్ణత కోసం కష్టపడి చదువుతున్నాం

రాచకొండ స్వాతి



పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తీర్ణత కోసం మా ఉపాధ్యాయులు రోజూ ప్రత్యేక క్లాసులు నిర్వహిస్తున్నారు. ఇది మాకెంతో ఉపయోగంగా మారింది. ప్రతి విద్యార్థి ఉత్తీర్ణతే లక్ష్యంగా ఉపాధ్యాయులు చేస్తున్న కృషిని దృష్టిలో ఉంచుకొని కష్టపడి చదువుతున్నా.

ట్రిపుల్ ఐటీలో సీటు కోసం కష్టపడుతున్నా

ఈ ఏంజలి



ప్రత్యేక క్లాసులతో మంచి మార్కులు రావటానికి దోహద పడుతుంది. మంచి మార్కులు తెచ్చుకొని ట్రిపుల్ ఐటీ కళాశాలకు ఎంపిక కావాలని కష్టపడి చదువుతున్నా.

పురుషులకూ డ్వాక్రా తరహా సంఘాలు

ఏర్పాటులో మెప్మా అధికారులు

ఇప్పటికే రెండు గ్రూపుల ఏర్పాటు

చేసే వృత్తిని బట్టి రుణపరపతి

గిద్దలూరు టౌన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మహిళలను ఆర్థిక పరిపుష్టి చేయడానికి రూపొందించిన డ్వాక్రా సంఘాల మాదిరిగా ఆర్థికంగా వెనుకబడిన పురుషులకు స్వయం ఉపాధి కల్పించడానికి కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. పురుషులతో సంఘం ఏర్పాటు చేసి రుణాలు అందివ్వడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా గిద్దలూరులో పురుషుల డ్వాక్రా సంఘాల ఏర్పాటుకు మెప్మా అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఒక్కో సంఘానికి 5 నుంచి 10 మంది వరకు సభ్యులు ఉంటారు. మార్చి వరకు 7 సంఘాల ఏర్పాటుకు లక్ష్యం చేయగా ఇప్పటికే 2 సంఘాలు ఖరారయ్యాయి. మిగతా 5 సంఘాల ఏర్పాటుకు ఆర్పీలు ఇంటింటికి వెళ్లి అర్హులైన పురుషులను ఎంపిక చేస్తున్నారు. ఈ సంఘాలకు ముందుగా 10 నుంచి రూ.15వేలు రుణాలు ఇస్తారు. రుణాల చెల్లింపు సక్రమంగా ఉంటే రుణపరిమితి 75వేల నుంచి 1లక్ష వరకు పెరుగుతుంది. లక్ష్యం పూర్తి కాగానే నమోదైన డ్వాక్రా సంఘాల సభ్యుల జాబితాను ప్రభుత్వానికి పంపనున్నారు. ఆమోదం రాగానే రుణాల మంజూరు ప్రక్రియ ప్రారంభిస్తారు.



అర్హతలు ఇవే...

పలు రంగాలలో పని చేసే కార్మికులు, కూలీలను పురుషుల డ్వాక్రా సంఘాలకు అర్హులుగా ప్రభుత్వం నిర్ణయించింది. భవన నిర్మాణ, పారిశుధ్య కార్మికులు, ఎలక్ట్రీషియన్లు, ఆటో, రిక్షా కూలీలు, కార్పెంటర్లు, ప్లంబర్లు, పని చేసే వారు అర్హులు. వీరిని ఆర్పీలు గుర్తించి సంఘాలుగా ఏర్పాటు చేస్తారు. వారు తమ వృత్తిలో నైపుణ్యం పెంచుకోవడానికి కావలసిన సహాయ సహకారాలు అందిస్తారు.

సంఘాలు ఏర్పాటు చేసేది ఇలా

ప్రభుత్వం నిర్ణయించిన వృత్తులు చేపట్టే పురుషులు డ్వాక్రా సంఘంలో చేరడానికి 18 నుంచి 59 ఏళ్ల వయస్సు లోపు వారై ఉండాలి, అర్హత కలిగినవారిని ఆర్పీలు 5 నుంచి 10 మందిని ఒక గ్రూపుగా తయారుచేస్తారు. వీరిలో ఇద్దరిని ఫస్ట్, సెకెండ్ లీడర్‌గా నియమిస్తారు. తరువాత లీడర్ల పేరున బ్యాంక్ ఖాతా తెరుస్తారు. బ్యాంక్ ఖాతా, గ్రూపు సభ్యుల ఆధార్, తెల్లరేషన్‌కార్డుల వివరాలు మెప్మా కార్యాలయంలో అందిస్తారు. అక్కడి నుంచి ప్రతినెలా గ్రూపు సభ్యులు తమసంఘం బ్యాంక్ ఖాతాలో 100 రూపాయలు జమ చేయాలి.



ప్రక్రియ ప్రారంభం

ప్రసాద్, మెప్మా అధికారి, గిద్దలూరు

ఆర్పీల ద్వారా పురుషుల డ్వాక్రా సంఘాల ఏర్పాటు ప్రక్రియ ప్రారంభించాం. ఇప్పటికి రెండు సంఘాల తయారు చేశాం. వీరికి రుణాలు మంజూరవుతాయి. తరువాత సభ్యుల వృత్తికి తగ్గట్లుగా రుణ పరిమితి పెరుగుతుంది.

ఇంజక్షన్ వికటించి గర్భిణి మృతి

కంభం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఐరన్ ఇంజక్షన్ వికటించి గర్భిణి మృతిచెందిన ఘటన అర్ధవీడు ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో బుధవారం చోటు చేసుకొంది. ఈ ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. అర్ధవీడు మండలం పాపినేనిపల్లికి చెందిన మీనిగ అల్లూరమ్మ(43) 8 నెలల గర్భిణి. ఆమెకు రక్తం తక్కువగా ఉండడంతో అర్ధవీడు పీహెచ్‌సీ సిబ్బంది ఐరన్ ఇంజక్షన్లు తీసుకోవాలని వైద్యులు సూచించారు. బుధవారం ఉదయం కూడా ఐరన్ ఇంజక్షన్ వేయించుకునేందుకు ఆమె పీహెచ్‌సీకి వచ్చారు. ఇంజక్షన్ ఇచ్చిన కొద్ది సేపటికే ఆమెకు రియాక్షన్‌తో ఫిట్స్ వచ్చాయి. దీంతో ఆమె అపస్మారక స్థితికి వెళ్లారు. ఆమె బంధువులు తమ సొంత వాహనంలో కంభం ప్రభుత్వ వైద్యశాలకు తీసుకొచ్చారు. వైద్యసిబ్బంది పరీక్ష చేయగా అల్లూరమ్మ అప్పటికే మృతిచెందినట్లు తెలిసింది. బంధువులు మృతదేహాన్ని గ్రామానికి తీసుకెళ్లారు.

వైద్యశాలలను సందర్శించిన డిప్యూటీ డీఎంహెచ్‌వో పద్మావతి

విషయం తెలుసుకున్న మార్కాపురం డిప్యూటీ డీఎంహెచ్‌వో పద్మావతి కంభం ప్రభుత్వ వైద్యశాలకు వచ్చి విచారణ చేసినట్లు తెలిసింది. అనంతరం అర్ధవీడు పీహెచ్‌సీకి విచారణ కోసం వెళ్లారు. విషయం తెలుసుకునేందుకు విలేకరులు డిప్యూటీ డీఎంహెచ్‌వోకు ఫోన్ చేసినా ఎటువంటి సమాధానం రాలేదు.

కంభం వైద్యశాల సూపరింటెండెంట్ వివరణ

ఈ విషయమై కంభం ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ శిరీష ప్రియదర్శిని వివరణ కోరగా గర్భిణికి అర్ధవీడులో ఐరన్ ఇంజక్షన్ వేసిన తరువాత ఫిట్స్ రావడంతో ఆమెను కంభం వైద్యశాలకు తరలించారని, ఇక్కడి వచ్చేలోపే మరణించిందని ఆమె తెలిపారు. అప్పటికే తాము ప్రాథమిక చికిత్స అందించిన ఫలితం లేకుండా పోయిందన్నారు.

దారి దోపిడీ కేసులో ఇరువురికి మూడేళ్ల జైలు

కనిగిరి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : దారిదోపిడీ కేసులో ఇరువురికి మూడేళ్ల జైలుశిక్షతో పాటు రూ.20వేలు జరిమానా విధిస్తూ కనిగిరి జ్యుడీషియల్‌ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కే భరత్‌చంద్ర తీర్పు ఇచ్చారు. మర్రిపూడి మండలం గార్లపేటకు చెందిన నామాల వెంకటస్వామి తన భార్యతో కలసి వాయిదాల పద్ధతిలో దుప్పట్లు అమ్ముకుని జీవనం సాగిస్తున్నారు. వ్యాపారంలో వారికి వచ్చే స్వల్ప ఆదాయాన్ని కనిగిరి ఆంధ్రాబ్యాంకులో జమ చేసుకున్నారు. ఈ క్రమంలో 2022 సంవత్సరంలో కనిగిరి ఆంధ్రాబ్యాంకు నుంచి రూ. 3.5 లక్షల నగదును తీసుకుని టీవీఎస్ మోపెడ్‌పై వారి స్వగ్రామం గార్లపేటకు వెళ్తుండగా మార్గమధ్యంలో గార్లపేట రోడ్డులోని వేంకటేశ్వరస్వామి దేవాలయం చప్టా దాటిన తర్వాత మూల మలుపు వద్ద నిర్మానుష్య ప్రాంతంలో గుర్తు తెలియన ఇద్దరు వ్యక్తులు వారి కళ్ళలో కారం చల్లి వారి వద్ద ఉన్న రూ.3.5లక్షల నగదు సంచిని తీసుకుని ఉడాయించారు. ఈమేరకు కనిగిరి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. కేసు నమోదు అనంతరం పోలీసులు దర్యాప్తు చేపట్టగా కనిగిరి నియోజకవర్గంలోని హనుమంతునిపాడు మండలం సీతారాంపురానికి చెందిన షేక్ సుభాని, షేక్ కరిముల్లాగా పోలీసులు గుర్తించి అరెస్ట్ చేసి కోర్టుకు హాజరు పరిచారు. అనంతరం రెండేళ్ల పాటు జరిగిన విచారణలో నిందితులపై నేరం రుజువు కావటంతో న్యాయాధికారి మూడేళ్ల జైలు, రూ.20వేలు జరిమానా విధించారు.

సీఐ పాపారావు, సిబ్బందిని అభినందించిన ఎస్పీ

కనిగిరి పోలీస్‌స్టేషన్‌లో నమోదు చేసిన అప్పటి సీఐ పాపారావు, సమగ్ర దర్యాప్తు చేపట్టి నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ప్రాసిక్యూషన్ తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ రఘునాథరావు వాదించారు. గుడ్ ట్రయల్ మానిటరింగ్ ద్వారా సమర్థవంతంగా విధులు నిర్వహించిన అప్పటి కనిగిరి సీఐ పాపారావు కోర్టు కానిస్టేబుల్ ఆర్. రమేష్‌లను ఎస్పీ ఏఆర్ దామోదర్ అభినందించారు.

రైతు కష్టం దొంగలపాలు

గంటూరులో మిర్చి అమ్మి డబ్బుతో వస్తుండగా చోరీ

రైల్వేస్టేషన్‌లో బ్యాగ్ కత్తిరించి నగదును అపహరించిన దుండగలు

గిద్దలూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టపడి పని చేసి సంపాదించిన రైతుకష్టం క్షణాల్లో దొంగలపాలయ్యింది. రాచర్ల మండలం జేపీ చెరువు గ్రామానికి చెందిన రైతు బూరుగల కమలయ్య 6 ఎకరాలలో మిర్చి పంట సాగు చేశాడు. తొలి కోత కోసి పండిన మిర్చి బస్తాలను గుంటూరు మార్కెట్ యార్డుకు తీసుకెళ్లి విక్రయించాడు. వచ్చిన రూ.4 లక్షల సొమ్ముతో గుంటూరు రైల్వేస్టేషన్‌కు వచ్చి గిద్దలూరు వచ్చేందుకు రైలు ఎక్కుతుండగా, ప్రయాణికుల రద్దీని ఆసరాగా చేసుకుని దొంగలు కమలయ్య తగిలించుకున్న బ్యాగ్ కింది భాగాన్ని కోసి అందులో ఉన్న రూ.4లక్షలు దోచుకెళ్లారు. ఈ ఘటన మంగళవారం జరగ్గా ఆలస్యంగా వెలుగు చూసింది. దీంతో షాక్‌కు గురైన కమలయ్య తోటి రైతులతో కలిసి అదేరోజు రాత్రి గుంటూరు రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీసీ ఫుటేజ్ పరిశీలిస్తున్నామని రైల్వే పోలీసులు తెలిపారు.

వ్యవసాయాన్ని, కార్మికుల హక్కులను కాలరాస్తున్న కేంద్రం

కార్పొరేట్ శక్తులకు

అనుకూలమైన బడ్జెట్

ఒంగోలులో బడ్జెట్ ప్రతులను దహనం

చేసిన వివిధసంఘాల నేతలు

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ వ్యవసాయ రంగాన్ని తూట్లుపొడిచేలా ఉండటంతో పాటు కార్మికహక్కులను కాలరాసి మరింత బానిసలుగా మార్చేలా ఉందని రైతు సంఘాల నాయకులు, కార్మిక సంఘాలు, ప్రజాసంఘాల నాయకులు మండిపడ్డారు. కేంద్ర బడ్జెట్‌ను నిరసిస్తూ బుధవారం సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. ముందుగా స్థానిక కలెక్టరేట్ సమీపంలో ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద నుంచి చర్చి సెంటర్ వరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ వద్ద జరిగిన కార్యక్రమానికి కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరు రంగారావు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకొస్తున్న ప్రజా వ్యతిరేక ఆర్థిక విధానాలపై మండిపడ్డారు. కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వి.బాలకోటయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ దేశంలోని అన్ని వర్గాల ప్రజలకు వ్యతిరేకమైందన్నారు. పీడీఎఫ్ ఎయూ రాష్ట్ర అధ్యక్షుడు రాజశేఖర్ మాట్లాడుతూ ఇది పూర్తిగా ప్రజా వ్యతిరేక బడ్జెట్ అని మండిపడ్డారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి కల్పన మాట్లాడుతూ బడ్జెట్‌లో స్కీం వర్కర్లను, ఆశా వర్కర్లను అంగన్‌వాడీ, అసంఘటిత రంగ కార్మికులకు ఎటువంటి కేటాయింపులు లేవని ఆరోపించారు. ఏఐటీయూసీ నాయకులు ఉప్పుటూరి ప్రకాశరావు మాట్లాడుతూ బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం రాతపూర్వకంగా ఇచ్చిన హామీలను విస్మరించిందని మండిపడ్డారు. ఏఐఎఫ్‌టీయూ న్యూజిల్లా నాయకులు ఎ ఎంఎస్ సాయి మాట్లాడుతూ ఇది రైతులకు, కార్మికులకు వ్యతిరేక బడ్జెట్ అని ఆరోపించారు. ప్రజాసంఘాల ఐక్యవేదిక నాయకులు చావలి సుధాకర్, ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు ఆర్ మోహన్, ఆయా సంఘాల నాయకులు జి. శ్రీనివాసరావు, బి.సుబ్బారావు, కె.వీరారెడ్డి, పమిడి వెంకట్రావు, కంకణాల ఆంజనేయులు, జార్జి, ఆవుల సుబ్రహ్మణ్యం, పిన్నిక శ్రీనివాసరావు పాల్గొన్నారు.



బడ్జెట్ ప్రతులను దహనం చేస్తున్న కిసాన్‌మోర్చా, రైతు సంఘాల నాయకులు

నేడు ఎంపీ మాగుంటకు బైపాస్ సర్జరీ

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు లోక్‌సభ సభ్యుడు మాగుంట శ్రీనివాసుల రెడ్డికి గురువారం చెన్నైలోని అపోలో హాస్పిటల్‌లో బైపాస్ సర్జరీ జరగనుంది. కొన్ని రోజుల క్రితం అనారోగ్య దృష్ట్యా వైద్యులు ఆయనకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఆరోగ్య పరిస్థితి బాగుండాలంటే హార్ట్ బైపాస్ సర్జరీ చేయాలని వైద్య బృందం సూచించారు. దీంతో గురువారం అపోలో హాస్పటల్ వైద్య బృందం మాగుంటకు సర్జరీ చేయనున్నారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆపరేషన్ జరుగుతుందని, అందువల్ల ఎలాంటి భయాందోళనలు చెందాల్సిన అవసరం లేదని మాగుంట తెలిపారు. అందరి ఆశీస్సులు, భగవంతుని ఆశీస్సులతో ఆపరేషన్ సక్రమంగా జరిగి త్వరలో కోలుకుని ప్రజలకు మెరుగైన సేవలు కొనసాగించేందుకు ఒంగోలులో అందుబాటులో ఉంటానని మాగుంట తెలిపారు.



చెన్నై అపోలో హాస్పిటల్‌లో ఎంపీ మాగుంట

ఈ రోడ్డులో నడిచేదెలా..?

వైసీపీ హయాంలో అవసరం లేకున్నా డివైడర్ ● బండ్లమిట్ట-ఏకలవ్యనగర్ రోడ్డులో ట్రాఫిక్ సమస్య ● మార్కెట్ వెలుపల ఆక్రమణలతో మరిన్ని ఇక్కట్లు





కొత్తమార్కెట్‌లో దక్షిణం వైపు రోడ్డును ఆక్రమించి ఏర్పాటు చేసిన దుకాణాలు, రాకపోకలకు ఇబ్బందిపడుతున్న వాహనదారులు, పాదచారులు

ఒంగోలు కార్పొరేషన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో ఒంగోలు నగరంలో అంతా వారి ఇష్టారాజ్యమైంది. రాజకీయ పలుకుబడితో రోడ్లను సైతం ఆక్రమించేశారు. మరోవైపు కార్పొరేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన పలు పనులు సైతం ప్రజలకు కష్టాలు తెచ్చిపెట్టాయి. దీంతో గత రెండుమూడు రోజులుగా ఊరచెరువులోని దామోదర సంజీవయ్య కూరగాయల మార్కెట్‌లో సమూల మార్పులు మొదలయ్యాయి. ఆరుబయట అమ్మకాలను తొలించిన కార్పొరేషన్ అధికారులు, దుకాణాల్లో ఇతరులు ఉండటాన్ని, అలాగే దీర్ఘకాలికంగా పేరుకుపోయిన అద్దె బకాయిలపై సీరియస్‌గా దృష్టి సారించారు. ఇదిలా ఉంచితే మార్కెట్‌లో ఆక్రమణల తొలగింపుతో ప్రజల మెప్పు పొందిన అధికారులు, మార్కెట్‌కు ఉత్తరం, దక్షిణం వైపు ఉన్న రోడ్డుపైనా దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉందని కోరుతున్నారు. ప్రత్యేకించి బండ్లమిట్ట నుంచి ఏకలవ్యనగర్ మీదుగా అంజయ్యరోడ్‌లో వెళ్ళే రోడ్డు మార్గం మరిన్ని కష్టాలు తెచ్చింది. మార్కెట్‌కు ఉత్తరం వైపున గల ఈ రహదారి 30 అడుగులు ఉండగా, దాని మధ్యలో సెంటర్ డివైడర్ ఏర్పాటు చేశారు. దీంతో ఒకవైపు మాత్రమే రాకపోకలు సాగుతుండటంతో ద్విచక్రవాహనాలు తప్ప, కారు వెళ్ళాలంటే కనీసం అరగంటపైనే పడుతుంది. ఇదిలా ఉంచితే పండుగ రోజుల్లో, ఆదివారాల్లో మార్కెట్‌కు వచ్చేవారి సంఖ్య ఎక్కువగా ఉండటంతో కనీసం కాలినడక కూడా కష్టమైపోతుంది. అయితే ఒకవైపు చికెన్‌షాపులు, హోల్‌సేల్ షాపుల వారు పూర్తిగా ఆక్రమించేయడంతో పాటు వాహన రాకపోకలకు సైతం వారు అడ్డు చెప్పడంతో సమస్య మరింత జఠిలమవుతోంది. మరోవైపు పండ్ల షాపుల వారికి కేటాయించగా, అందులో సగం మంది ఇతరులే ఉన్నారు. దీంతో ఆ మార్గమంలో జరిగే వ్యాపారాలన్నీ రోడ్డుపైనే నిర్వహిస్తుండడంతో పరిస్థితి మరింత సమస్యగా మారింది. అయితే మార్కెట్‌లో సమూల మార్పులకు శ్రీకారం పలికిన అధికారులు ఈ రహదారిని సైతం పట్టించుకోవాలని ప్రజలు కోరుతున్నారు. అదేవిధంగా ఎవరికీ ఉపయోగం లేని డివైడర్ వల్ల సగం ట్రాఫిక్ సమస్య రావడంతో ఆ వైపు రాకపోకలు సాగించేవారు నానా అవస్థలు పడుతున్నారు. ఇదిలా ఉంచితే దక్షిణం వైపు కూడా అదే పరిస్థితి ఉంది. షాదీఖానా వైపు కూడా సెంటర్ డివైడర్ ఏర్పాటు చేయడం వైసీపీ పాలనలో అర్థంపర్థం లేని పనులుగా ప్రజలు విమర్శిస్తున్నారు. మార్కెట్‌కు ఉత్తర, దక్షిణం వైపు రెండు రహదారులు ప్రజలకు ఉపయోగపడకపోగా, మరింత సమస్య తెచ్చిపెడుతున్నాయని ప్రజల నుంచి వినిపిస్తున్న మాట. ఇప్పటికైనా కార్పొరేషన్ అధికారులు, ట్రాఫిక్ పోలీసు యంత్రాంగం చొరవ చూపి మార్కెట్ వెలుపల ఉత్తర, దక్షిణ వైపు రోడ్డు మార్గంలో ఆక్రమణలు తొలగించి ట్రాఫిక్ సమస్య లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.



రహదారిలో రాకపోకలు లేకుండా అడ్డదిడ్డంగా పెట్టిన వాహనాలు

చోడవరంలో జంట బ్యారన్లు దగ్ధం

కొండపి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చోడవరం గ్రామంలో బాలినేని ఆంజనేయులు, శ్రీవేణిలకు చెందిన జంట బ్యారన్లు బుధవారం దగ్ధమయ్యాయి. వాటిలో క్యూరింగ్ చేస్తున్న పొగాకు బూడిదైంది. సమాచారం అందుకున్న కొండపి అగ్నిమాపక కేంద్రం సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఒక్కో బ్యారన్‌కు రూ.5లక్షల చొప్పున రూ.10లక్షలు నష్టం వాటిల్లినట్లు సమాచారం. బోర్డు సభ్యుడు బొడ్డపాటి బ్రహ్మయ్య ఘటనా స్థలానికి చేరుకుని బాధితులతో మాట్లాడారు. బోర్డు నుంచి నష్టపరిహారం త్వరగా అందేలా కృషి చేస్తానని తెలిపారు.

పైడిపాడులో వరిగడ్డి వామి..

జరుగుమల్లి మండలంలోని పైడిపాడు గ్రామంలో పిడతల పౌల్‌రాజుకు చెందిన వరిగడ్డి వామి ప్రమాదవశాత్తు బుధవారం దగ్ధమైంది. కొండపి అగ్నిమాపక కేంద్రం సిబ్బంది మంటలను అదుపు చేశారు. బాధితుడికి రూ.10వేలు నష్టం వాటిల్లిందని అగ్నిమాపక అధికారి వెంకటేశ్వర్లు తెలిపారు.

త్రోవగుంట మేజర్ పరిశీలన



కాలువను పరిశీలిస్తున్న డీసీ అధ్యక్షులు, అధికారులు

సంతనూతలపాడు, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): సంతనూతలపాడు మండలంలోని త్రోవగుంట మేజర్ నుంచి గుర్వారెడ్డిపాలెం వరకు రైతులకు అందుతున్న తాగునీటి సరఫరాను బుధవారం ఒంగోలు ఎన్ఎస్‌పీ నీటిసంఘం అధ్యక్షులు నల్లూరి క్రిష్ణారావు, మైనంపాడు-1,2 నీటిసంఘం అధ్యక్షులు యు.శేషగిరిరావు, పి.వెంకట్రావు, రుద్రవరం నీటిసంఘాల అధ్యక్షుడు కేవీ.చలపతిరావు, అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు పొగాకు పంటలకు సరిపడా సాగునీరు అందిచేలా చూడాలని వారిని కోరారు. కార్యక్రమంలో ఏఈఈలు అనూష, కిరణ్‌కుమార్, వర్క్ఇన్‌స్పెక్టర్లు, లస్కర్లు పాల్గొన్నారు.

నీటి వనరుల గణన చేపట్టాలి

ఒంగోలు(రూరల్), ఫిబ్రవరి5(ఆంధ్రజ్యోతి): చిన్నతరహా నీటివనరుల గణన చేపట్టి యాప్‌లో అప్‌లోడ్ చేయాలని ముఖ్యప్రణాళికాధికారి డి.వెంకటేశ్వర్లు ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో ఏడు చిన్న తరహా నీటి వనరుల గణనపై జిల్లాస్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్థాయిలో చిన్న తరహా నీటి వనరుల గణన చేపట్టాలన్నారు. రెండు వేల హెక్టారుల లోపు సాగువిస్తీర్ణం పరిధిలో గల చెరువులు, ఎత్తిపోతలపథకాలను, వ్యవసాయబోర్లు, బావులను నమోదు చేయాలన్నారు. పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

వచ్చే నెల 17నుంచి ఓపెన్ టెన్త్ పరీక్షలు

ఒంగోలు విద్య, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఏపీ సార్వత్రిక విద్యాపీఠం (ఓపెన్ స్కూలు సొసైటీ) పదో తరగతి పబ్లిక్ పరీక్షల షెడ్యూల్‌ను విడుదల చేస్తూ ఓపెన్ స్కూలు సొసైటీ డైరెక్టర్ ఆర్.నరసింహారావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. పరీక్షలు మార్చి 17వ తేదీ నుంచి రెగ్యులర్ పరీక్షల తరహాలో రోజు మార్చి రోజు నిర్వహిస్తారు. పరీక్షలు ఉదయం 9.30 నుంచి 12.30 గంటల వరకు జరుగుతాయి. 17న హిందీ, 19న ఇంగ్లీషు, 21న తెలుగు/ ఉర్దు, కన్నడ/ ఒరియా/ తమిళం, 24న గణితం, భారతీయ సంస్కృతి, పౌరసత్వం, 26నశాస్త్ర సాంకేతిక విజ్ఞానం, గృహ విజ్ఞానశాస్త్రం, 28న సాంఘికశాస్త్రం, ఆర్థికశాస్త్రం పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు.

మండువవారిపాలెం మాజీ సర్పంచ్ కన్నుమూత

ఒంగోలు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు సమీపంలోని మండువవారిపాలెం గ్రామానికి అత్యధిక కాలం సర్పంచ్‌గా సేవలు అందించిన శ్రీమన్నారాయణ(79) మృతి చెందారు. ఒంగోలు ప్రాంత ప్రజలకు ఎంతో సుపరిచితుడు అయిన ఆయన హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి కన్నుమూశారు. గత నెల 29వ తేదీన ఆయనకు గుండె ఆపరేషన్ చేశారు. అయితే రెండు రోజుల తరువాత శ్రీమన్నారాయణ ఆరోగ్యం మరింత క్షీణించగా చికిత్స పొందుతూ చనిపోయారు. కాగా గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఒంగోలులో టీడీపీ మహానాడు నిర్వహణకు అడ్డంకులు కల్పించిన సమయంలో గ్రామంలోని రైతులను ఆయన సమైక్యపరిచారు. మహానాడు నిర్వహణకు వ్యవసాయ భూములు ఇప్పించడంలో కీలకపాత్ర పోషించారు. అప్పట్లో ప్రస్తుత సీఎం చంద్రబాబు, మాజీ సర్పంచ్ శ్రీమన్నారాయణను ప్రత్యేకంగా సత్కరించారు. ఆయన భౌతికకాయం గురువారం ఉదయం స్వగ్రామం మండువవారిపాలెం తీసుకువస్తున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

వైద్యసిబ్బంది సమయపాలన పాటించాలి

● డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్లు

ఒంగోలు(రూరల్), ఫిబ్రవరి5(ఆంధ్రజ్యోతి): వైద్యసిబ్బంది తప్పకుండా సమయపాలన పాటించాలని డీఎంహెచ్‌వో టి.వెంకటేశ్వర్లు ఆదేశించారు. బుధవారం కరవది పీహెచ్‌సీని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ఆసుపత్రిలో నిర్వహించే అన్నిరకాల పరీక్షలు, వైద్యసేవలు ఆన్‌లైన్ చేయాలన్నారు. చిన్నారులకు టీకాలు సకాలంలో అందించాలని, నిర్లక్ష్యం వహించిన వారిపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. సిబ్బందికి తగిన సూచనలు చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారులు సుందరప్రసాద్, ఎస్.వాణి పాల్గొన్నారు.

వైభవంగా అమ్మవారి గ్రామోత్సవం



ప్రత్యేక అలంకరణలో జ్వాలాముఖి అమ్మవారు

ఒంగోలు(రూరల్), ఫిబ్రవరి5 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరం పెళ్లూరు గ్రామంలో బుధవారం శ్రీజ్వాలాముఖి అమ్మవారి గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. గ్రామంలోని శ్రీగురునాథేశ్వరస్వామి సమేత శ్రీజ్వాలాముఖి అమ్మవారి ఆలయ 18వ వార్షికోత్సవాల్లో భాగంగా అమ్మవారికి 108 కలశాలతో మహా అభిషేకంతోపాటు పలు రకాలు పూజలు నిర్వహించారు. గ్రామస్థులతోపాటు ఒంగోలు నగరవాసులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

రైతులకు 3శాతం రాయితీ వర్తింపజేయాలి

మద్దిపాడు, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): సొసైటీ వ్యవసాయ రుణాలపై వడ్డీ రాయితీని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయాలని తెలుగు రైతు సంఘం నాయకులు రావి ఉమామహేశ్వరరావు కోరారు. ఈమేరకు మార్కెటింగ్, పశుసంవర్ధక శాఖ మంత్రి కింజరపు అచ్చెన్నాయుడును బుధవారం విజయవాడలో కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. గతంలో వ్యవసాయ రుణం సహకార పరపతి సంఘాల ద్వారా రుణాలు తీసుకున్న రైతులకు మూడు శాతం వడ్డీ రాయితీ చెల్లించే సమయంలో సకాలంలో రుణం చెల్లించిన వారికి వర్తింపజేసేవారని, 2019 నుంచి ఈ వడ్డీ రాయితీని విడుదల చేయలేదని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తే వాహనం సీజ్

కొండపి/పొన్నలూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తే వాహనాన్ని సీజ్ చేస్తామని సీఐ జి.సోమశేఖర్ హెచ్చరించారు. బుధవారం కొండపిలో వాహనదారులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఎస్సై ప్రేమ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు. పొన్నలూరులో ద్విచక్రవాహనదారులకు ఎస్సై అనూక్ కౌన్సెలింగ్ ఇచ్చారు.

నగర అభివృద్ధికి ఆమోదం!

అజెండాలోని అంశాల్లో ఒకటి రద్దు, నాలుగు మినహా అన్నింటికీ గ్రీన్‌సిగ్నల్
నలుగురు వైసీపీ కార్పొరేటర్లు బాయ్‌కాట్
కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశానికి హాజరైన ఎమ్మెల్యేలు దామచర్ల, బీఎన్



మాట్లాడుతున్న ఎస్ఎన్‌పాడు ఎమ్మెల్యే బీఎన్, పక్కన ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్

ఒంగోలు కార్పొరేషన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగర అభివృద్ధికి పాలకవర్గ సభ్యులు ఆమోదం తెలియజేస్తూ తీర్మానం చేశారు. బుధవారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో జరిగిన పాలకవర్గ సమావేశానికి డిప్యూటీ మేయర్ వేమూరి వెంకటసూర్యనారాయణ (బుజ్జి) అధ్యక్షత వహించగా, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, బీఎస్.విజయ్‌కుమార్ ఎక్స్‌అఫిషియో సభ్యులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మొత్తం 29అంశాలను అజెండాలో పొందుపరిచి చర్చించగా, ఐదు అంశాలు మినహా అన్నింటికీ ఆమోదం తెలిపారు. ప్రధానంగా నగరంలోని పలు డివిజన్లలో రోడ్లు, డ్రైన్‌లు, కల్వర్టులు, నగర సుందరీకరణ కోసం ప్రతిపాదించిన పనులకు ఆమోదం లభించింది. దశరాజుపల్లిలో ముస్లింలకు కేటాయించిన ఖబరస్తాన్ అంశంపై చర్చ సాగింది. దీనిపై ఎమ్మెల్యే దామచర్ల మాట్లాడుతూ ముస్లింల కోసం అవసరమై ఖబరస్తాన్‌ను ప్రస్తుతం ప్రతిపాదించిన ప్రాంతంలో కాకుండా అక్కడ నుంచి 100 మీటర్ల దూరంలో 3 ఎకరాలు స్థల పరిశీలన చేస్తామన్నారు. అలాగే ఊరచెరువులోని షాదీఖానకు అద్దె కేటాయింపుపై సమావేశంలో చర్చకు రాగా దామచర్ల మాట్లాడుతూ సున్నితమైన ఆ అంశాలపై మరోసారి చర్చించాల్సి ఉందని చెప్పారు. ప్రస్తుతం ఆయా సామాజిక పెద్దలు, అధికారులతో కలిసి చర్చించిన తర్వాత నిర్ణయం తీసుకుంటామన్నారు. దీంతో ఆ రెండు అంశాలను వాయిదా వేశారు. అలాగే 7వ అంశమైన దర్శి మునిసిపాలిటీలో వర్కర్‌గా పనిచేస్తున్న కార్మికుడిని ఒంగోలుకు బదిలీపై సమావేశంలో చర్చకు రాగా, 7వ డివిజన్ కార్పొరేటర్ దాచర్ల వెంకటరమణయ్య అభ్యంతరం తెలిపారు. ప్రస్తుతం అలాంటి జీవో లేదని, దానిపై ఆమోదయోగ్యం సరికాదని తెలియజేశారు. దీంతో ఆ అంశాన్ని రద్దు చేశారు. అలాగే కార్పొరేషన్‌లో పనిచేస్తున్న 681 పారిశుధ్య కార్మికుల కొనసాగింపు, డ్వాక్రా గ్రూపుల ద్వారా ట్రాక్టర్లతో చెత్తను డంపింగ్ యార్డుకు తరలించే అంశాలు, మరో 150 మంది అదనపు పనివారిని తీసుకునే అంశంపైనా చర్చకు రాగా 2025-26 బడ్జెట్ తయారు చేయకుండా ఇలాంటి అంశాలు ఆమోదం సరికాదని రమణయ్య సమావేశం దృష్టికి తీసుకురావడంతో వాయిదా వేశారు. అలాగే పలువురు కార్పొరేటర్లు తమ డివిజన్ సమస్యలపై సమావేశంలో చర్చించగా వార్డుకోవారం కార్యక్రమం ద్వారా అన్నీ పరిష్కరిస్తామని అధికారులు వివరించారు. ఎమ్మెల్యే దామచర్ల మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థ ప్రక్షాళన చేయాలన్నారు. దీర్ఘకాలికంగా ఒకేచోట పనిచేస్తున్నందున ప్రజలకు తగిన సేవలు లభించడం లేదని, సచివాలయ సెక్రటరీలకు స్థానచలనం కలిగించాలని తెలిపారు. అలాగే పేర్నమిట్ట చెరువును సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుగా మార్చాలని ఎమ్మెల్యే విజయ్‌కుమార్ కోరారు. సమావేశంలో కమిషనర్ డాక్టర్ కోడూరు వెంకటేశ్వరరావు, ఎంఈ చెంచయ్య, ఏసీపీ సుధాకర్, శానిటరీ సూపర్‌వైజర్ బాబ్జి, పలువ సెక్షన్‌ల హెడ్‌లు పాల్గొన్నారు.

వైసీపీ కార్పొరేటర్ల అసంతృప్తి

సమావేశంలో తమకు మాట్లాడే అవకాశం కల్పించలేదని పలువురు వైసీపీ కార్పొరేటర్లు అసంతృప్తి వ్యక్తం చేశారు. అయితే ప్రాధాన్యత ప్రకారం మాట్లాడాల్సి ఉందని, డిప్యూటీ మేయర్ వేమూరి వెంకటసూర్యనారాయణ వెల్లడించినప్పటికీ వినుకోని వైసీపీ కార్పొరేటర్లు గంగవరపు ప్రవీణ్ కుమార్, షేక్ ఇమ్రాన్‌ఖాన్, మరో ఇద్దరు మహిళా కార్పొరేటర్లు సమావేశం నుంచి బయటకు వెళ్ళిపోయారు. దీంతో మరి కొంతమంది వైసీపీ కార్పొరేటర్లు, టీడీపీ కూటమి కార్పొరేటర్లతో సమావేశం కొనసాగడంతో అజెండాలో ఒకటి రద్దు, నాలుగు అంశాలు వాయిదా వేసి, మిగిలినవన్నీ ఆమోదించారు.

ఒకేషనల్ ప్రాక్టికల్ పరీక్షలు పక్కాగా నిర్వహించాలి

● డీఈవో కిరణ్‌కుమార్



మాట్లాడుతున్న కమిషనర్ శివకుమార్, డీఈవో కిషోర్‌కుమార్

ఒంగోలు విద్య, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పదో తరగతి ఒకేషనల్ విద్యార్థుల ప్రాక్టికల్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని డీఈవో ఎ.కిరణ్‌కుమార్ ఆదేశించారు. స్థానిక డీఆర్ఆర్ఎం మునిసిపల్ హైస్కూలులో ఒకేషనల్ ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహణపై ఒకేషనల్ కోర్సులు ఉన్న పాఠశాలల హెచ్ఎంలు, ఒకేషనల్ ఇన్‌స్ట్రక్టర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒకేషనల్ ప్రాక్టికల్ పరీక్షలకు జిల్లాలో 1200 మంది విద్యార్థులు హాజరవుతున్నట్లు తెలిపారు. ఏ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు అదే స్కూలులో ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించాలన్నారు. ప్రాక్టికల్ పరీక్షలు ఈనెల 21నుంచి 27వతేదీ వరకు ఉదయం 10నుంచి 12.30 గంటల వరకు, మధ్యాహ్నం 2నుంచి 4.30 గంటల వరకు రెండు విడతలుగా నిర్వహించాలని చెప్పారు. ప్రాక్టికల్ పరీక్షలను ఇంటర్నల్, ఎక్స్‌టర్నల్ ఎగ్జామినర్లు నిర్వహించాలని తెలిపారు. ప్రభుత్వ సహాయ పరీక్షల కమిషనర్ కె.శివకుమార్ మాట్లాడుతూ ప్రాక్టికల్ పరీక్ష 60 మార్కులకు నిర్వహిస్తారన్నారు. ప్రాక్టికల్స్‌కు 50 మార్కులు, రికార్డులకు ఐదు మార్కులు, వైవీవోస్‌కు ఐదు మార్కులు కేటాయించినట్లు పేర్కొన్నారు. రికార్డు సమర్పించని వారికి సున్నా మార్కులు కేటాయిస్తారని తెలిపారు. ప్రాక్టికల్ మార్కులను మార్చి 3వ తేదీలోపు వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని ఆయన ఆదేశించారు.

ఘనంగా గోపూజ మహోత్సవం



ప్రసంగిస్తున్న విశ్వంభరానందగిరి స్వామి



గోపూజలో పాల్గొన్న భక్తులు, నాయకులు

ఒంగోలు కల్చరల్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరంలో 108 ఆవులతో అష్టోత్తర శత గోపూజ మహోత్సవం బుధవారం అత్యంత ఘనంగా జరిగింది. స్థానిక ఉత్తర బైపాస్ రోడ్డులోని మంగమ్మ కళాశాల ఆవరణలో విశ్వమాత సోషల్ సర్వీస్ సొసైటీ, వివేకానంద చారిటబుల్ ట్రస్ట్, కేఎన్‌టీ గౌతమ్ ఎడ్యుకేషనల్ సొసైటీ సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ముందుగా గోవులకు మహిళలు పసుపు, కుంకుమలతో అలంకరించి పూజలు చేశారు. ముఖ్యఅతిథులుగా శ్రీవిశ్వంభరానందగిరి స్వామి, శ్రీభైరవేశ్వరస్వామి, శుభోదయం స్వామి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా విశ్వంభరానందగిరిస్వామి ప్రసంగిస్తూ గోవు ఎంతో పవిత్రమైనది విశిష్టమైనదని, గో ఉత్పత్తులను వాడటం ద్వారా ఆరోగ్యంగా ఉంటామన్నారు. నిత్యం గోవును పూజించటం ద్వారా ఆధ్యాత్మిక చింతన పెరగటమే కాకుండా హిందూ ధర్మం పరిరక్షింపబడుతుందని చెప్పారు. అనంతరం విద్యార్థులు, మహిళల కోలాట, భజన కార్యక్రమాలు విశేషంగా అలరించాయి. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు శెగ్గం శ్రీనివాసరావు, కృష్ణారెడ్డి, మంగమ్మ కళాశాల కరస్పాండెంట్ మానం సుబ్బారావు, ఈదర హరిబాబు, యోగయ్యయాదవ్, నిర్వహణ సంస్థల ప్రతినిధులు కమ్మిశెట్టి లక్ష్మి, వెంకటేశ్వరరెడ్డి, కె.రంగారావు, జనసేన పార్టీ నాయకులు కంది రవిశంకర్, కుర్రా ప్రసాద్‌బాబు, తోట ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణుల వివరాలను విధిగా నమోదు చేయాలి : డీఐవో

సింగరాయకొండ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : గర్భిణుల వివరాలను విధిగా యువిన్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలని ఆరోగ్య సిబ్బందికి జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి పద్మజ సూచించారు. మండలంలోని పాకల, ఊళ్లపాలెంలో జరుగుతున్న టీకాల కార్యక్రమాన్ని ఆమె బుధవారం పరిశీలించారు. పిల్లలకు వేసే టీకాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు దీరేంద్ర, ఆరోగ్య పర్యవేక్షకులు జవహర్ వలి, సయ్యద్‌మసూద్ అలీ పాల్గొన్నారు.



ఊళ్లపాలెంలో పరిశీలిస్తున్న డీఐవో పద్మజ

జిల్లా సీనియర్ మహిళా హాకీ జట్ల ఎంపిక

సంతనూతలపాడు, ఫిబ్రవరి5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి హాకీ పోటీల్లో పాల్గొనేందుకు మైనంపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం జిల్లా హాకీ అసోసియేషన్ కార్యదర్శి సుందరరామిరెడ్డి ఆధ్వర్యంలో ప్రతిభ ఆధారంగా ఎంపికలు నిర్వహించారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 8 నుంచి 10వ తేదీ వరకు నెల్లూరులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు కార్యక్రమంలో డైట్ ప్రిన్సిపాల్ ఎస్.సుబ్బారావు, చీమకుర్తి ఎంఈవో నరసింహారావు, పీడీ వనజ, పీఈటీ టి.రవికుమార్ పాల్గొన్నారు.

పశుగణనను వెంటనే పూర్తి చేయాలి



మాట్లాడుతున్న ఏడీ రవికుమార్

సింగరాయకొండ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : పశుగణనను వెంటనే పూర్తి చేయాలని పశుసంవర్థక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఎం.రవికుమార్ సిబ్బందికి సూచించారు. పొన్నలూరు, కొండపి, సింగరాయకొండ వైద్య సిబ్బందితో ఆయన బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్షేత్రస్థాయి సిబ్బంది ప్రతి రైతూ పెంచుతున్న పశువులను విధిగా నమోదు చేయాలన్నారు. సీజనల్‌గా పశువులకు సంక్రమించే వ్యాధుల నివారణకు ముందస్తుగా టీకాలు వేయాలని ఆదేశించారు. సమావేశంలో పశువైద్యులు హజరత్తయ్య, పేరయ్య, చంద్రశేఖర్, శివరామకృష్ణ, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఖోఖో క్రీడాకారుడికి సత్కారం



శివారెడ్డిని సత్కరిస్తున్న శ్రీనివాసరావు, నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఖోఖో పోటీల్లో రాణించి జిల్లా ఖ్యాతిని పెంపొందించడం అభినందనీయమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు శెగ్గం శ్రీనివాసరావు పేర్కొన్నారు. భారత ఖోఖో జట్టు క్రీడాకారుడు పోతిరెడ్డి శివారెడ్డిని బుధవారం ఆయన అభినందించారు. ముండ్లమూరు మండలం ఈదర గ్రామానికి చెందిన శివారెడ్డి ప్రపంచ స్థాయి ఖోఖో పోటీలో పాల్గొని ట్రోఫీ గెలుపొందడం అభినందనీయమన్నారు. ఇదే స్ఫూర్తితో రాణించాలని చెప్పారు. ఈ సందర్భంగా శివారెడ్డి తల్లిదండ్రులు గురువారెడ్డి, కోటేశ్వరమ్మలను సత్కరించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు నారాయణరెడ్డి, శ్రీనివాసరావు, దండు శ్రీనివాసరావు, అనిల్, ఎం.వెంకటశేషయ్య, రాధాకృష్ణ పాల్గొన్నారు.

బాలలను పనిలో పెట్టుకుంటే కేసులు

● ఉప కార్మిక కమిషనర్ గాయత్రిదేవి

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): బాలలను పనిలో పెట్టుకుంటే సంబంధిత యజమానులపై కేసులు నమోదు చేయాల్సి వస్తోందని ఉప కార్మిక కమిషనర్ గాయత్రిదేవి హెచ్చరించారు. ఒంగోలులో కార్మికశాఖ ఆధ్వర్యంలో గురువారం ట్రంకురోడ్డులోని తనిఖీలు నిర్వహించి ఇరువురు బాల కార్మికులను గుర్తించారు. వారిని పనిలోపెట్టుకున్న యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో సార్ఫ్ ఎన్‌జీవో, సోషల్ వెల్ఫేర్, ఈడీపీవోలు పాల్గొన్నారు.

నిత్యావసరాల ధరలను నియంత్రించాలి

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించి ఆహార భద్రత చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి డిమాండ్ చేశారు. స్థానిక సత్యనారాయణపురంలో గురువారం నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించాలని కోరుతూ సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ కుటుంబాలకు వస్తున్న ఆదాయాలకు మించి ఆహారానికి ఖర్చులు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి జి.ఆదిలక్ష్మి, రాజేశ్వరి, వై.అంజనీదేవి, జి.కళ్యాణి, ఎస్.ఇంద్రజ్యోతి, డి.శ్రీదేవి, ఎకం అన్నపూర్ణమ్మ, కె.ఈశ్వరమ్మ, డి.శ్రీదేవి, కె.కోటేశ్వరమ్మ, కె.పద్మ, బి.ఉష, హరిణి, తులసి పాల్గొన్నారు.

వైసీపీ సీనియర్ నాయకుడు మృతి

సంతనూతలపాడు, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): మైనంపాడుకు చెందిన వైసీపీ సీనియర్ నాయకుడు, జిల్లా నూర్ బాషాసంఘం అధ్యక్షులు గొడుగు మస్తాన్(68) మంగళవారం అర్ధరాత్రి గుండెపోటుతో మృతిచెందారు. బుధవారం మాజీ మంత్రి మేరుగ నాగార్జున, జడ్పీటీసీలు దుంపా రమణమ్మ, వేమా శ్రీనివాసరావు, మండల వైసీపీ కన్వీనర్ దుంపాచెంచిరెడ్డి, యల మందారెడ్డి మస్తాన్ నివాసంలో ఆయన మృతదేహానికి పూలమాలతో నివాళులర్పించారు.

ఆలకూరపాడు హైస్కూల్ తనిఖీ



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో కిరణ్‌కుమార్

టంగుటూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆలకూరపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను డీఈవో కిరణ్‌కుమార్ బుధవారం తనిఖీ చేశారు. పదో తరగతి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరీక్షించారు. ఎస్సీఈఆర్‌టీ వారి 100 రోజుల ప్రణాళిక అమలు తీరును పరిశీలించి విద్యార్థులను సబ్జెక్టుల వారీగా ప్రశ్నలు అడిగారు. వారిచ్చిన సమాధానాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. పదో తరగతిలో నూరుశాతం ఉత్తీర్ణతకు కృషి చేయాలని సూచించారు. విద్యార్థులంతా పూర్తి యూనిఫాంతో రావడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్‌లో పాల్గొన్న విద్యార్థులను అభినందించారు.

రైతులు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి

కొత్తపట్నం, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): రైతులు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఏవో మోహనరెడ్డి కోరారు. మండలంలోని మడనూరు, సంకువానిగుంట పొలం పిలుస్తోందిలో భాగంగా ఆయన పంట పొలాలను పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడుతూ ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకున్న రైతులకు 14 అంకెల యూనిక్ నంబర్ వస్తుందన్నారు. రబీలో సాగు చేసిన పంటలకు ఈ-పంటలో నమోదు చేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి వీఏఏ కె.రవి, ఏఈవో కరీముల్లా పాల్గొన్నారు.

ఉపాధి పనులను ప్రారంభించాలి

సంతనూతలపాడు, ఫిబ్రవరి5(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రతీ పంచాయతీలో ఉపాధి పనులు ప్రారంభించాలని ఎంపీడీవో డి.సురేష్‌బాబు సూచించారు. సంతనూతలపాడులోని మండలపరిషత్ కార్యాలయంలో బుధవారం ఆయన ఉపాధి సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఉపాధిపనులు గుర్తించి అంచనాలను సిద్ధం చేయాలని, ఉపాధికూలీలకు తప్పనిసరిగా పని కల్పించాలని తెలిపారు. కార్యక్రమంలో ఏపీవో వాసంతి, టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

గుర్వారెడ్డిపాలెంలో బుధవారం ఎంపీడీవో సురేష్‌బాబు పర్యటించారు. ఈ సందర్భంగా మండలపరిషత్ పాఠశాలలో మధ్యాహ్నభోజనం, విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరును పరిశీలించారు. అంగన్‌వాడీకేంద్రాన్ని సందర్శించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. సచివాలయం పరిశీలించారు. కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

శనగ పంటపై వేపనూనెను పిచికారీ చేయాలి

ఒంగోలు(రూరల్), ఫిబ్రవరి5(ఆంధ్రజ్యోతి): శనగపంటపై వేపనూనెను పిచికారీ చేయడం ద్వారా చీడపీడలను నివారించుకోవచ్చని ఏవో బి.కిషోర్‌బాబు తెలిపారు. ఒంగోలు మండలంలోని ఉలిచి, ఎన్.అగ్రహారం గ్రామాల్లో బుధవారం పొలంపిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా శనగ, మినప, వరి పంటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కిషోర్‌బాబు మాట్లాడుతూ శనగపంటపై వేపనూనె లేదా వేప విత్తనాల కషాయం పిచికారీ చేయటంతో నులిపురుగు, ఇతర చీడలను తక్కువ ఖర్చుతో నివారించుకోవచ్చనని తెలిపారు. కార్యక్రమంలో ఏఈవోలు కె.రామకృష్ణారెడ్డి, ఎ.ఆదిమూర్తి, రైతులు పాల్గొన్నారు.

లేబర్‌కోడ్‌లను రద్దు చేయాలి

సంతనూతలపాడు, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని, కేంద్ర బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ బుధవారం సంతనూతలపాడులో బడ్జెట్ కాపీలను దహనం చేసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో బంకా సుబ్బారావు, అబ్బూరి వెంకటేశ్వర్లు, ఎన్.వెంకటేశ్వర్లు, మస్తాన్ పాల్గొన్నారు.

నాగులుప్పలపాడు: ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నాగులుప్పలపాడులో బుధవారం బడ్జెట్ జీవో కాపీల ప్రతులను దహనం చేశారు. నాయకులు జె.జయంతిబాబు, జి.బసవపున్నయ్య, టి.శ్రీకాంత్, కాకాని సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

మద్దిపాడు: స్థానిక బస్టాండ్ సెంటర్లో సీఐటీయూ, రైతు సంఘాల ఆధ్వర్యంలో బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. కాలం సుబ్బారావు, ఖాసిం, ఆదిలక్ష్మి, కనపర్తి సుబ్బారావు పాల్గొన్నారు.

కొండపి: స్థానిక బస్టాండ్ సెంటర్‌లో బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. కేజీ మస్తాన్, వై.చంద్రశేఖర్, ఆర్.లక్ష్మి, వై.రూబెన్, బ్రహ్మయ్య, మాలకొండయ్య తదితరులు పాల్గొన్నారు.

క్రైం సమాచారం

సైబర్ నేరగాళ్ల ఉచ్చుల్లో పడవద్దు

● ఎస్‌బీఐ ఆధ్వర్యంలో ఖాతాదారులకు అవగాహన

ఎర్రగొండపాలెంరూరల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత సమాజంలో ప్రతి ఒక్కరు సెల్‌ఫోన్లతో సోషల్ మీడియాలో లీనమై సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడుతున్నారని ఎస్‌బీఐ అకౌంటెంట్ పాండురంగనాయక్ అన్నారు. బుధవారం ఆ బ్యాంకు ఎర్రగొండపాలెంశాఖ పరిధిలో ఖాతాదారులకు సైబర్ నేరాల నియంత్రణపై అవగాహన కల్పించారు. అందులో స్థానిక అంబేడ్కర్ సెంటర్‌లో జాతీయ రహదారిపై ప్రజలకు నాటక రూపంలో అవగాహన నిర్వహించారు. బ్యాంక్ సిబ్బంది ఓటీపీల కోసం ఫోన్ చేయరన్నారు. ఏటీఎం, ఓటీపీ తదితర వివరాలను ఏవరికి షేర్ చేయవద్దని సూచించారు. బ్యాంక్ సమస్యలపై ఏదైన సమస్య ఉంటే వెంటనే సమీప బ్యాంక్ సిబ్బందిని సంప్రదించాలని కోరారు. అలాగే బ్యాంక్ ఖాతాదారులు తప్పనిసరిగా బ్యాంకు వద్ద ఫోన్‌లింక్, ఈకేవైసీ చేయించుకోవాలని కోరారు. అలాచేయడం వలన బ్యాంక్ ఖాతాలో జరుగుతున్న ప్రతి లావాదేవీ ఫోన్‌లో చూసుకోవచ్చన్నారు. యేనో యాప్ ఖాతాదారుల సెల్‌ఫోన్‌లో ఉండాలన్నారు. పలు అంశాలపై సలహాలు, సూచనలు నాటకరూపంలో ప్రజలకు ఖాతాదారులకు వివరించారు. కార్యక్రమంలో బ్యాంక్ సిబ్బంది చాంద్‌బాషా, రాంబాబు తదితరులు ఉన్నారు.

కుక్కల దాడిలో చిన్నారులకు గాయాలు

గిద్దలూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): గిద్దలూరు పట్టణంలో కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. కుక్కలు గుంపులు గుంపులుగా తిరుగుతూ చిన్నారులను, వృద్ధులను గాయపరుస్తున్నాయి. ఈ విషయం గురించి గత వారం 'ఆంధ్రజ్యోతి'లో వార్తాకథనం ప్రచురితం అయినప్పటికీ కుక్కల బెడదను తొలగించేందుకు మున్సిపల్ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. తాజాగా పట్టణంలోని కృష్ణా థియేటర్ సమీపంలో పీరాన్‌సాహెబ్ అనే బాలుడు వీధిలో తిరుగుతుండగా కుక్కలు ఆ బాలుడిని గాయపరిచాయి. అదేవిధంగా స్టేట్‌బ్యాంక్ సమీపంలో జాహ్నవి బాలికవీధిలో ఒక్కతే ఆడుకుంటుండగా కుక్కబాలికపై దాడి చేసి గాయపరిచింది. బాలిక అరుపులకు సమీపంలోని వ్యక్తులు వచ్చి కుక్కను అదిలించినప్పటికీ ఆ బాలికపై దాడి చేస్తూనే ఉంది. చివరకు వదిలిపెట్టి వెళ్ళిపోయింది. ఇలా రోజురోజుకు కుక్కల దాడితో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకుని ప్రజలపై దాడులు చేసి గాయపరుస్తున్న కుక్కల పట్టుకుని అడవిలో వదలాలని కోరుతున్నారు.

పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ



పొదిలిలో సీఐ కార్యాలయాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ

త్రిపురాంతకం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : స్థానిక పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్‌లో రిసెప్షన్ గది, లాకప్, కంప్యూటర్ గది, రైటర్ గది, పోలీసు క్వార్టర్స్, పోలీసు రికార్డులను, ఆవరణ, పరిసరాలను పరిశీలించారు. కీలక కేసులపై సమీక్షించారు. సాంకేతిక పరిజ్ఞానంతో నేర పరిశోధన, నేర నియంత్రణకు కృషి చేయాలన్నారు. మహిళలు, చిన్నారులు, వృద్ధులపై జరిగే నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ, హెల్మెట్‌ధారణ, డ్రంక్ అండ్ డ్రైవ్ వంటి ఘటనలపై గట్టి నిఘా ఉంచాలన్నారు. అంతకుముందు ప్రసిద్ధ పుణ్యక్షేత్రం త్రిపురాంతకేశ్వరస్వామి, బాలాత్రిపుర సుందరీదేవి అమ్మవార్ల ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో దర్శి డీఎస్పీ లక్ష్మీనారాయణ, త్రిపురాంతకం సీఐ అస్సాన్, ఎస్సై శివబసవరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

పొదిలి : పొదిలి పట్టణంలో పునఃనిర్మిస్తున్న సర్కిల్ భవనాన్ని జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తక్కువ సమయంలో నిర్మాణ పనులు పూర్తికావడంతో నాణ్యతను పరిశీలించారు. అదేవిధంగా పెండింగ్ పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈయన వెంట డీఎస్పీ లక్ష్మీనారాయణ, ఎస్ఐ వేమన, సిబ్బంది తదితరులు ఉన్నారు.

విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు

● బడ్డీకొట్లలోనూ మద్యం విక్రయాలు ● క్వార్టర్‌పై రూ.50 అధికంగా వసూలు ● పట్టించుకోని ఎక్సైజ్ అధికారులు

ఎర్రగొండపాలెం రూరల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఎర్రగొండపాలెం పరిధిలో మద్యం బ్లాక్‌లో అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. అధిక ధరలకు మద్యం విక్రయిస్తూ పేదల శ్రమను దోచేస్తున్నారు. అయిన తమకు ఏమీ పట్టనట్లు ఎక్సైజ్ శాఖ అధికారులు మిన్నుకుండి పోతున్నారు. ఇక లైసెన్స్ మద్యం దుకాణంలోనూ ఏటువంటి అనుమతులు లేకుండానే ఓపెన్ సిట్టింగ్‌లు ఏర్పాటు చేస్తున్నారు.



ఓ కూల్‌డ్రింక్ షాపులో మద్యం విక్రయాలు

మండలకేంద్రం ఎర్రగొండపాలెంలో 3 లైసెన్స్ మద్యం దుకాణాలున్నాయి. వాటితో పాటు కొలుకుల 1, అమానిగుడిపాడు గ్రామాల్లో ఒక్కొక్క మద్యం దుకాణాలున్నాయి. అయితే మండలంలోని వీరభద్రాపురం, గురిజేపల్లి, గంజివారిపల్లి ఎర్రగొండపాలెం మండల కేంద్రంలోనూ బెల్ట్‌షాపుల్లో మద్యం అమ్మకాలు విచ్చలవిడిగా సాగుతున్నాయి. కూల్‌డ్రింక్, టిఫిన్ సెంటర్ల లోనూ మద్యం అమ్మకాలు సాగుతున్నాయి. ఓ వైపు కూటమి ప్రభుత్వం బెల్ట్‌షాపులపై ఉక్కుపాదం మోపుతుమాని హెచ్చరిస్తున్నప్పటికీ, వైపాలెంలో మాత్రం బెల్ట్‌షాపులు కొన సాగుతుండడం గమనార్హం.

తెల్లవారక ముందే బ్లాక్‌లో మద్యం

పట్టణంలోని పుల్లలచెరువు, వినుకొండ ప్రధాన రహదారిలో తెల్లవారక ముందు నుంచే నడిరోడ్డుపైనే విచ్చలవిడిగా, బ్లాక్‌లో మద్యం అమ్మకాలు జరుగుతున్నాయి. అయినప్పటికీ, తమకు ఏమీ సంబందం లేదు అన్నట్లు ఎక్సైజ్ అధికారులు వ్యవహరిస్తున్నారు. ఒక్కో క్వార్టర్ పై రూ.50 అదనంగా వసూలు చేస్తున్నట్లు మందుబాబులు పేర్కొంటున్నారు. దీనిలో ఎక్సైజ్ అధికారులకు మామూళ్ల ఉన్నయని బహిరంగ విమర్శలు వినిపిస్తున్నాయి.

లైసెన్స్ మద్యం దుకాణాల్లోనే సిట్టింగ్

మండల కేంద్రంలోని మద్యం దుకాణాల్లో ఏటువంటి అనుమతులు లేకుండానే లైసెన్సు దుకాణా చుట్టూ నిర్వాహకులు సిట్టింగ్ ఏర్పాటు చేశారు. నాలుగుపక్కల బల్లాలు వేసి సిట్టింగ్ నిర్వహించడంతో పాటు అక్కడే అన్ని రకాల (నీరు, టచ్చింగ్, తదితర) విక్రయాలు జరుపుతున్నారు.

తూతూ మంత్రంగా తనిఖీలు

ఎక్సైజ్‌శాఖ అధికారులు ఉన్నప్పటికీ, వారు ఏదో ఒక గ్రామంలో తనిఖీలు చేపడుతూ నాటుసారా బట్టీలపై మాత్రమే దాడులు చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అసలు బట్టీలే లేకపోయినా, కావాలనే సృష్టిస్తున్నారని కూడా విమర్శలున్నాయి. ఎక్సైజ్‌శాఖ పరిధిలోని గ్రామాలలో విచ్చలవిడిగా బెల్టు షాపులు ఉంటే వాటిపై దాడి చేయడంలో ఏక్కడ కనిపించడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు బెల్ట్‌షాపులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఈ విషయంపై ఎక్సైజ్‌శాఖ ఎక్సైజ్ ఎస్సై ను వివరణ కోరగా అటువంటి వివరాలు మా దృష్టికి రాలేదని తెలిపారు. ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో ఆన్‌లైన్ ద్వారా 4 ఫిర్యాదులు వచ్చాయని వాటిని పరిష్కరించామన్నారు. బెల్టు షాపులు, సిట్టింగ్‌లకు ఏటువంటి అనుమతులు లేవన్నారు.



వినుకొండ రోడ్డులో మద్యం దుకాణంలోనే ఏర్పాటు చేసిన సిట్టింగ్ రూం

లేబర్‌కోడ్ అమలును రద్దు చేయాలని ధర్నా

పొదిలి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి) : లేబర్ కోడ్ అమలును రద్దు చేయాలని సీఐటీయూ కార్యదర్శి రమేష్ కోరారు. పొదిలి పట్టణంలో బుధవారం కార్మికులతో కలసి ధర్నా చేశారు. కార్మిక సంఘాల సంక్షేమ ఊసేలేని కేంద్ర బడ్జెట్ ప్రతిపాదనలను వ్యతిరేకిస్తూ కార్మికులు పొదిలి చిన్నబస్టాండ్ సెంటర్ నుండి తహసీల్దార్ కార్యాలయం వరకు నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. లేబర్‌కోడ్ అమలును రద్దుచేసి తమకు న్యాయం చేయాలని తహసీల్దార్ కృష్ణారెడ్డికి వినతిపత్రం అందజేశారు.

గిద్దలూరు: కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు ధర్నా చేశారు. పట్టణంలో ర్యాలీ నిర్వహించి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. అనంతరం తహసీల్దార్ ఆంజనేయ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి టి.ఆవులయ్య మాట్లాడుతూ కార్మికుల త్యాగాల పోరాట ఫలితమే 29 చట్టాలను సాధించుకున్నారన్నారు. అయితే కేంద్రంలోని బీజేపీ సంకీర్ణ ప్రభుత్వం అధికార బలంతో కార్మికులకు వ్యతిరేకంగా చట్టాల సవరణ చేస్తోందని విమర్శించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం సైతం ఏ ఒక్క కార్మికుడి ప్రధాన డిమాండ్లు నెరవేర్చలేదని విమర్శించారు. కార్మిక చట్టాలు పకడ్బందీగా అమలు చేస్తే రాజకీయ వేధింపులు ఉండవన్నారు. ఉద్యోగ భద్రత ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ కార్యదర్శి నరసింహులు, అంగన్‌వాడీ, మున్సిపల్, స్వచ్ఛభారత్, ఆశ, మధ్యాహ్న భోజన పథకం కార్మిక సంఘాల ప్రతినిధులు స్వర్ణ, మున్నా, నాగయ్య, రాధ, ఆనందరావు, విశ్రాంతమ్మ, కుమారి తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

ఇన్ఫోసిస్‌లో ఉద్యోగానికి జార్జి విద్యార్థిని ఎంపిక

మార్కాపురం, ఫిబ్రవరి (ఆంధ్రజ్యోతి): స్థానిక డాక్టర్ శామ్యూల్ జార్జి ఇంజనీరింగ్ కళాశాలలో చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థిని ప్రముఖ సాఫ్ట్‌వేర్ సంస్థ ఇన్ఫోసిస్‌లో ఉద్యోగానికి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ రాజబాబు తెలిపారు. ఏపీ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అకాడమి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్లేస్‌మెంట్ డ్రైవ్‌కు కళాశాల నుంచి 15 మంది విద్యార్థులు హాజరుకాగా సీఎస్‌ఈ చివరి సంవత్సరం విద్యార్థిని కె.నందిని ఇంటర్వ్యూలో ప్రతిభచాటి ఉద్యోగం సాధించిందన్నారు. రూ.6.5 లక్షల వార్షిక ప్యాకేజీకి విద్యార్థిని ఎంపికైందన్నారు. ఉద్యోగానికి ఎంపికైన విద్యార్థినిని కళాశాల సాంకేతిక సలహాదారు, మాజీ మంత్రి సురేష్ ప్రత్యేకంగా అభినందించారు.



ఉద్యోగానికి ఎంపికైన నందినిని అభినందిస్తున్న మాజీ మంత్రి సురేష్

రైల్వేస్టేషన్‌లో సమస్యలు పరిష్కరించాలని వినతి

మార్కాపురం రూరల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి). మార్కాపురం రైల్వేస్టేషన్‌లో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గుంటూరులోని డీఆర్ఎం కార్యాలయంలో రైల్వేడివిజన్ మేనేజర్ రామకృష్ణకు వినతి పత్రం అందజేసినట్లు డీఆర్‌యూసీసీ సభ్యుడు నారాయణరెడ్డి బుధవారం తెలిపారు. మార్కాపురం రైల్వేస్టేషన్‌లో కోచ్ ఇండికేషన్ సిస్టం, తిరుపతి వెళ్లే రైలును అరుణాచలం వరకు పొడగించాలని కోరినట్లు తెలిపారు. స్టేషన్‌లో పశ్చిమవైపున ఎంట్రన్స్, టికెట్ బుకింగ్ కౌంటర్ ఏర్పాటు చేయాలని కోరారు. అదేవిధంగా అమృత భారత్ పథకంలో మంజూరైన అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేసి తాగునీటి కొరత లేకుండా చూడాలని కోరినట్లు తెలిపారు. ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా సమస్యలను పరిష్కరించాలని కోరినట్లు తెలిపారు.



వినతిపత్రం అందజేస్తున్న నారాయణరెడ్డి

ఘనంగా సాయిబాబా మందిర వార్షికోత్సవం

త్రిపురాంతకం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఎన్నెస్పీ కాలనీలోని సాయిబాబా మందిర 26వ వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు ఎం. రామశ్రీనివాసరావు ఆధ్వర్యంలో సాయిబాబా మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం కాకడ హారతి, గణపతిపూజ, అభిషేకం, అర్చన, పాదపూజ, విష్ణుసహస్రనామ పారాయణం, సాయి చాలీసా పారాయణం, మధ్యాహ్న హారతి, ప్రసాద వితరణ నిర్వహించారు. అనంతరం సాయంత్రం గ్రామోత్సవం నిర్వహించారు.



భక్తులకు దర్శనం ఇస్తున్న సాయిబాబా

మద్యం సేవించి వాహనాలు నడపడం ప్రాణాంతకం

కొమరోలు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు మద్యంసేవించి వాహనాలు నడపడం ప్రాణాంతకమని గిద్దలూరు సీఐ జే రామకోటయ్య సూచించారు. మండలంలోని తాటిచర్ల మోటులో గిద్దలూరు సీఐ రామకోటయ్య బుధవారం వాహనదారులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనా లను నడిపే సమయంలో కుటుంబ సభ్యులను గుర్తుకు తెచ్చుకోవాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపే వ్యక్తి కుటుంబమే కాకుండా ఎదుటి వ్యక్తి కుటుంబ కూడా ఇబ్బంది పడుతుందన్నారు. అలాంటి ఘటనలు తాము నిత్యం చూస్తున్నామన్నారు. అలా జరగకూడదనే ఈ అవగాహన కార్యాక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. రాత్రిపూట ప్రయాణాలు సాధ్యమైనంత మేరకు తగ్గించుకోవాలన్నారు. ప్రతి వాహనదారులు కచ్చితంగా హెల్మెట్‌ను ధరించి మాత్రమే ప్రయాణించాలన్నారు. హెల్మెట్ వలన ప్రాణాలను కాపాడుకునే అవకాశం ఉంటుందన్నారు. వాహనాల్లో పరిధికి మించి లోడును తీసుకెళ్తే వారిపై కటిన చర్యలు తప్పవని అన్నారు.

సకాలంలో రుణాలు చెల్లించాలి

గిద్దలూరు టౌన్, ఫిబ్రవరి 5 (అంధ్ర జ్యోతి): రైతులకు కమ్యునిటీ హైరింగ్ సెంటర్ పథకం ద్వారా ప్రభుత్వం అందించిన ట్రాక్టర్, వ్యవసాయ ఉపకరణాల రుణాలను సక్రమంగా చెల్లించాలని ఏవో విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని ఉయ్యాలవాడ, గడికోట, సంజీవరాయునిపేట, కంచిపల్లె, గిద్దలూరు, తంబళ్లపల్లి గ్రామాల్లో రైతుసేవా కేంద్రాల పరిధిలో 2021-22, 2022-23 సంవత్సరాలలో రైతులకు ప్రభుత్వం అందించిన ఉపకరణాలను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఏఈవో శ్రీనివాసరెడ్డి, గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

8న క్యాన్సర్ రోగులకు ఉచిత వైద్య శిబిరం

గిద్దలూరు టౌన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఒంగోలుకు చెందిన హెచ్‌సీజీ ఎంఎస్ఆర్ క్యాన్సర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఈ నెల 8న శనివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు స్థానిక ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆదామ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి సూచనలతో ఈ వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. శిబిరానికి కేన్సర్ వైద్యనిపుణులు డాక్టర్ నారు రమణరెడ్డి పాల్గొని రోగులను పరీక్షిస్తారన్నారు. ఆసుపత్రికి వచ్చే వారు పాత రిపోర్టులు ఉంటే తీసుకుని రావాలన్నారు.

చెత్త సంపద కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



చెత్తసంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఈవోఆర్‌డీ బ్రహ్మయ్య

కొమరోలు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): గ్రామా పంచాయతీల్లో చెత్త సంపద కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఈవోపీఆర్‌డీ దేవరశెట్టి బ్రహ్మయ్య తెలిపారు. మండలంలోని బాదినేనిపల్లి, సూరవారిపల్లి, రెడ్డిచర్ల గ్రామ పంచాయతీల్లో గత టీడీపీ హయాంలో నిర్మించి డంపింగ్ యార్డులను పరిశీలించారు. వాటిని వినియోగంలోకి తీసుకొచ్చేందుకు ఆయా పంచాయతీల సిబ్బంది, అధికారుల తో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పంచాయతీలు సొంతంగా ఆదాయాన్ని సమకూర్చుకోవచ్చన్నారు. గ్రామ పంచాయతీల్లో ప్రజాప్రతినిదులు, అధికారులు కలిసి సమష్టిగా కృషి చేస్తేనే ప్రజలకు మంచి పరిపాలనను అందించగలగుతామన్నారు. మండలంలోని 14 గ్రామ పంచాయతీలోని డంపింగ్‌యార్డులు గత ప్రభుత్వంలో ఆగిపోయాయని, ప్రస్తుత ఎన్‌డీఏ ప్రభుత్వం పునఃప్రారంభి స్తోందన్నారు. వాటికి అవసరమైన మెటీరియల్‌ను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో బండి కారుణ్య, అహల్యారాణి పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

త్రిపురాంతకం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న ఆటోను విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారు. రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. మండలంలోని వెల్లంపల్లి వద్ద ఆటోను తనిఖీ చేసి అందులో 90 గన్నీ బ్యాగులలో రేషన్ బియ్యాన్ని గుర్తించి పోలీసు స్టేషనుకు తరలించారు. డ్రైవరు ఎర్రగుంట్ల చినరాయుడుతోపాటు మరో ముగ్గురిపై క్రిమినల్ కేసు నమోదు చేసినట్లు విజిలెన్స్ సీఐ రాఘవరావు తెలిపారు. స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని ఎంఎల్ఎస్ గోడౌన్‌కు తరలించారు. ఈ తనిఖీలో విజిలెన్స్ ఎస్సై నాగేశ్వరరావు, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ రాధాకృష్ణ సిబ్బంది పాల్గొన్నారు.

ఈసీఈ డే వేడుకలు

కంభం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కార్యకర్తలు, తల్లులు, పిల్లల పౌష్టికాహారం బరువులపై శ్రద్ధ తీసుకుని ప్రభుత్వం అందచేస్తున్న పౌష్టికాహారం, బాలామృతాలను అందించాలని బేస్తవారపేట సీడీపీవో నీలోఫర్ తెలిపారు. మండలంలోని పోరుమామిళ్లపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం ఈసీఈ (ఎర్లీ చైల్డ్ కేర్ ఎడ్యుకేషన్ డే)లో నీలోఫర్ మాట్లాడారు. ప్రతినెల 5వ తేది అంగన్‌వాడి కేంద్రంలో ఈసీఈ డే నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ చెంచులక్ష్మి, కార్యకర్త మాధవిలత, పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించండి

● సీడీపీవోకు కార్యకర్తల వినతి

ఎర్రగొండపాలెం రూరల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాలలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని, కార్యకర్తల, ఆయాల జీతాలు పెంచాలని కోరుతూ బుధవారం స్థానిక ఐసీడీఎస్ సీడీపీవో పద్మావతికి అంగన్వాడీ కార్యకర్తలు వినతిపత్రం అందజేశారు. ఏపీ అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ) అధ్వర్యంలో కార్యలయ ఏదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రాలలో ఉన్న సిబ్బందికి కనీస వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. సమస్యలపై సీడీపీవో స్పందిస్తూ వారి కోరికలను జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్యకర్తలు రామసుబ్బమ్మ, పద్మ, షంషాద్, రైత్ మేరి, తిరుపాలమ్మ, శివపార్వతి, రమకుమారి, నసిమా తదితరులు పాల్గొన్నారు.



సీడీపీవోకు వినతిపత్రం ఇస్తున్న కార్యకర్తలు

మిరపలో సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడులు

మార్కాపురం రూరల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : మిరపలో సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడులు సాధించవచ్చని ఉద్యానశాఖ అధికారి రమేష్ తెలిపారు. మండలంలోని పెద్ద యాచవరం గ్రామంలో బుధవారం మిరప రైతులకు సమగ్ర సస్యరక్షణ చర్యలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యాన నిపుణులు సిద్ధేశ్వరరెడ్డి మాట్లాడుతూ వేసవి సమయంలో దుక్కిని లోతుగా దున్ని ఎకరానికి 200 కిలోల వేప పిట్టును వేసుకోవాలని తెలిపారు. మిరప నారు నాటిన వెంటనే నీలం, తెలుపు రంగు జిగురు అట్టలను ఎకరానికి 40 చొప్పున అమర్చుకోవాలన్నారు. ఈ పద్దతులు పాటించడం వలన పురుగు మందుల ఖర్చులు తగ్గించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఉద్యాన సహాయకురాలు జయంతి, రైతులు పాల్గొన్నారు.

జమ్మనపల్లిలో పొలం పిలుస్తోంది

మండలంలోని జమ్మనపల్లి, కోలబీముని పాడు గ్రామాలలో బుధవారం ఎఓ శ్రీనివాసులు పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ గ్రామాలలో రైతులు సాగు చేస్తున్న పంటలను పరిశీలించి సలహాలు సూచనలు తెలియజేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, రాయితీలు పొందాలంటే ఖచ్చితంగా పంటలు సాగుచేసిన ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో రైతుసేవా కేంద్రాల సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



త్రిపురాంతకంలో మిరపను పరిశీలిస్తున్న ఏవో

త్రిపురాంతకం : రైతులు పండించే పంటల్లో యాజమాన్య పద్దతులు పాటించాలని ఏవో కెనీరజ అన్నారు. మండలంలోని రామసముద్రం, మిట్టపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు సాగు చేసిన మిర్చి, కంది పంటలను పరిశీలించి పలు సూచనలు చేశారు. పంటల్లో సోకుతున్న తెగుళ్లను వివరించి, వాటి నివారణకు తీసుకోవాల్సిన చర్యలను తెలిపారు. కార్యక్రమంలో ఏఈవో ధనీశ్వర్‌నాయక్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కొనకనమిట్ల : గ్రామాలలో ఉండే ప్రతి రైతు ఫార్మర్‌రిజిస్ట్రీ తప్పనిసరిగా రైతు సేవాకేంద్రాలలో చేయాలని ఏవో ప్రసన్నరంగలక్ష్మి తెలిపారు. మండలంలోని గొట్లగట్టు, చినమనగుండం గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ప్రభుత్వ సేవల గురించి వివరించారు. కార్యక్రమంలో ఆయాగ్రామాల వీఏఏలు, పలువురు రైతులు తదితరులు పాల్గొన్నారు.



యాచవరంలో మిరపను పరిశీలిస్తున్న ఉద్యాన అధికారి

పెద్దదోర్నాల : ప్రభుత్వ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయాధికారి జవహర్‌లాల్ నాయక్ అన్నారు. మండలంలోని అయినముక్కుల, తిమ్మాపురం గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామాల్లో సాగుచేసిన పంటలను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పీఎంకిసాన్, ఫసల్‌బీమా పథకం, రైతుగుర్తింపు కార్డులు మంజూరు గురించి వివరించారు. కార్యక్రమంలో వీఏఏ శివనాయక్, వీహెచ్ఏ సుస్మిత పాల్గొన్నారు.

అవీ..ఇవీ



ఎంపీడీవో కార్యాలయ కంప్యూటర్‌లో వివరాలను పరిశీలిస్తున్న సీఈవో

మండల పరిషత్ కార్యాలయం ఆకస్మిక తనిఖీ

పామూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : చెత్త సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకువచ్చి సంపద సృష్టించాలని జడ్పీ సీఈవో బి. చిరంజీవి, డీపీవో వెంకటనాయుడులు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయాన్ని బుధవారం వారు ఆకస్మిక తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని ఫైల్స్, రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. చెత్త సంపద కేంద్రాల పనితీరును మెరుగు పరచి, అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఇంటిపన్నులను వందశాతం వసూలు చేయాలని కార్యదర్శులకు సూచించారు. అనంతరం చెత్తనుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించి నిర్వహణపై తగు సూచనలు చేసారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీడీవో బి. సురేష్, పామూరు ఈవో జీవీ అరవింద్, కార్యదర్శులు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు పాల్గొన్నారు.



ఖోఖో క్రీడాకారుడు శివారెడ్డిని సన్మానిస్తున్న బీజేపీ నేతలు

ఖోఖో క్రీడాకారుడు శివారెడ్డికి సన్మానం

ముండ్లమూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ కప్పు ఖోఖో జట్టు క్రీడాకారుడు, ఇటీవల భారత్ జట్టు తరుపున ఢిల్లీలో ఆడిన మండలంలోని ఈదర గ్రామానికి చెందిన పోతిరెడ్డి శివారెడ్డిని బుధవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు సెగ్గం శ్రీనివాసరావు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈదర గ్రామంలో జన్మించిన ప్రపంచ స్థాయి ఆణిముత్యం శివారెడ్డి అని అన్నారు. అలాంటి క్రీడాకారుడుని మనం సన్మానించు కోవటం చాలా గర్వంగా ఉందన్నారు. ముందుగా శివారెడ్డికి జన్మనిచ్చిన గురవారెడ్డి, కోటేశ్వరమ్మ దంపతులను ప్రత్యేకంగా అభినందించారు. జిల్లా ఉపాధ్యక్షుడు కిండి నారాయణరెడ్డి, దర్శి నియోజక వర్గ అసెంబ్లీ కన్వీనర్ మాడపాకుల శ్రీనివాసరావు, దండు శ్రీనివాసరావు, అనిల్, మండల అధ్యక్షుడు ఎం. వెంకట శేషయ్య, ఒంగోలు టౌన్ అధ్యక్షుడు వంశీ పాల్గొన్నారు.

త్వరలో అమృత పథకం పనులు

● ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన

దర్శి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): దర్శి నగర పంచాయతీ పరిధిలో ఇంటింటికీ కొళాయిలు ఏర్పాటు చేసేందుకు అమృత పథకం పనులు త్వరలో ఆరంభిస్తామని దర్శి నగర పంచాయతీ కమిషనర్ వై. మహేశ్వరరావు తెలిపారు. ఆంధ్రజ్యోతి ప్రకాశంలో బుధవారం 'పురోగతిలేని అమృతం' శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. అమృత పథకం కోసం రెండు సంవత్సరాల క్రితం రూ.121 కోట్లు నిధులు విడుదలైనట్లు అధికారులు తెలిపారు. ఇప్పటికే ఆన్‌లైన్ టెండర్లు ఖరారు చేశామని, ఎన్నికల కోడ్ రావటంతో పనులు ఆరంభించలేదని అన్నారు. త్వరలో పనులు ప్రారంభించేందుకు పబ్లిక్ అండ్ హెల్త్ శాఖ త్వరలో చర్యలు తీసుకుంటుందని ఆయన వివరించారు.

దర్శి ఏఎంసీ చైర్మన్ పదవికి తీవ్ర పోటీ

ముమ్మరంగా ప్రయత్నిస్తున్న పలువురు ఆశావహులు

దర్శి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): దర్శి ఏఎంసీ చైర్మన్ పదవి కోసం టీడీపీ కూటమికి చెందిన పలువురు నాయకులు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఈ సారి చైర్మన్ పదవి జనరల్ మహిళ కేటగిరీకి రిజర్వు అవుతున్నట్లు వార్తలు రావటంతో పోటీ తీవ్రమైంది. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీని కలిసి పలువురు ఆశావాహులు తమకు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేసినట్లు సమాచారం. దర్శి మార్కెట్ కమిటీలో చైర్మన్‌తో పాటు వైస్ చైర్మన్ మరో 14 మంది సభ్యులు ఉంటారు. నలుగురు కో-అప్షన్ సభ్యులుంటారు. ఈ నేపథ్యంలో చైర్మన్ పదవి జనరల్ మహిళకు రిజర్వు అయిందనే వార్తలు రావటంతో దర్శికి చెందిన పలువురు నాయకులు ఆ పదవిని ఆశిస్తున్నట్లు తెలిసింది. టీడీపీ కూటమి ప్రభుత్వం పదవుల కేటాయింపులో సామాజిక వర్గాల సమతుల్యాన్ని పాటిస్తున్నది. అందువలన దర్శి ఏఎంసీ చైర్మన్ పదవి ఈ సారి కాపు వర్గానికి దక్కుతుందనే వార్తలు బలంగా వినిపిస్తున్నాయి. అందువలన ఆ వర్గానికి చెందిన అనేకమంది నాయకులు ఈ పదవి కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు అదేవిధంగా ఈ పదవి కోసం మిగిలిన సామాజిక వర్గాలకు చెందిన నాయకులు కూడా తమవంతు ప్రయత్నాలు చేస్తున్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇద్దరు మాత్రమే చైర్మన్ పదవులు చేశారు. పలు కారణాల వలన చాలా సమయం ఖాళీగా ఉంచటంతో అప్పుడు అనేక మంది అవకాశాలు కోల్పోయారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ముగ్గురికి అవకాశం లభించింది. చివరిగా బీసీ మహిళ ఏఎంసీ చైర్మన్‌గా పనిచేశారు. టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఏఎంసీ చైర్మన్ పదవి నియామకం జరుగుతుండటంతో ఈ సారి ఎవరికి దక్కుతుందనే చర్చ విస్తృతంగా జరుగుతోంది.



దర్శి మార్కెట్‌యార్డు కార్యాలయం

దెబ్బతిన్న బ్రిడ్జిలు, కల్వర్టుల పరిశీలన

ముండ్లమూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మోదేపల్లి మేజరు కాలువపై అయోధ్య నగర్, ఈదర మధ్య ఉన్న దెబ్బతిన్న బ్రిడ్జి, గాంధీ నగర్ వద్ద దెబ్బతిన్న కల్వర్టులు, మరమ్మతులకు గురైన డ్రాపుల స్థానంలో రూ. 68 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మాణాలు చేపడతామని దర్శి ఎన్ఎస్పీ ఈఈ కే రామకృష్ణ అన్నారు. ఆయన బుధవారం మండలంలోని మోదేపల్లి మేజరులో దెబ్బతిన్న కల్వర్టులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడుతూ వెంటనే ప్రతిపాదనలు తయారు చేసి పంపాలని ఆదేశించారు. నిధులు మంజూరైన వెంటనే కొత్త బ్రిడ్జి, కల్వర్టులు చేపడతామన్నారు. అయోధ్య నగర్, ఈదర మధ్య ఉన్న బ్రిడ్జి పూర్తి స్థాయిలో దెబ్బతిందని, రక్షణ గోడలు లేక పోవటం వల్ల ఇబ్బందులు ఏర్పడతాయన్నారు. అందువల్ల రాత్రుల సమయాల్లో ప్రయాణం చేసే వాహన చోదకుల కోసం హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తామన్నారు. వచ్చే ఏడాది కల్లా నిర్మాణాలు పూర్తయి ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూస్తామన్నారు. డీసీ చైర్మన్ కంచుమాటి శ్రీనివాసరావు మోదేపల్లి మేజరు కాలువపై ఉన్న పరిస్థితులను ఈఈ రామకృష్ణకి వివరించారు. ఈ పరిశీలనలో ఆయన వెంట ముండ్లమూరు డీఈ పూర్ణచందు, జేఈలు ప్రసాదు, సత్యనారాయణ, సిబ్బంది, వేముల, అయోధ్యనగర్ గ్రామాల రైతులు పాల్గొన్నారు.



సాగర్ కాలువపై దెబ్బతిన్న బ్రిడ్జిని పరిశీలిస్తున్న ఈఈ రామకృష్ణ, డీఈ పూర్ణచందు, డీసీ చైర్మన్ శ్రీనివాసరావు

రుణాలకు నేటిలోపు దరఖాస్తులు చేసుకోవాలి

బీసీ కార్పొరేషన్ ఈడీ వెంకటేశ్వరరావు

తాళ్లూరు, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం బీసీ ,ఈడబ్ల్యూఎస్, కాపులకు రుణాలు మంజూరు చేస్తున్నందున అర్హత గల లబ్ధిదారులు ఈనెల 6 వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని బీసీ కార్పొరేషన్ ఈడీ వెంకటేశ్వరరావు తెలిపారు. రుణాల దరఖాస్తుల ఆన్‌లైన్ వివరాలు తెలుసుకునేందుకు ఎంపీడీవో కార్యాలయం, గ్రామ సచివాలయాన్ని బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో 1,219 యూనిట్లకు 24కోట్ల 68లక్షల రుణాలను 2,569 మంది లబ్ధిదారులకు అందజేయనున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా స్వయం ఉపాధి కింద బీసీలకు 1,195 యూనిట్లు, జనరిక్ మెడికల్‌షాపులకు 24 యూనిట్లు, ఈడబ్ల్యూఎస్ కింద 486 యూనిట్లు, జనరిక్ మెడికల్‌షాపులకు 83 యూనిట్లు, కాపులకు 188 యూనిట్లు మంజూరయినట్లు తెలిపారు. ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులను ఈనెల 7నుంచి 11 వ తేదీ వరకు ఎంపీడీవో కార్యాలయంలో పరిశీలిస్తారన్నారు. 16 వ తేదీ జిల్లా బీసీ కార్పొరేషన్ కార్యాలయానికి అవి చేరతాయని, 23న ఎంపికయిన లబ్ధిదారుల జాబితాను వెల్లడిస్తామని, మార్చి10 న యూనిట్లను గ్రౌడింగ్ చేస్తామని తెలిపారు. అర్హత గల లబ్ధిదారులు రుణాలు పొందేందుకు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని 6 వ తేదీలోపు దరఖాస్తులను ఆన్‌లైన్‌లో చేయాలని తెలిపారు. ఆన్‌లైన్ దరఖాస్తులు ఏఏ యూనిట్లకు పెట్టుకోవాలో వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో డి.హనుమంతరావు, సీడీపీవో సీహెచ్‌భారతి, ఎంఈవో జి.సుబ్బయ్య అడ్మినిస్ట్రేటివ్ అధికారి ఎస్ .సత్యం తదితరులు పాల్గొన్నారు.



సచివాలయంలో రుణాల దరఖాస్తుల ఆన్‌లైన్ గురించి సూచనలిస్తున్న బీసీ కార్పొరేషన్ ఈడీ వెంకటేశ్వరరావు

మిరప, నిమ్మలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

● శాస్త్రవేత్త గంగోత్రి

కనిగిరి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : మిరప, నిమ్మ పంటల్లో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని శాస్త్రవేత్త గంగోత్రి అన్నారు. మండలంలోని తక్కెళ్లపాడు గ్రామంలో బుధవారం నిమ్మ, మిరప పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిమ్మ , మిరపలో వచ్చే పురుగులు వాటి నివారణా చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. మిరపలో వచ్చే తామర పురుగు, నల్లి నివారణకు ఎసిటామాప్రిడ్ 0.2 గ్రాములు, ఫిప్రోనిల్ 2 మిల్లీ గ్రాములకు ఒక లీటరు నీటితో కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. నల్లి తెగులు నివారణకు స్పైరోమెసిఫిన్ 1మి.లీ ఒక టీలర్ నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు. అదేవిధంగా నిమ్మలో ఎక్కువగా వచ్చే ఆకుముడత, తెల్ల పొలుసు నల్లి పురుగు నివారణకు వేపనూనె 10వేలు పీపీఎం 5మి.లీ ఒక లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు. ఈకార్యక్రమంలో శాస్త్రవేత్త డాక్టర్ పీ. రామాంజనేయులు, పండ్ల శాస్త్ర విభాగానికి చెందిన గౌతమి, ఏవో అంజలీబాయి, ఏఏవోలు డీ శారద, పర్వీన్, రైతులు పాల్గొన్నారు.



తక్కెళ్లపాడు గ్రామంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

సొంత నిధులతో చప్టా నిర్మాణం

పామూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సీఎస్ పురం రోడ్డులోని మల్లాలమ్మ వీధి రోడ్డులో ప్రజలు సొంత నిధులు వెచ్చించి చప్టా నిర్మాణం చేపట్టారు. ఆ వీధిలో ఇటీవల ఉపాధి నిధులతో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. అయితే మురుగు నీరు వెళ్లేందుకు చప్టా లేకపోవడంతో వాహనదారులు, స్థానికులు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పలుమార్లు గ్రామ పంచాయతీ దృష్టికి తీసుకెళ్లినా నిధులు లేవంటూ దాటవేశారని స్థానికులు ఆరోపించారు. దీంతో స్థానికులే సొంతంగా నిధులు సమకూర్చుకొని చప్టా నిర్మాణం పనులు చేపట్టారు.



సొంత నిధులతో చప్టా నిర్మించుకొంటున్న స్థానికులు

ఉపాధి కూలీలందరికీ పనులు కల్పించాలి

తాళ్లూరు, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి) : మండలంలోని అన్ని గ్రామాల్లో మహాత్మాగాంధీ జాతీయఉపాధి హామీ పథకం కింద జాబ్ కార్డులు ఉన్న ప్రతి ఉపాధికూలీకిపనులు కల్పించాలని ఎంపీడీవో హనుమంతరావు సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మండలంలో ఉపాధిహామీ కూలీలకు పనులు కల్పించటంలో వెనుక బడి ఉందన్నారు. నిత్యం 1500 మంది కూలీలకు పనులు కల్పించేదుకు లక్ష్యంగా పెట్టుకోగా కేవలం 800 మంది కూలీలు పనులు కల్పిస్తున్నారని, మిగిలిన 700 మందికి పనులు కల్పించాలన్నారు. ఫీల్డ్‌అసిసెంట్లు కూలీలకు ఉపాధి కల్పించటంలో అలసత్వం వహిస్తే తగు చర్యలు తీసుకుంటామన్నారు. ఈకార్యక్రమంలో ఏపీవో బి.మురళి,ఈసీ గురుబాబు, టీఏలు,ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

నూతన స్కూళ్ల ఏర్పాటుపై అవగాహన సదస్సు

తాళ్లూరు, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం నూతన విద్యావిధానంలో భాగంగా 117 జీవో ఉప సంహరణ అనంతరం స్కూళ్ల ఏర్పాటు, మోడల్ స్కూళ్ల ఏర్పాటు గురించి స్థానిక ఎంఈవో కార్యాలయంలో బుధవారం అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ విద్యాశాఖ 117 జీవోను ఉపసంహరించిందన్నారు. ఏవిధంగా స్కూళ్లను రూపాంతరించాలి, మోడల్ స్కూళ్లు, హైస్కూళ్ల ఏర్పాటు గురించి రూపొందిన ప్రణాళికను వెల్లడించారు. నూతనంగా రూపొందించిన ప్రణాళికపై అందరూ సంతృప్తి వ్యక్తం చేశారు. ఎంఈవో-2 సుధాకర్‌రావు, సీడీపీవో భారతి, పలు పాఠశాలల హెచ్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

రేపు మండలస్థాయి ప్రతిభా పరీక్ష

పీసీపల్లి,ఫిబ్రవరి5(ఆంధ్రజ్యోతి):ఈనెల 7వతేదీన నేరేడుపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి ప్రతిభా పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అంజనీదేవి తెలిపారు. ఆ మేరకు బుధవారం ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డిని కలిసిన హెచ్ఎం ఈ కార్యక్రమానికి ఆహ్వానిస్తూ పత్రికను అందజేశారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా శేషయ్య

ముండ్లమూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ మండల అధ్యక్షుడిగా మండలంలోని కెల్లంపల్లి పంచాయతీ పరిధిలోని బసవాపురం గ్రామానికి చెందిన మండలపు వెంకట శేషయ్యను నియమిస్తూ బుధవారం ఆపార్టీ జిల్లా అధ్యక్షుడు శగ్గం శ్రీనివాసరావు నియామక ఉత్తర్వులు అందజేశారు.



తహసీల్దార్ కార్యాలయం ఎదుట జరిగిన ధర్నాలో మాట్లాడుతున్న పీసీ కేశవరావు

కార్మిక సంఘాల గొంతు నొక్కేందుకే చట్టాల మార్పు

కనిగిరి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : కేంద్రం కార్మిక చట్టాలు మార్పు చేసి కార్మిక సంఘాల గొంతు నొక్కే కుట్ర చేస్తుందని సీఐటీయూ జిల్లా నాయకులు పీసీ కేశవరావు అన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన కార్మిక చట్టాల సవరణను వ్యతిరేకిస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట బుధవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. కార్మిక చట్టాలను నిర్వీర్యం చేసేలా కేంద్ర ప్రభుత్వం సవరణలు చేపట్టడం దుర్మార్గమన్నారు. వెంటనే ఈ విధానాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ నాయకులు షేక్ బషీరా, ప్రసన్న, శాంతకుమారి, పిచ్చయ్య, ఏడుకొండలు, సీహెచ్ ప్రసాద్, చార్లెస్‌మార్క్, బుర్రయ్య, వెంకటేశ్వర్లు, చెన్నారావు తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

పామూరు : కేంద్ర ప్రభుత్వం నూతన లేబర్ కోడ్‌లను అమలు చేస్తామని చెప్పడం కార్మికులను వెట్టి బానిసలుగా మార్చడమేనని, అలాంటి చట్టాలను వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కే మాల్యాద్రి, డిమాండ్ చేశారు. లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కోరుతూ సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో స్థానిక మస్జిదాడి సెంటర్‌లో బుధవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. కనీసవేతనాలు దేశంలో అమలు కావడంలేదని సంఘటిత, అసంఘటిత కార్మికులకు కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని, కార్మిక చట్టాలు అమలు పరచాలని డిమాండ్ చేశారు. అనంతరం కేంద్రం తీసుకొచ్చిన లేబర్‌కోడ్‌ల పత్రాలను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో వై. వీరనారాయణ, సీహెచ్ వెంకటేశ్వర్లు, కే శంకర్, పి. రామయ్య, కార్మికులు పాల్గొన్నారు.



భూ సమస్యలపై సర్వేయర్‌ను నిలదీస్తున్న రైతులు

సమస్యలను త్వరలో పరిష్కరిస్తాం

● రైతులతో సమీక్షలో సర్వేయర్

తాళ్లూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : శివరాంపురం గ్రామంలో రీసర్వేలో జరిగిన తప్పుల్లో వచ్చిన 119 దరఖాస్తుల్లో 68 జాయింట్ సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని మండల సర్వేయర్ వై.శ్రీనివాసరావు తెలిపారు. రీసర్వే తప్పుల తడకగా జరిగినందున తాము ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్థులు కలెక్టర్‌కు దరఖాస్తు ద్వారా విన్నవించారు. ఉన్నతాధికారుల ఆదేశానుసారం మండల సర్వేయర్ శ్రీనివాసరావు బుధవారం రైతులతో సమీక్ష నిర్వహించారు. ఇటీవల జరిగిన గ్రామ సభలో 119 దరఖాస్తులు అందాయని, వాటిలో 68 జాయింట్ సమస్యలు ఉన్నాయని, వాటిని త్వరితగతిన పరిష్కరించి ఇబ్బందులు తొలగిస్తామన్నారు. మిగిలిన 51 విస్తరణ సమస్యలను జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్లి పరిష్కరిస్తామన్నారు. గత విలేజ్ సర్వేయర్ తమను సంప్రదించకుండా రీసర్వే చేయటం వల్లే రికార్డుల్లో తప్పులు వచ్చి తమకు ఇబ్బందులు వచ్చాయని, ఆ విలేజ్ సర్వేయర్‌పై తగుచర్యలు తీసుకోవాలని గ్రామస్థులు, రైతులు కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ యువనేత నారిపెద్ది కళ్యాణ్, రైతులు పాల్గొన్నారు.



పోలీస్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ దామోదర్

పేలుడు పదార్థాలు పోలీస్ స్టేషన్‌లో ఉంచొద్దు

● ఎస్పీ దామోదర్ సూచన

కురిచేడు, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): పోలీస్‌స్టేషన్‌లో పేలుడు పదార్థాలు ఉంచవద్దని ఎస్పీ ఏఆర్ దామోదర్ సూచించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ బుధవారం తనిఖీ చేశారు. ముందుగా స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. అనంతరం స్టేషన్‌ను, రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. కొవిడ్ సమయంలో కురిచేడులో శానిటైజర్ తాగి 16 మంది మరణించారు. వారి మరణానికి కారణమైన శానిటైజర్ తయారుచేసే ముడి పదార్థాలను స్టేషన్‌లోని ఓ గదిలో ఉంచారు. అవి మంటలు మండటానికి సహాయపడేవి అయినందున వాటిని స్టేషన్‌లో ఉంచవద్దని, కోర్టు అనుమతి తీసుకుని వాటిని వేరే ఎక్కడైనా భద్రం చేయాలని డీఎస్పీ నారాయణ రెడ్డికి సూచించారు. తన కాపురం నిలబెట్టాలని ఓ ముస్లిం మహిళ ఎస్పీకి మొరపెట్టుకున్నది. కేసు నమోదు చేశామని, పిలిపించి మాట్లాడతానని ఎస్ఐ శివ హామీ ఇచ్చారు. పడమర వీరాయపాలెం గ్రామానికి చెందిన ఓ కుటుంబం ఎస్పీని కలిసి తమ ఇంటికి దారి ఇవ్వడం లేదని ఫిర్యాదు చేశారు. పిలిపించి మాట్లాడమని ఎస్ఐకి సూచించారు. సాధారణ తనిఖీలలో భాగంగానే కురిచేడు పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశామన్నారు. మండలంలోని ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. దాతలు ముందుకు వచ్చి గ్రామాలలో రక్షణ ఏర్పాట్ల కోసం కెమెరాలు ఏర్పాటు చేసేందుకు సహకరించాలని కోరారు. స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. ఎస్పీ వెంట డీఎస్పీ నారాయణ రెడ్డి, సీఐ హస్సాన్, ఎస్ఐ శివ, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

క్రైం సమాచారం

గుర్తుతెలియని వాహనం ఢీకొని వృద్ధుడి మృతి

పామూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తిరగళదిన్నెగ్రామం వద్ద జాతీయ రహదారిపై వృద్ధుడిని గుర్తు తెలియని వాహనం ఢీ కొంది. ఈ ఘటన మంగళవారం అర్ధరాత్రి సమయంలో జరిగింది. ఎస్ఐ టి. అశోక్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం నెల్లూరు నుంచి పామూరు వెళ్లే రోడ్డు తిరగళదిన్నె జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనండీ కొట్టడంతో వృద్ధుడు (60 సంవత్సరాలు) మృతి చెందాడన్నారు. మృతదేహాన్నిస్థానిక మానవత సేవా సంస్థ సహకారంతో పంచనామా నిర్వహించి కనిగిరి ప్రభుత్వ వైద్యశాలలోని మార్చురీ గదిలో భద్రపరిచారు. ఎవరికైనా వృద్ధుడి ఆచూకీ తెలిస్తే పామూరు పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలని కోరారు.



గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో మృతిచెందిన వృద్ధుడు





అవగాహనతోనే.. ప్రమాదాల నివారణ

- వాహన చోదకులు నిబంధనలు పాటించాలి
- రోడ్డు భద్రతా ఉత్సవాల్లో కలెక్టర్ వెంకటమురళి
- బ్లాక్‌స్పాట్లలో సీసీ కెమేరాల ఏర్పాటు : ఎస్పీ తుషార్‌డూడీ



రహదారి భద్రతా నియమాలు పాటించండంటూ అవగాహన ర్యాలీ చేస్తున్న కలెక్టర్ వెంకటమురళి, ఎస్పీ తుషార్‌డూడీ

బాపట్ల, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): రోడ్లపై ప్రమాదాల నివారణ అవగాహనతోనే సాధ్యమని కలెక్టర్ వెంకటమురళి తెలిపారు. జాతీయ రోడ్డు భద్రతా ఉత్సవాలలో భాగంగా బాపట్లలో బుధవారం అవగాహన ర్యాలీ జరిగింది. రవాణాశాఖా ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమాన్ని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. మున్సిపల్ ఉన్నతపాఠశాల నుంచి పాతబస్టాండ్ కూడలి వరకు సాగిన ర్యాలీలో కలెక్టర్, ఎస్పీ తుషార్‌డూడీ తదితరులు పాల్గొన్నారు. హెల్మెట్‌ధారణ ప్రాణానికి రక్ష, అతివేగం పొంచి ఉన్న ప్రమాదం అంటూ పోలీసులు, డ్రైవర్లు ప్లకార్డులతో ర్యాలీలో పాల్గొన్నారు. పాతబస్టాండ్ ఆవరణంలో మానవహారం నిర్వహించారు. డ్రైవర్లతో కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వాహనాలు నడిపేవారంతా రహదారి భద్రత నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం నేరమన్నారు. గంజాయి, మద్యం తాగి వాహనాలు నడపరాదన్నారు. అతివేగ ప్రయాణం ప్రమాదకరమన్నారు. ద్విచక్రవాహనమైతే హెల్మెట్ ధరించాలని, కారు ప్రయాణమైతే సీటుబెల్ట్ తప్పనిసరిగా వేసుకోవాలన్నారు. రాత్రివేళల్లో వాహనాలు నడిపేవారు తగిన విశ్రాంతి తీసుకోవాలన్నారు. ప్రమాదాలు నివారించడానికి భద్రతా నియమాలను పోలీసులు నిత్యం అమలు చేస్తూనే ఉన్నారని ఎస్పీ తెలిపారు. అధికంగా ప్రమాదాలు జరిగే ప్రాంతాలను బ్లాక్ స్పాట్‌లుగా గుర్తించి ప్రత్యేక శ్రద్ధ పెట్టామన్నారు. ఆ ప్రాంతాల్లో సీసీ కెమేరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. హెల్మెట్, సీటుబెల్ట్ ప్రమాదాలలో ప్రాణాలను కాపాడతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ విఠలేశ్వర్, రవాణాశాఖాధికారి పరంధామరెడ్డి, డీఎంహెచ్‌వో డాక్టర్ విజయమ్మ, ఆర్డీవో పి.గ్లోరియా, మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి పాల్గొన్నారు.


పాతబస్టాండ్ వద్ద మానవహారంగా ఏర్పడి అవగాహన కల్పిస్తున్న రవాణా శాఖ సిబ్బంది, పోలీసులు

సేద్యానికి..డ్రోన్లు

- సమయం ఆదా.. ఖర్చుల్లో మిగులు
- సాంకేతిక వ్యవసాయంపై ప్రభుత్వం దృష్టి
- తొలుత మండలానికి ఓ యూనిట్ మంజూరు
- ఇప్పటికే గ్రూపుల ఎంపిక పూర్తి.. శిక్షణకు సన్నాహాలు

వ్యవసాయానికి.. సాంకేతిక సాయం. పురుగుల మందు పిచి కారీ చేస్తూ.. ఎరువులు వేస్తూ.. మా నవ వనరుల కొరతను తీరుస్తూ.. ఐదు గంటల్లో నలుగురు కూలీలు చేసే పనిని గంటలో ఒక్కరితోనే చేస్తూ.. పంట పొలాల్లో డ్రోన్లు సందడి చేయనున్నాయి. సమయం ఆదా.. కూలీల కొరత.. పెట్టుబడిలో మిగులు డ్రోన్ల సేద్యంతో సాధ్యమని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా తొలి అడుగుగా సేద్యంలో డ్రోన్ల సేవలను వినియోగించుకునే దిశగా కూటమి ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోంది. తొలి విడతలో మండలానికి ఓ గ్రామాన్ని ఎంపిక చేసుకుని అక్కడ రైతులకు సాయంగా డ్రోన్లు వినియోగాన్ని అధికారు లు అందుబాటులోకి తేనున్నారు. దశల వారీగా అన్ని గ్రామాల్లోని రైతులకు డ్రోన్ల సేవలు అందేలా కార్యాచరణ రూపొందించారు. డ్రోన్ ఆపరేటింగ్‌కు సంబంధించి పైలెట్‌కు శిక్షణ ఇచ్చే కార్యక్రమాన్ని గుంటూరు, నరసరావుపేట, బాపట్ల కలెక్టరేట్ల వేదికగా చేపట్టడానికి వ్యవసాయ శాఖ సన్నాహాలు చేస్తోంది.

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

సాంకేతిక రంగంలో వస్తున్న మార్పులను అందిపుచ్చుకుని వాటిని వ్యవసాయంలోకి కూడా ప్రవేశపెట్టి రైతులను సిద్ధం చేసే దిశగా కూటమి ప్రభుత్వం అడుగులేస్తోంది. వ్యవసాయంలో సంప్రదాయ విధానాలను వీడి లాభసాటి మార్గాలను అన్వేషించడంతో పాటు ఆ మెలకువలను రైతులకు శిక్షణ రూపంలో ఇవ్వడానికి కూడా వ్యవసాయ శాఖ సన్నద్ధమవుతోంది. ఈ క్రమంలో ఆధునిక సాంకేతికతకు నెలవుగా నిలుస్తోన్న డ్రోన్లను వ్యవసాయానికి ఉపయోగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. రైతులకు అన్ని విధాల అండగా ఉపయోగపడేలా డ్రోన్లను రూపొందిస్తున్నారు. సేద్యం నానాటికి భారమవ్వడం వెనుక పెట్టుబడి ఖర్చులు విపరీతంగా పెరగడం ప్రధాన కారణంగా ఉంది. ముఖ్యంగా మానవవనరుల కొరత ఉండడంతో కూలి ఖర్చులు మోయలేనంతగా రైతులను కుదేలు చేస్తున్నాయి. డ్రోన్లను సమర్థంగా వినియోగించుకోగలిగితే ఎంతో

(మిగతా 6వ పేజీలో)

50 శాతం సబ్సిడీ..

డ్రోన్ యూనిట్ వ్యయం గరిష్ఠంగా రూ.15 లక్షలుగా ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో 50 శాతం బ్యాంకు రుణ సదుపాయం అందించనుండగా, 40 శాతం రాయితీ రూపంలో ప్రభుత్వం ఇవ్వనుంది. మిగిలిన పది శాతం గ్రూపులోని రైతులు భరించేలా మార్గదర్శకాలు రూపొందించారు. గ్రూపులోని రైతులు తమ అవసరాలకు డ్రోన్‌ను వినియోగించుకుని ఆ తర్వాత నామమాత్రపు అద్దెకు ఇచ్చే వెసులుబాటు ప్రభుత్వం కల్పించింది. తద్వారా ఆ గ్రూపులోని రైతులకు ఆదాయం కూడా సమకూరనున్నది.

అవస్థలు పోయి.. ఆదాయం

పురుగు మందులు, ఎరువుల పిచికారీ సమయంలో రైతులు జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్ల ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా గడచిన ఐదేళ్లలో పది మంది వరకు మృతి చెందారు. సేద్యంలోకి డ్రోన్లు రావడం వల్ల రైతులకు నేరుగా పురుగు మందులు కొట్టే అవస్థ తప్పనుంది. డ్రోన్లు దక్కించుకున్న గ్రూపులోని రైతులు తమ అవసరాలకు వాడుకోవడంతో పాటు ఇతర రైతులకు అద్దెకు ఇవ్వాలని ప్రభుత్వం మార్గదర్శకాల్లో తెలిపింది. ఎకరాకు రూ.400 వరకు అద్దె వసూలు చేసుకునే వెసులుబాటును ప్రభుత్వం కల్పించింది.

వర్సిటీలో స్కిల్ ఎకో సిస్టం అభివృద్ధికి చర్యలు

పెదకాకాని, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం మరో నైపుణ్య శిక్షణ కేంద్రానికి వేదిక కానుంది. విద్యార్థులు, యువతకు మెరుగైన నైపుణ్యాలు నేర్పించి వారిని ఉపాధి మార్గాల వైపు పయనించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంది. అందులో భాగంగా ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ విశ్వవిద్యాలయంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టింది. లేబర్, బాయిలర్స్ అండ్ ఇన్సూరెన్స్, మెడికల్ సర్వీసెస్, ప్రత్యేక కార్యదర్శి ఎ.వాణి ప్రసాద్, ఏపీ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీ ఎస్ఎస్‌డీసీ) ఎండీ, సీఈవో గణేష్‌కు మార్‌ల బృందం బుధవారం విశ్వవిద్యాలయాన్ని సందర్శించింది. వర్సిటీ ఇన్‌చార్జ్ వీసీ గంగాధరరావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.సింహాచలంతో కలిసి దూరవిద్య కేంద్రాన్ని పరిశీలించారు. స్కిల్ ఒరియంటేషన్, స్కిల్ ఎకో సిస్టమ్ అభివృద్ధి, అందుకు అవసరమైన వసతులు గుర్తించారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, ఏపీఎస్ఎస్‌డీసీలు సంయుక్తంగా చేపట్టాల్సిన పలు స్కిల్ ఇనిషియేటివ్స్‌పై చర్చించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ వీసీ గంగాధరరావు మాట్లాడుతూ వర్సిటీలో స్కిల్ ఎకో సిస్టం ఏర్పాటుకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఏపీ ఎస్ఎస్‌డిసి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ దినేష్ పాల్గొన్నారు.

నదుల అనుసంధానంపై "కదలిక"



- ఎత్తిపోతల నిర్మాణానికి భూముల పరిశీలన
- ఎర్రబాలెం వద్ద పనులను పరిశీలించిన జేసీ సూరజ్
- భూమి సేకరించేందుకు రెవెన్యూ శాఖ ఏర్పాట్లు

(నరసరావుపేట, క్రోసూరు - ఆంధ్రజ్యోతి)

నదుల అనుసంధానంపై కదలిక వచ్చింది. జలహారతి పథకం తొలివిడతలో సాగర్ ఆయకట్టుకు గోదావరి జలాలను తరలించనున్నా రు. ఆయా పనులకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోంది. ఈ క్ర మంలో కాంట్రాక్ట్ సంస్థ మెగా ఇంజనీర్లతో కలసి పల్నాడు జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్‌ఘనోరే అమరావతి మండలం వైకుంఠపురం, క్రోసూరు మండలం పీస పాడు గ్రామాల మధ్య పంపు హౌస్ నిర్మా ణ పనులను పరిశీలించారు. భూసేకరణపై రెవెన్యూ అధికారులతో చర్చించి అవసర మైన భూములను పరిశీలించారు. ఇంజనీర్ల కు, కాంట్రాక్ట్ సంస్థకు జేసీ పలు సూచన లు చేశారు. తహసీల్దార్ వేముల వెంకట నాగరాజు, సర్వేయర్ శ్రీధర్, వీఆర్‌వో ఇబ్రహీం, డీటీ శ్రీనివాసరావులతో పాటు కాంట్రాక్ట్ సంస్థ ఇంజనీరింగ్ నిపుణులు జేసీ వెంట ఉన్నారు. ఈ ప్రక్రియతో అనుసంధానంపై మరో అడుగు పడింది. ఈ పనులను గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రారంభించగా తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం నిలిపివేసింది. తాజా గా ఈ పథకం నిర్మాణానికి కూటమి ప్రభుత్వం పూనుకోవడంతో పను ల్లో కదలిక వచ్చింది. ఎత్తిపోతల పథకంతో పల్నాడు, గుంటూరు, బాప ట్ల, ప్రకాశం జిల్లాల్లోని ఆయకట్టుకు మహర్దశ పట్టనున్నది. పనులను 2026 జూన్ కల్లా పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించుకుంది.


పథకం ప్లాన్‌ను పరిశీలిస్తున్న జేసీ సూరజ్

కుడి కాల్వకు గోదారి..

జలహారతి తొలివిడత సాగర్ కుడికాల్వకు గోదావరి జలాలను తర లిస్తారు. జలహారతి తొలి ప్రయోజనం నాగార్జున సాగర్ జవహర్ కుడి కాల్వ ఆయకట్టు రైతులు పొందనున్నారు. నదుల అనుసంధానం తొలు త సాగర్ కుడికాల్వ వరకు చేపట్టనున్నారు. గోదావరి జలాలను బొల్లా పల్లి జలాశయంలో నిల్వ చేసి అక్కడి నుంచి బనకచర్ల రెగ్యులేటర్‌కు తరలించే పనులను మూడు దశలో చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయిం చింది. తొలిదశలో గోదావరి జలాలు 73 టీఎంసీలు మళ్లించి కుడి కాల్వ ఆయకట్టు 9.61 లక్షల ఎకరాలకు అందించాలన్నది ప్రధాన ఉద్దేశం. ఈ ఎత్తిపోతల పథకానికి 2018లో సీఎం చంద్రబాబు శంకుస్థాపన చేసిన విషయం తెలిసిందే. రూ.6020 కోట్లతో ప్రారంభించగా రూ.1,016 కోట్ల పనులు పూర్తియ్యాయి. ప్రకాశం బ్యారేజీ ఎగువన మూడు పంపు హౌస్‌లు నిర్మించడంతో పాటు ఆరు వరసల్లో 4.57 కిమీ మేర పైపు లు ఏర్పాటు చేసి నీటిని మళ్లిస్తారు. అక్కడి నుంచి 40 కిమీ పైగా కాల్వ తవ్వాల్సి ఉంది. మూడు సబ్ స్టేషన్లు నిర్మించాలి. రెండో ప్యా కేజీలో రెండు పంపుహౌస్‌లు నిర్మించాలి. 5.65 కిమీ మేర ఆరు వరసల పైపులు ఏ ర్పాటు చేయాలి. మరో 15.95 కిలోమీటర్లు కాల్వ తవ్వాలి. రెండు సబ్‌స్టేషన్లు నిర్మిం చాలి. ఈ ప్యాకేజీ లోరూ.550 కోట్ల పనులు పూర్తి చేశారు. మరో 2,105.82 కోట్ల పనులు చేయాల్సి ఉంది. రెండు ప్యాకేజీలకు సంబంధించి సుమారు 466 ఎకరాలు భూ సేకరణ చేయాల్సి ఉంది. భూసేకరణ త్వరలో నే ప్రారంభం కానున్నది. 466 ఎకరాల భూమి అవసరమవుతుందని రెవెన్యూ అధికారులు అంచనా వేసి సర్వే చేశారు. అ మరావతి, క్రోసూరు, రాజుపాలెం మండలాల గుండా నకరికల్లు మండలంలోని కుడి ప్రధాన కాల్వలో నీటిని కలుపుతారు. ఆయా మండలాల పరిధిలో భూసేకరణ కు రూ.1,044 కోట్లు వ్యయం అవుతుందని అంచనా. అమరావతి మండలం వైకుంఠ పురం వద్ద కృష్ణానది నుంచి నీటిని, అక్కడి నుంచి 66.59 కిలోమీటర్ల పొడవునా పైపులైన్ నిర్మించి సాగర్ కాల్వ 80వ మైలు వద్దకు గోదావరి నీటిని ఎత్తిపోతల ద్వారా తరలించేందు కు పథకాన్ని రూపొందించారు. 56.50 కిలోమీటర్లు గురుత్వాకర్షణ ద్వారా నీటిని తరలిస్తారు. 10.09 కిలోమీటర్లు ఎత్తిపోతల ద్వారా నీటిని కుడి కాల్వకు తరలిస్తారు.

8 వరకు గడువు పొడిగింపు

గీత కార్మికులకు మరో అవకాశం

12 మద్యం షాపులకు 32 దరఖాస్తులు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

గీత కార్మికులకు కేటాయించిన మద్యం దుకాణాల దరఖాస్తుల స్వీకరణ గడువును ఈ నెల 8వ తేదీ వరకు పొడిగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఎక్సైజ్ విభాగం తొలుత ఇచ్చిన ఉత్తర్వుల్లో ఈ నెల 5 వరకు మాత్రమే దరఖాస్తుల స్వీకరణ ఉంటుందని, 7న లాటరీ జరుగుతుందని తెలిపారు. కానీ హైకోర్టులో వేసిన కేసు నేపథ్యంలో ఆశించిన స్థాయిలో దరఖాస్తులు రాకపోవడంతో గడువును పొడిగిస్తూ ప్రభుత్వం బుధవారం నిర్ణయం తీసుకుంది. జిల్లాలో గీత కార్మికులకు కేటాయించిన 12 షాపులకు ఇప్పటి వరకు 32 దరఖాస్తులు వచ్చినట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ దేవదత్తు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుల స్వీకరణకు చివరి రోజైన శనివారం నెలలో రెండోది కావడంతో బ్యాంకులు ఆ రోజు పనిచేయవని, డీడీలు తీయడం కష్టమవుతుందని, ఆశావహులంతా శుక్రవారం నాటికే దరఖాస్తుల ప్రక్రియ పూర్తి చేసుకోవాలని కోరారు. ఈ నెల 10న జిల్లా కలెక్టర్ సమక్షంలో లాటరీ ప్రక్రియ జరిపి షాపులను కేటాయిస్తామన్నారు.

సౌత్ సెంట్రల్ నుంచి సౌత్ కోస్టుకు

జోన్ మారనున్న గుంటూరు రైల్వే డివిజన్

దక్షిణ మధ్య రైల్వేతో వీడిపోనున్న 30 ఏళ్ల బంధం

గుంటూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): గుంటూరు రైల్వే డివిజన్ సౌత్ సెంట్రల్ నుంచి సౌత్ కోస్టు జోన్‌లోకి మారనున్నది. ఇంచుమించు మూడు దశాబ్దాల పాటు దక్షిణ మధ్య రైల్వే(ఎస్‌సీఆర్) జోన్‌తో బంధం త్వరలో వీడిపోనున్నది. ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలో హామీ మేరకు కొత్త రైల్వే జోన్ దక్షిణ కోస్తా రైల్వే జోన్‌ని కేంద్ర రైల్వేబోర్డు నోటిఫై చేసిన దృష్ట్యా ఇందులోకి మారబోతున్నది. విశాఖపట్టణం హెడ్‌క్వార్టర్స్‌గా సౌత్ కోస్టు రైల్వే జోన్ ఏర్పాటు కానున్నది. ఇప్పటివరకు డివిజన్‌పై దక్షిణ మధ్య రైల్వే జోన్ చిన్న చూపు చూస్తూ వచ్చింది. ఒకదశలో సంక్రాంతి, దసరా వంటి పండుగల రద్దీ సమయంలోనూ గుంటూరు మీదగా స్పెషల్స్ నడిపేది కాదు. ఇప్పుడు ఎలక్ట్రిక్ ట్రాక్షన్ అందుబాటులోకి వచ్చాక పరిస్థితిలో కొంత మెరుగైంది. త్వరలో విశాఖ హెడ్‌క్వార్టర్స్‌గా ఉండే సౌత్ కోస్టు రైల్వే జోన్‌లోకి గుంటూరు డివిజన్ మారిపోతుండటంతో ఇక ప్రాధాన్యాలు పెరుగుతాయని అంతా ఆశిస్తున్నారు. నిధుల కేటాయింపులు కూడా పెరుగుతాయన్న అభిప్రాయాన్ని రైల్వేవర్గాలు వ్యక్తపరుస్తున్నాయి.

గుంటూరు డివిజన్ ఇలా..

ఎంపీల పోరాటాల అనంతరం గుంటూరు రైల్వే డివిజన్‌ని విజయవాడ నుంచి వేరు చేస్తూ 1995-96లో కేంద్ర రైల్వే శాఖ మంజూరు చేసింది. అయితే డివిజన్ ఆపరేషనల్‌కి దాదాపుగా ఎనిమిదేళ్లు పట్టింది. 2003 ఏప్రిల్ 1న అధికారికంగా గుంటూరు హెడ్‌క్వార్టర్స్‌గా ఏర్పడింది. కృష్ణా కెనాల్ - గుంటూరు, గుంటూరు - నంద్యాల, రేపల్లె - తెనాలి, తెనాలి - గుంటూరు, గుంటూరు - పగిడిపల్లి, నడికుడి - మాచర్ల, విష్ణుపురం - జాన్‌పహాడ్, నంద్యాల - యర్రగుంట్ల, కొత్తగా నడికుడి - శ్రీకాళహస్తి సెక్షన్లతో డివిజన్ ఏర్పడింది. గుంటూరు రైల్వే డివిజన్ రెండు తెలుగు రాష్ట్రాల్లో విస్తరించి ఉన్నది. గుంటూరులో 288.87 కిలోమీటర్లు, ప్రకాశం జిల్లాలో 156.70, కర్నూలులో 42.01, నల్గొండలో 102.64, యాదాద్రిలో 38.3, సూర్యాపేటలో 4 కిలోమీటర్ల రైల్వేట్రాక్‌ని కలిగి ఉన్నది. త్వరలో అమరావతి రాజధానికి రైలుమార్గం(ఎర్రుపాలెం - నంబూరు) ఏర్పాటు కాబోతున్నది. అయితే ఈ సెక్షన్‌ని అటు విజయవాడకు కేటాయిస్తారా.. ఇటు గుంటూరు డివిజన్‌కి ఇ స్తారా అన్న దానిపై రైల్వే శాఖ ఇంకా స్పష్టత ఇవ్వలేదు. చిట్యాల, నల్గొండ, మిర్యాలగూడ, విష్ణుపురం, నడికుడి, పొందుగుల, రెడ్డిపాలెం గూడ్స్‌షెడ్లు, నరసరావుపేట, నం ద్యాల, జాన్‌పహాడ్, నల్లపాడు(ఆర్ఎంసీ), శావల్యాపురం, వినుకొండ, దొనకొండలో సరుకు రవాణా సదుపాయాలు ఉన్నాయి. సిమెంట్ రవాణా కోసం విష్ణుపురం, జానపహాడ్‌లో మూడు కంపెనీలకు సైడింగ్‌లున్నాయి. గుంటూరులో ఒక కాన్‌కోర్ సైడింగ్ ఉన్నది. దీనికి అదనంగా నాగిరెడ్డిపల్లిలో ప్రైవేటు ఫ్రైట్ టెర్మినల్స్ కూడా ఉన్నాయి. డివిజన్ పరిధిలో 75 స్టేషన్లు ఉన్నాయి. వీటిల్లో ఏ1 కేటిగిరీలో గుంటూరు, బీ కేటిగిరీలో నంద్యాల, నల్గొండ ఉన్నాయి. మరో 13 డీ కేటిగిరీలో, 43 ఈ, 13 ఎఫ్, నాన్ ఆపరేషనల్ నాలుగు స్టేషన్లు ఉన్నాయి. ప్రస్తుతానికి గుంటూరు - కృష్ణాకెనాల్, గుంటూరు - తెనాలి డబ్లింగ్ పూర్తి అయ్యాయి. గుంటూరు - నంద్యాల సెక్షన్ దాదాపుగా పూర్తి కావొచ్చింది. నల్లపాడు - బీబీనగర్ డబ్లింగ్ పనులు ప్రారంభమయ్యాయి. 96 శాతం రైలు మార్గాలు విద్యుద్దీకరణ జరిగాయి. రైళ్ల రాకపోకలు అధికంగా ఉండే డివిజన్లలో గుంటూరు రైల్వే డివిజన్ కూడా ఒకటి. కాగా గుంటూరు నుంచి బయలుదేరడం, వేరే ప్రాంతాల నుంచి ఇక్కడికి వచ్చి ఆగిపోవడం, దూరప్రాంతాల నుంచి గుంటూరు మీదగా రాకపోకలు సాగించే రెగ్యులర్, స్పెషల్, వీక్లీ, బైవీక్లీ, ట్రైవీక్లీ కలుపుకుని దాదాపుగా 200లకు పైగానే ఉన్నాయి.



పల్లె ప్రజల దాహం తీరేనా..?

» వినియోగంలో లేని ట్యాంకులు
» ఈ వేసవికైనా తాగునీరు అందేనా
» ఎదురుచూస్తున్న స్థానికులు

వేటపాలెం (చీరాలటౌన్), ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : వేసవికి ముందే పల్లె గ్రామాల ప్రజల గొంతులు ఎండుతున్నాయి. వేటపాలెం మండల పరిధిలోని గ్రామీణ ప్రజలు వేసవి దాహార్తిపై ఆందోళన చెందుతున్నారు. వేసవి సమీపిస్తున్న క్రమంలో ఎండలు మండుతాయి. అలాగే భూగర్భ జలాలు ఇంకుతున్న నేపథ్యంలో తాగునీటి ఎద్దడి అధికంగానే ఉంటుంది. గ్రామాల్లో వాటర్ ట్యాంకులు మరమ్మతులకు గురై కొన్నిచోట్ల, వాడకంలో లేవు. లక్ష్మీపురంలో ఏకంగా ప్రారంభమే కాక స్థానికులు తిప్పలు పడుతున్నారు. ఇదే తరహా సమస్య దాదాపుగా మండలం మొత్తం ఉంది.

దేశాయిపేట గ్రామంలో పంచాయతీ పరిధిలో ఇప్పటికే ఒక ట్యాంకర్ వాడకంలో ఉంది. అయితే గ్రామం విస్తీర్ణం అధికంగా ఉండడంతో ఉన్న ట్యాంకర్ సరిపడక సుమారు పదేళ్ల కిందట పంచాయతీ పరిధిలోని విఘ్నేశ్వర కాలనీలో వాటర్ ట్యాంకును ఏర్పాటు చేశారు. అయితే అందుకు సంబంధించిన బోరును సమీపంలోని అనువైన స్థలంలో వేయడంతో వివిధ కారణముల చేత ఆ స్థలం వివాదంలో చిక్కుకుంది. దీంతో పదేళ్లు దాటిన సంబంధిత అధికారులు గానీ పాలకులు గానీ బోరును ఏర్పాటు చేయలేక పోయారు. దీంతో దాదాపుగా ట్యాంకర్ చుట్టూ చిల్లచెట్లు, ముళ్లతో శిథిలావస్థకు చేరుతుంది. ఈ నేపథ్యంలో నెలకొన్న సమస్య కారణంగా గ్రామస్థులు తాగు నీటికి అవస్థలు పడుతున్నారు. పైగా వేసవి సమీపించనుంది. దీంతో అధికారులు తాగునీటి అందించాలని గ్రామస్థులు వేడుకుంటున్నారు. అలాగే లక్ష్మీపురం ప్రజలకు తాగునీరు అందించే క్రమంలో అధికారులు రక్షిత మంచినీటి సరఫరా పథకం నిధుల నుంచి జాతీయ రహదారి సమీపంలో వాటర్ ట్యాంకును నిర్మించారు. అయితే ఇది పూర్తయి నెలలు కావస్తున్నా అధికారులు వాడకంలోకి తీసుకురాలేపోయారని ప్రజలు వాపోతున్నారు. ఈక్రమంలో తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలు గ్రామాల్లో ట్యాంకులు విధిగా శుభ్రపరచడంలో సిబ్బంది కొంత నిర్లక్ష్యం వహిస్తున్నట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు. మరికొన్ని చోట్ల రోడ్లకు ఒకవైపు మాత్రమే తాగునీటి పైపులు వేయడంతో పక్క బజారులకు ట్యాపులు అమర్చక పోవవడంతో తిప్పలు పడుతున్నారు. ఈక్రమంలో ట్యాంకులను విధిగా శుభ్రపరచి, పైపులైన్‌లతో ట్యాపులు అమర్చాలని కోరుతున్నారు. అలాగే స్వచ్ఛమైన తాగునీరు అందించి సమస్యను పరిష్కరించాలని వేడుకుంటున్నారు.


విఘ్నేశ్వర కాలనీలో వినియోగంలో లేని వాటర్ ట్యాంక్


లక్ష్మీపురంలో ప్రారంభం కాని వాటర్ ట్యాంక్


రామన్నపేటలో వినియోగంలో లేని వాటర్ ట్యాంక్

మంత్రి ఆదేశాలతో విద్యుత్ లైన్ విస్తరణ

పంగులూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జాగర్లమూడివారి పాలెం గ్రామ ఎస్టీ కాలనీ వరకు విద్యుత్ లైన్ విస్తరణ పనులకు అధికార యంత్రాంగం చర్యలు చేపట్టింది. విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశాల మేరకు విద్యుత్ లైన్ విస్తరణ పనుల కోసం రూ.2.70లక్షల అంచా వ్యయంతో పనులు చేపట్టేందుకు అద్దంకి ఈఈ మస్తానరావు అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో గ్రామంలోని రక్షిత మంచినీటి ట్యాంక్ సమీపంలో నివశించే 12 ఎస్టీ కుటుంబాలు బొమ్మనంపాడు వైపు వెళ్లే రహదారి పక్కన కొన్నేళ్ల కిందట ప్రభుత్వం తమకు కేటాయించిన నివేశన స్థలాల్లో ఇళ్లు నిర్మించుకుని మూడేళ్లుగా జీవనం సాగిస్తున్నారు. తాము నివా సం ఉండే ప్రదేశంలో విద్యుత్ సౌకర్యం లేక పోవడంతో దూరంగా ఉన్న విద్యుత్ లైన్ నుంచి వెదురు బొంగులు బాతుకుని సర్వీసు వైరు ఏర్పాటు చేసుకుని విద్యుత్ వినియోగించుకుంటున్నారు. గత నెల 18న గ్రామంలో ఆర్వో వాటర్ ప్లాంట్ ప్రారంభించేందుకు గ్రామానికి వచ్చిన మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను కలిసి ఎస్టీ కాలనీ వాసులు తాము నివశిస్తున్న ప్రాంతానికి విద్యుత్ లైన్ లేక తాము పడుతున్న ఇబ్బందులు ఏకరువు పెట్టారు. కాలనీ వాసుల విద్యుత్ సమస్యను గుర్తించిన మంత్రి గొట్టిపాటి విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు సత్వర చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సంబంధిత అధికారులు విద్యుత్ లైన్ విస్తరణకు శ్రీకారం చుట్టారు.


నివాసాల విద్యుత్ కోసం ఎదురు బొంగులతో ఏర్పాటు చేసుకున్న సర్వీస్ వైరు


జేపీపాలెం ఎస్టీ కాలనీ వరకు విద్యుత్ లైన్ విస్తరణ కోసం నిధులు కేటాయిస్తూ ఉత్తర్వులు అందిస్తున్న ఈఈ మస్తానరావు

రోడ్ల మరమ్మతులతో తీరిన ప్రయాణ కష్టాలు



వైసీపీ పాలనలో రోడ్డు దుస్థితి



టీడీపీ కూటమి ప్రభుత్వ చొరవతో రూపుదిద్దుకున్న రోడ్డు

అడుసుమల్లి(పర్చూరు), ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ పాలనలో రోడ్లు అధ్వానంగా మారాయి. రోజూ వాహనదారులు నరకప్రయాణం చేయాల్సిన దుస్థితి నెలకొంది. ప్రధాన రోడ్డు సైతం పాడై మరమ్మతులకు నోచుకోక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. తెలుగుదేశం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే తొలుత దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేసేందుకు ప్రాధాన్యం ఇచ్చింది. దీంతో వాహనదారు ప్రయాణ కష్టాలు తీరాయి. ఇచ్చిన హామీ మేరకు రోడ్ల మరమ్మతు పనులు చకచకా జరుగుతున్నాయి. దీంతో నిన్నటి వరకూ పర్చూరు - గుంటూరు ఆర్‌అండ్‌బీ రోడ్డులోని అడుసుమల్లి సమీపంలోని కల్వర్టుపై రోడ్డు పూర్తిస్థాయిలో దెబ్బతిని రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చేది. రోడ్డును అభివృద్ధి చేయడంతో ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుపై వాహనదారులు హుషారుగా రాకపోకలు సాగిస్తున్నారు.

సేద్యానికి.. డ్రోన్లు

(5వ పేజీ తరువాయి)

ఉపయోగకరమని ప్రభుత్వం భావిస్తోంది. రోజుకు దాదాపు పదిహేను ఎకరాల్లో డ్రోన్ల సాయంతో సస్యరక్షణ చేపట్టే అవకాశం ఉంది. డ్రోన్ల సేవలను గరిష్ఠంగా ఉపయోగించుకుంటే సమయం ఆదాతో పాటు కూలి ఖర్చులు రైతులకు మిగులుతాయి.

ఇది తొలి అడుగుగానే...

సేద్యమే ప్రధాన రంగంగా ఆధారపడిన ఉమ్మడి గుంటూరు జిల్లాలో తొలుత మండలానికి ఓ యూనిట్‌గా డ్రోన్ల వినియోగం అనేది తొలి అడుగుగానే వ్యవసాయశాఖ చెబుతోంది. బాపట్ల జిల్లాలో ఇప్పటికే 35 యూనిట్లకు సంబంధించి గ్రూపుల ఎంపిక పూర్తయింది. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా మండలానికి ఓ గ్రామాన్ని యూనిట్‌గా ఎంపిక చేసి గ్రూపుల ఎంపికను కూడా ఓ కొలిక్కి తెచ్చారు. గ్రూపు సభ్యుల చేత బ్యాంకు ఖాతాలు తెరిచే ప్రక్రియ కూడా పూర్తి చేశారు.

దశలవారీగా సాంకేతికత..

దశల వారీగా వ్యవసాయంలో టెక్నాలజీని ప్రవేశపెట్టి సాగుకు సాంకేతిక హంగులు అద్దే కార్యక్రమం నిరంతరంగా కొనసాగుతుందని ప్రభుత్వం చెబుతోంది. ముఖ్యంగా ప్రకృతి విపత్తులకు సంబంధించి కచ్చితమైన సమాచారాన్ని నేరుగా రైతు చెంతకే చేరేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు వ్యవసాయశాఖ చెబుతోంది. పిడుగుపాటుకు గురై మరణించే వారిలో అత్యధికులు రైతులే. ముందస్తు సమాచారంతో అప్రమత్తం ఒక్క సాంకేతికతతోనే సాధ్యమవుతుందని ఆ దిశగానే రాబోయే రోజుల్లో చర్యలు ఉండనున్నాయని ప్రభుత్వం అంటోంది.

రైతులకు సాయం.. ఉపాధి

డ్రోన్లను ఆపరేట్ చేసే వ్యక్తికి ఇంటర్మీడియట్ కనీస విద్యార్హత ఉండాలని ప్రభుత్వం మార్గదర్శకాల్లో పేర్కొంది. పైలెట్‌కు సపోర్టింగ్ స్టాఫ్ కూడా కావాల్సి ఉంటుంది. వీరికి నెలవారీ ఇచ్చే జీతాన్ని డ్రోన్లకు వచ్చే నామమాత్రపు అద్దెతో పాటు ప్రభుత్వం కూడా కొంత భరించనుంది. దశల వారీగా డ్రోన్లను పెద్దఎత్తున ప్రవేశపెట్టాలనే తలంపుతో ప్రభుత్వం ఉండడంతో ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా దాదాపు ఐదు వేల మందికి వీటి నిర్వహణ నిమిత్తం ఉపాధి దొరకనుంది. సాంకేతికత విధానం రైతులకు పూర్తి స్థాయిలో అవగతమయ్యే వరకు వీరి అవసరం ప్రతి దశలో ఉండనుంది. దీంతో అటు రైతులకు సేద్యం లాభసాటిగా మారడంతో పాటు ఇటు గ్రామాల్లో నిరుద్యోగ సమస్యకు కొంతమేర పరిష్కారం చూపేలా ప్రభుత్వం అడుగులేస్తోంది. గ్రూపులో సభ్యులుగా ఉండే రైతులు కాకుండా మరో ఐదుగురితో కమిటీ ఏర్పాటు చేస్తారు. వీరిలో ఒకరు డ్రోన్ పైలెట్‌గా ఉండగా అతనే కన్వీనర్‌గా కూడా ఉండనున్నారు. ఇంకొకరు కో కన్వీనర్‌గా, మరో ఇద్దరు సభ్యులుగా కమిటీలో వ్యవహరించనున్నారు. పైలెట్‌గా విధులు నిర్వహించే వ్యక్తికి ఇంటర్మీడియట్ చదువును తప్పనిసరి చేస్తూ ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. ప్రస్తుతం ఈ పైలెట్‌లకు శిక్షణ ఇచ్చే కార్యక్రమంపై వ్యవసాయశాఖ దృష్టి సారించింది.

ఆ కారులో ఏముంది?

తనిఖీ అనంతరం పోలీస్ స్టేషన్‌కు డ్రైవర్, ముగ్గురు మహిళల తరలింపు

ఈపూరుపాలెం(చీరాలటౌన్), ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : ఈపురుపాలెం స్టేషన్ పరిధిలో బుధవారం రాత్రి ఓ కారును ఎస్ఐ చంద్రశేఖర్ ఆపి తనిఖీలు నిర్వహించారు. చీరాల నుంచి బాపట్లవైపు వెళ్తున్న కారును ఆపి డిక్కీని పరిశీలించిన అనంతరం కారుతో సహా డ్రైవర్, ముగ్గురు మహిళలను స్టేషన్‌కు తరలించారు. కారులో గంజాయిని తరలిస్తున్నట్లు వచ్చిన సమాచారం కారణంగానే తనిఖీ చేసినట్లు ప్రజలు భావిస్తున్నారు.

లేబర్ కోడ్‌లతో కార్మికులకు నష్టం

చీరాలటౌన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : లేబర్ కోడ్‌లు వినియోగం వలన కార్మికులకు నష్టం కలుగుతుందని పలువురు సీఐటీయూ నాయకులు అన్నారు. బుధవారం పట్టణంలో నిసన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలను రద్దు చేసి వాటి స్థానంలో కోడ్ విధానాన్ని వెలుగులోకి తెచ్చినట్లు చెప్పారు. దేశవ్యాప్త పిలుపులో భాగంగా ర్యాలీ చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో నాయకులు వసంతరావు, సుధీర్, సత్యమూర్తి, సుధాకర్, శివరాజు, సుజీవన, సులోచన, వెంకటేవ్వరమ్మ, అరున. సంధ్య, విజయలక్ష్మి పాల్గొన్నారు.

నీటి సంరక్షణతోనే సమగ్రాభివృద్ధి

రాష్ట్ర వాటర్‌షెడ్ డైరెక్టర్ షణ్ముఖ్ కుమార్


వాటర్‌షెడ్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా, వేదికపై ఎమ్మెల్యే ఉగ్ర

పీసీపల్లి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): నీటి సంరక్షణతోనే సమగ్ర అభివృద్ధి సాధ్యమని రాష్ట్ర వాటర్‌షెడ్ డైరెక్టర్ షణ్ముఖ్ కుమార్ పేర్కొన్నారు. వాటర్‌షెడ్ పథకం కింద డ్వామా ఆధ్వర్యంలో అమలుచేస్తున్న పథకాలపై అవగాహన కల్పించేందుకు పీసీపల్లి మండలంలోని జంగాలపల్లి గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. తొలుత ఈ పథకం వినియోగంపై ఢిల్లీ నుంచి కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్, సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ప్రసంగాలను ప్రత్యక్ష ప్రసారాల ద్వారా ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన స్క్రీన్‌ల ద్వారా ప్రజలతో కలిసి వీక్షించారు. అనంతరం డైరెక్టర్ మాట్లాడుతూ ప్రతి నీటిబిందువును పొదుపు చేయాల్సిన అవసరం ఉందన్నారు. నీటిసంరక్షణ అనేది ప్రతిఒక్కరి జీవనశైలిలో భాగం కావాలని ఆయన పిలుపునిచ్చారు. కలెక్టర్ అన్సారియా మాట్లాడుతూ నీటిని పొదుపుగా వినియోగించుకోవడం, నీటి వనరులను కాపాడుకోవడం మనందరి బాధ్యత అని చెప్పారు. పంటల సాగుకు, పేదరిక నిర్మూలనకు, తలసరి ఆదాయం పెంపునకు నీటిసంరక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. కనిగిరి శాసనసభ్యుడు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి మాట్లాడుతూ క్షామ పీడిత ప్రాంతమైన పశ్చిమప్రాంతానికి వాటర్‌షెడ్ పథకం ఒకవరం లాంటిదని అన్నారు.నీటి వనరులను జాగ్రత్తగా కాపాడుకుంటే కనిగిరి నియోజకవర్గం నుంచి వలసలను నివారించవచ్చునని ఆయన అన్నారు. స్పెషల్ విజిలెన్స్ ఆఫీసర్ భవానిహర్ష మాట్లాడుతూ భూగర్భ నీటిమట్టం పెంపుపై ప్రతిఒక్కరూ దృష్టిపెట్టాలన్నారు. అనంతరం నీటిని పొదుపుగా వినియోగించుకుంటామని, నీటివనరులను కాపాడుకుంటామని స్థానికులు, అధికారులతో కలిసి కలెక్టర్ ప్రతిజ్ఞ చేశారు. ముందుగా గ్రామసమీపంలోని పొలాల్లో వాటర్‌షెడ్ ఆధ్వర్యంలో నూతనంగా చేపట్టనున్న ఫాంపాండ్ పనులను కలెక్టర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సాగర్‌కుమార్, డ్వామా పీడీ జోసఫ్‌కుమార్, ఏపీడీ వండర్‌మ్యాన్, ఏపీడీ చంద్రశేఖర్‌రెడ్డి, మర్రిపూడి డబ్ల్యూసీసీ ప్రాజెక్టు ఆఫీసర్ రాజేష్‌కుమార్, ఎంపీడీవో ప్రభాకరశర్మ, తహసీల్దార్ సీహెచ్.ఉష, నాయకులు కసిరెడ్డి ఓబుల్‌రెడ్డి, కసిరెడ్డి హనుమారెడ్డి, గడ్డం బాలసుబ్బయ్య, వేమూరి రామయ్య, చాగంరెడ్డి మాలకొండారెడ్డి పాల్గొన్నారు.

కేరళ లాటరీ పేరుతో దోపిడీ

» సామాన్యులు విలవిల » నగరంలో విచ్చలవిడిగా ఏజెంట్లు
» కార్మికులు, ఆటోడ్రైవర్లు, రోజువారీ కూలీలు లక్ష్యం

ఒంగోలుక్రైం, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): నగరంలో సామాన్యుల నుంచి నగటు కార్మికుల వరకు అంతా కేరళ లాటరీ ఉచ్చులో చిక్కుకుని విలవిలలాడిపోతున్నారు. రోజు వారి సంపాదించిన డబ్బులు సరిపోక అప్పులు చేస్తున్నారు. తమ కుటుంబాలను బజారున పడేస్తున్నారు. ఎలాంటి గుర్తింపు లేని లాటరీ పేరుతో నంబర్లు వేసిన చీటీలు విక్రయించి గంటగంటకు ఫలితాలు అంటూ ఏజెంట్లు దోచుకుంటున్నారు. ఆ మాయకు పడిపోయిన వారు కష్టపడి సంపాదించిన సొమ్మును టిక్కెట్లు కొనుగోలుకు ఉపయోగించి నష్టపోతున్నారు. ఏజెంట్లు మాత్రం సాయంత్రానికి జేబులు నింపుకొంటున్నారు. ఈ వ్యవహారం ఒంగోలు నగరంలో కొత్తేమి కాకపోయినా ఈ మధ్యకాలంలో అధికమైంది. ఒకరిద్దరు యజమానులు ఈ లాటరీ దందా నడిపిస్తున్నారు. రోజుకు లక్షలు చేతులు మారుతున్నాయి. అనధికారికంగా ఇలాంటి తంతు జరుగుతుంటే పట్టించుకునే నాథుడు లేరు. నాలుగు నంబర్లు ఉన్న చీటి విలువ రూ.60గా కొనుగోలు చేస్తారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి 6 గంటల వరకు వేరే వేరే పేర్లతో ఈ లాటరీ ఫలితాలు వస్తూ ఉంటాయి. కేవలం ఏజెంట్లు చెప్పిన నంబర్లకు మాత్రమే ప్రైజ్ తగులుతుంది. అసలు ఆ నంబర్లు ఎలా కేటాయిస్తారు, ఎక్కడ నుంచి ఫలితాలు వస్తాయి అంటే కేరళ నుంచి అని ఏజెంట్లు నమ్మబలుకుతున్నారు.

ఉదయం నుంచి 12 గంటల వరకు విక్రయం

ఎక్కువగా కూలీలు పనిచేసే ప్రాంతాలలో ఈ లాటరీ చీటీలు విక్రయాలు చేపడతారు. కేశవస్వామిపేట మీసేవ సెంటర్, జయరామ్ సెంటర్ కొండ మీద, అద్దంకి బస్టాండ్ సెంటర్ , నవభారత్ థియేటర్ సెంటర్, ట్రంక్ రోడ్డులోని కేరళ బేకరీ సమీపంలో, సంతపేట సాయిబాబా గుడి వెనుక, కొత్త మార్కెట్, మస్తాన్‌దర్గా సెంటర్లతో పాటుగా నగర శివార్లలో కూడా ఏజెంట్లు బైక్‌లపై వెళ్లి మహిళలతో కూడా లాటరీ చీటీలు కొనుగోలు చేయిస్తున్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి ఎర్రయ్య

ఇంటర్ ప్రయోగ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించండి

చీరాలటౌన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్ ప్రయోగ పరీక్షలు సక్రమంగా నిర్వహించాలని జిల్లా ఇంటర్ మీడియట్ విద్యాశాఖ అధికారి పీ.ఎర్రయ్య అన్నారు. బుధవారం స్థానిక జూనియర్ కళాశాలలో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రయోగ పరీక్షలైన జనరల్ సబ్జెక్టులకు ఈనెల 10 నుంచి 19వ తేదీ వరకు 49 కేంద్రాల్లో జరుగుతాయని వివరించారు. పరీక్షల ప్రత్యేక అధికారి ఎల్. కోదండరామ్ మాట్లాడుతూ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు అసౌకర్యం కలుగకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ స్నేహలత, సైన్స్ అధ్యాపకులు వివిధ అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

8న లోక్ అదాలత్

అద్దంకి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : జాతీయ లోక్ అదాలత్ ఈ నెల 8వ తేదీన స్థానిక కోర్టు భవనాల సముదాయంలో జరుగుతుందని సీనియర్ సివిల్ న్యాయాధికారి, మండల న్యాయసేవధికారి సంస్థ చైర్మన్ నాగవెంకటలక్ష్మి తెలిపారు. రాజీ చేయదగిన అన్ని క్రిమినల్ కేసులు, సివిల్ కేసులు, చెక్‌బౌన్స్ కేసులు, కుటుంబ, ప్రీ లిటిగేషన్ కేసులు పరిష్కరించుకోవచ్చన్నారు. కక్షిదారులు ఈ అ వకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

హెల్మెట్‌లు విధిగా ధరించాలి


వాహనచోదకులతో మాట్లాడుతున్న సీఐ సుబ్బరాజు

అద్దంకి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్ర వాహనచోదకులు విధిగా హెల్మెట్ ధరించి ప్రయాణం చేయాలని సీఐ సుబ్బరాజు అన్నారు. పట్టణంలోని భవానీ సెంటర్‌లో బుధవారం సీఐ సుబ్బరాజు వాహనాలు తనిఖీ చేశారు. హెల్మెట్ ధరించని ద్విచక్ర వాహనచోదకులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. హెల్మెట్ ధరించడం ద్వారా ప్రమాదాలు జరిగిన సమయంలో ప్రాణాపాయం నుంచి బయట పడవచ్చన్నారు. ట్రాఫిక్ నిబంధనలు ఖచ్చితంగా పాటించాలన్నారు. ఎస్సై రవితేజ తదితరులు ఉన్నారు.

ఈపూరుపాలెం : హెల్మెట్‌లు ధరించి వాహనాలు నడపడం వలన రోడ్డు ప్రమాదాలను నియంత్రించవచ్చని ఈపూరుపాలెం ఎస్సై చంద్రశేఖర్ అన్నారు. బుధవారం స్టేషన్ పరిధిలో రోడ్డు ప్రమాదాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ వాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడుపరాదని వివరించారు. ప్రతి ఒక్కరూ వారి కుటుంబానికి ఎంతో అవసరమని జాగ్రత్తలు పాటించాలని చెప్పారు. కార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది వాహనదారులు పాల్గొన్నారు.

విద్యుత్ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

వేటపాలెం(చీరాలటౌన్), ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ కార్మికుల సమస్యల పరిష్కారంలో తెలుగునాడు విద్యుత్ కార్మిక సంఘం ముందుంటుందని పలువురు వక్తలు అన్నారు. బుధవారం వేటపాలెం మండల పరిధిలోని చల్లారెడ్డిపాలెం సబ్‌స్టేషన్‌లో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఏపీఈఈ యూనియన్-1104 నుంచి సుమారు 10 మంది ఎల్.కొండయ్య ఆధ్వర్యంలో తెలుగునాడు విద్యుత్ కార్మిక సంఘంలో సభ్యత్వం పొందారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి డివిజన్ కార్యనిర్వాహక అధ్యక్షుడు రాజాభూషణం అధ్యక్షత వహించగా, నాయకులు మాట్లాడుతూ సంఘం బలోపేతంతో పాటు సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాయకులు ఎన్ఎస్ఆర్‌కే ప్రసాద్, డిస్కం అధ్యక్షుడు శ్రీరామూర్తి, జిల్లా అడ్‌హక్ కమిటీ చైర్మన్ శౌరి రాజు, కళాధరరావు, వెంకటేశ్వరరెడ్డి, కృష్ణంరాజు పాల్గొన్నారు.

11 మందికి వృత్తి నైపుణ్య పురస్కారాలు


పురస్కార గ్రహీతలతో రోటరీ క్లబ్ సభ్యులు

అద్దంకిటౌన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో బుధవారం సింగరకొండలోని శ్రీరామ వృద్ధుల ఆశ్రమంలో జరిగిన కార్యక్రమంలో 11 మందికి వృత్తి నైపుణ్య పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమం జరిగింది. సమాజంలో అన్ని వృత్తులవారు సమానమన్నారు. వీరపల్లి వెంకటేశ్వర్లు (నాయీబ్రాహ్మణ), బత్తుల ఆంజనేయులు (ఆర్టిస్ట్), వెంకటేశ్వరరావు (టైలర్), సుందరరావు (చర్మకార), కోలకలూరి నాగేశ్వరరావు (స్వర్ణకార), పొలంరాజు మారుతి (ఎలక్ట్రీషియన్), కోటేశ్వరావు (చిరువ్యాపారి), శివన్నారాయణ (రైతు), చెన్నుపల్లి అంజిబాబు (రజిక), బడే సాహెబ్ (మేకప్ ఆర్టిస్ట్), అంబలగిరి వెంకటరావు (కుమ్మరి) వీరిని రోటరీ సభ్యుడు అన్నంగి సుబ్బారావు మనుమడు అభిరామ్ పుట్టిన రోజు సందర్భంగా నూతన వస్త్రాలు, శాలువా, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శు వీరయ్య, సుధాకరావు, ట్రెజరర్ మలాది శ్రీనివాసరావు, వీ రవల్లి సుబ్బారావు(రుద్రయ్య) పాల్గొన్నారు.

అత్తపై కోడలి తమ్ముడు దాడి

కేసు నమోదు

ఈపూరుపాలెం(చీరాలటౌన్), ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : అక్కను వేధిస్తున్నారని అక్క అత్తను అర్ధరాత్రి సమయంలో దాడిచేసి గాయపరచిన ఘటన గత మంగళవారం అర్ధరాత్రి మండల పరిధిలోని ఈపూరుపాలెంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాపట్ల మండలం వెదుళ్లపల్లికి చెందిన చాందిని ఈపూరుపాలెంకు చెందిన కరిముల్లా సుమారు 15 ఏళ్ల కిందట ప్రేమించి పెళ్లిచేసుకున్నారు. అయితే వీరికి కొంతకాలంగా వివాదాలు జరుగుతుండడంతో అక్క అత్త షేక్ నూరాపై కోడలి తమ్ముడు సతీష్, మరి కొందరి సహాయంతో ఇంట్లోకి చొరబడి ముఖానికి మాస్కులు వేసుకుని దాడిచేసి గాయపరిచి పరారయ్యారు. ఈక్రమంలో బాధితురాలు చీరాల ఏరియా వైద్యశాలలో చికిత్స పొందగా ఈపూరుపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు.

ఉపాధి పనులకు ప్రభుత్వం ఊతం

- కూలీలను శ్రమశక్తి సంఘాలుగా విభజన
- ఒక్కో సంఘానికి ఒక మేట్
- కట్టుదిట్టంగా సాగేందుకు చర్యలు
- చీరాల క్లస్టర్ పరిధిలో సుమారు రెండు వేల సంఘాలు ఏర్పాటు

బల్లికురవ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పథకం పనులు కట్టుదిట్టంగా జరిగేలా కూటమి ప్రభుత్వం శ్రమ శక్తి సంఘాల ఏర్పాటుకు శరగ వేగంగా కసరత్తు చేస్తుంది. కూలీలను సంఘాలుగా ఏర్పాటు చేసి వారికి మేట్‌ను ఏర్పాటు చేసి పనులలో పారదర్శకత తీసుకు వచ్చేలా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇప్పటికే అధికారులు గ్రామాలలో కూలీల వివరాలను సేకరించి 25 నుండి 40 మందికి ఒక సంఘంగా తయారు చేసి పనులు చేయించేందుకు సర్వం సిద్ధం చేస్తున్నారు.

మహాత్మ గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో కూలీలకు కొత్త తరహాలో పనులు చేయించేందుకు ప్రభుత్వం గత వారంరోజుల నుంచి శ్రమశక్తి సంఘాలను ఏర్పాటు చేయిస్తుంది. ఒక్కో గ్రామంలో జాబ్ కార్డు ఉండి అందులో సభ్యులుగా ఉన్న కూలీలను 25 మంది నుంచి 40 మంది వరకు ఒక సంఘంగా ఏర్పాటు చేసి అందుకు పర్యవేక్షణ బాధ్యతకు ఒక మేట్‌ను నియమిస్తుంది. మేట్‌కు చదువు ఉండి సెల్‌ఫోను పరిజ్ఞానం ఉండాలని, అలానే కూలీల మస్టర్‌ను వేసేలా మేట్‌లకు శిక్షణ కూడా ఇవ్వనున్నారు. ప్రతి గ్రామంలో కూలీలను శ్రమశక్తి సంఘాలుగా ఏర్పాటు చేసేందుకు ఉపాధి పథకం సిబ్బంది పనులును వేగవంతం చేస్తున్నారు. రెండు మూడు రోజుల్లో ఈ సంఘాలను పూర్తిస్థాయిలో తయారు చేసి పనులు చేయించేలా కసరత్తు చేస్తున్నారు.

చీరాల క్లస్టర్ పరిధిలోని అద్దంకి, బల్లికురవ, చినగంజాం, చీరాల, ఇంకొల్లు, పంగులూరు, కారంచేడు, కొరిశపాడు, మార్టూరు, పర్చూరు,


ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

సంతమాగులూరు, వేటపాలెం, యద్దనపూడి మండలాల పరిధిలో ఉన్న 221 గ్రామ పంచాయతీలలో రూ.1.57 వేల మంది కూలీలు ఉపాధి పథకంలో జాబు కార్డులు కలిగి ఉన్నారు. వీరిని 25 నుంచి 40 మందిని ఒక్క శ్రమ శక్తి సంఘంగా ఏర్పాటు చేస్తున్నారు. ఒక్కో సంఘానికి ఒక మేట్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఇక నుంచి మేట్‌ల పర్యవేక్షణలోనే కూలీలు పనులు చేసేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇలా సంఘాలుగా ఏర్పాటు అవడం వలన కూలీలకు కూడా పనులు సులువుగా చేసే వీలు ఉంటుందని అలానే గిట్టుబాటు కూలి కూడా వస్తుందని అధికారులు అంటున్నారు. కొత్త తరహాలో శ్రమశక్తి సంఘాల ఏర్పాటు వలన రానున్న రోజుల్లో పనులు కూడా శరవేగంగా జరుగుతాయని వారు అంటున్నారు. గ్రామాలలో పనిచేసే క్షేత్ర సహాయకులు పనులను పర్యవేక్షిస్తూ కూలీలకు సరిపడా పనులను గుర్తించేలా వారికి తగు ఆదేశాలను ప్రభుత్వం ఇస్తుంది. ఇప్పటికి 13 మండలాల పరిధిలో 424 శ్రమశక్తి సంఘాలు ఏర్పాటు చేశారు. రానున్న రెండు రోజుల్లో గ్రామాలలో ఈ సంఘాల ఏర్పాటు పూర్తిస్థాయిలో చేసేందుకు గ్రామ స్థాయి అధికారులు పనిచేస్తున్నారు.

మేట్‌కు ప్రత్యేక అలవెన్స్

శ్రమశక్తి సంఘాలకు బాధ్యత వహించే మేట్‌లకు ప్రభుత్వం ప్రత్యేక ఆలవెన్స్‌లను ఇచ్చేలా కసరత్తు చేస్తుంది. ఇప్పటికే అన్ని సంఘాలలో కొంత చదువు ఉండి సెల్‌ఫోను పరిజ్ఞానం ఉండే వారిని గుర్తిస్తున్నారు. వీరికి పూర్తి స్థాయిలో ఇచ్చే అలవెన్స్‌ల విషయం ఇంకా అధికారులు ప్రకటించడం లేదు. నూతన విధానంలో పనులు చేయించేలా ప్రక్రియ కోసం సంఘాలుగా ఏర్పాటు చేస్తున్నామని చెప్తున్నారు.

గతంలో జరిగిన అక్రమాల కట్టడికే శ్రమశక్తి సంఘాలు

గత వైసీపీ పాలనలో పలు గ్రామాలలో బోగస్ మస్టర్లు వేయడం వంటి అక్రమాలు జరిగి ఉపాధి పనులపై ప్రజలకు నమ్మకం పోయింది. దీంతో ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఉపాధి పనులను కట్టుదిట్టంగా చేసేందుకు 40 మందికి ఒక సంఘంగా ఏర్పాటు చేసి వారికి ఒక మేట్‌ను ఏర్పాటు చేస్తుంది. గతంలో పనులు చేయకుండానే కూలి నగదు జమ చేశారు. ఇక నుంచి శ్రమశక్తి సంఘానికి పని కేటాయిస్తే అంత పని చేస్తేనే కూలి నగదు సక్రమంగా చెల్లిస్తారు. అక్రమాలను అరికట్టేలా కూటమి ప్రభుత్వం చేపడుతున్న చర్యల గురించి అధికారులు సైతం ప్రశంసలు కురిపిస్తున్నారు.

శ్రమశక్తి సంఘాలను ఏర్పాటు చేయిస్తున్నాం

అన్ని గ్రామాలలో ఉపాధి హామీ పథకంలో పనులు చేసే కూలీలకు శ్రమశక్తి సంఘాలుగా ఏర్పాటు చేయిస్తున్నాం. ఈ ప్రక్రియ రెండు రోజుల్లో ముగుస్తుంది. గ్రామాలలో ఇక నుంచి మేట్‌లు ఉన్న శ్రమశక్తి సంఘాల ద్వారానే పనులు జరుగుతాయి. తాము నిత్యం పనులను పర్యవేక్షించి ఎక్కువ మంది కూలీలు పనులకు వచ్చేలా చర్యలు చేపడతాం. రోజు వారి కూలీలు వలసలు పోకుండా చర్యలు చేపడతాం. - ఏపీడీ కోటయ్యనాయక్


చెన్నుపల్లిలో సీసీ రోడ్డును తనిఖీ చేయిస్తున్న క్వాలిటీ కంట్రోల్ అధికారులు

సీసీ రోడ్ల తనిఖీ

బల్లికురవ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పథకంలో ఇటీవల నిర్మాణం పూర్తయిన సిమెంట్ రోడ్లను బుధవారం ఒంగోలు క్వాలిటీ కంట్రోల్ డీఈఈ ఎంవీ శ్యాంప్రసాద్ బృందం తనిఖీలు చేశారు. మండలంలోని చెన్నుపల్లి, నక్కబొక్కలపాడు, వైదన, కొమ్మినేనివారిపాలెం, కొండాయపాలెం గ్రామాలలో నిర్మాణం పూర్తయిన పది సీసీ రోడ్లను క్వాలిటీ కంట్రోల్ అధికారులు తనిఖీలు చేశారు. ఈసందర్భంగా రోడ్డుకు యంత్రాల ద్వారా ఎంత క్వాలిటీ ఉందో పూర్తి వివరాలను సేకరించారు. క్వాలిటీ ఉన్న రోడ్లకు పూర్తిస్థాయిలో బిల్లులు చెల్లింపులు చేస్తారని వారు ఈసందర్భంగా తెలిపారు. ఈ తనిఖీలో ఏఈఈలు శ్రీనివాస్, మాధవ్ పాల్గొన్నారు.

జొన్నతాళి సర్పంచ్ భర్త మృతి

మార్టూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జొన్నతాళి గ్రామ సర్పంచ్, టీడీపీ మద్దతుదారు శానంపూడి నాగేంద్రమ్మ భర్త వెంకటేశ్వరరావు (65) (ఎస్వీఆర్) అనారోగ్యంతో బుధవారం హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్సపొందుతూ మృతిచెందారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కొన్నిరోజులుగా అనారోగ్యకారణంగా చికిత్సపొందుతున్నారు. ఆయన మృతదేహాన్ని బుధవారం అర్ధరాత్రికి స్వగ్రాం జొన్నతాళి తీసుకువస్తారనిగురువారం ఉదయం అంత్యక్రియలు నిర్వహిస్తారని కుటుంబసభ్యులు తెలిపారు.


వెంకటేశ్వరరావు

ఎస్వీఆర్ మృతిపై ఎమ్మెల్యే ఏలూరి సంతాపం

అనారోగ్య కారణంగా శానంపూడి వెంకటేశ్వరరావు మృతిచెందడంపై తెలుగుదేశం పార్టీ బాపట్ల పార్లమెంట్ మాజీ అధ్యక్షులు,ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సంతాపం తెలిపారు. ఆయన మృతిపట్ల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. టీడీపీకి ఆయన కుటుంబానికి తీరని లోటు అన్నారు. మంచి వ్యక్తిని కోల్పోయామన్నారు. జొన్నతాళి గ్రామాభివృద్ధికి కీలకభూమిక పోషించారని, సమాజానికి నిత్యం మంచిచేయాలనే తపన గలిగిన ఎస్వీఆర్ మృతి చెందడం బాధాకరమన్నారు.


మాట్లాడుతున్న ఇన్‌చార్జి చైర్మన్ జైసన్‌బాబు

ఎన్టీఆర్ అందరివాడు

ఇన్‌చార్జి చైర్మన్, వైసీపీ కౌన్సిలర్‌లు

చీరాలటౌన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ అందరి వాడని, ఏ ఒక్క కులం, పార్టీలకు చెందిన నాయకుడు కారని మునిసిపల్ ఇన్‌చార్జి చైర్మన్ బొనిగల జైసన్‌బాబు, వైసీపీ కౌన్సిలర్‌లు బత్తుల అనిల్, గుంటూరు ప్రభాకరరావు, చీమకుర్తి బాలకృష్ణ, గోలి జగదీష్, కంపా అరుణ్ అన్నారు. రెండ్రోజులుగా చీరాలలలో నెలకొన్న ఎన్టీఆర్ విగ్రహ ఏర్పాటుపై వివాదం పాఠకులకు విదితమే. ఈక్రమంలో బుధవారం చైర్మన్ చాంబర్‌లో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ దివంగత నేతలు, మాజీ ముఖ్యమంత్రులు ఎన్టీఆర్, వైఎస్సార్ ఉమ్మడి రాష్ట్రాలకు చేసిన సేవలను వివరించారు. మాజీమంత్రి డా.పాలేటి ఎన్టీఆర్ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజకు ప్రోటోకాల్‌లో భాగంగా ఆహ్వానించినట్లు చెప్పారు. తాము హాజరుకావడంలో ఎలాంటి దురుద్దేశం లేదన్నారు. అవగాహన లేని కొందరు ఎన్టీఆర్‌ని కొందరికే పరిమితం చేస్తూ రాద్ధాంతం చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు ప్రసాద్‌రెడ్డి, మామిడాల సుబ్బారావు పాల్గొన్నారు.

విజయవంతంగా ముగిసిన ఆర్డినో వర్క్‌షాప్


వర్క్‌షాప్‌లో పాల్గొన్న విద్యార్థులు

చీరాలటౌన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : చీరాల సెయింట్ ఆన్స్ కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో ఈఈఈ విభాగం రెండవ సంవత్సరం విద్యార్థులకు మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఆర్డినో వర్క్‌షాప్ బుధవారం ముగిసినట్లు కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు పేర్కొన్నారు. ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో వర్క్‌షాపు జరిగినట్లు ప్రిన్సిపాల్ డా. కె.జగదీష్ తెలిపారు. ఆర్డినో అప్లికేషన్‌ను సాఫ్ట్‌వేర్‌లో ఏవిధంగా ఉపయోగిస్తారో వివరించారు. కార్యక్రమంలో అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న డా.బాబూరావు, పక్కన ప్రిన్సిపాల్ మురళి

చీరాలటౌన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : క్యాన్సర్ వ్యాధిపై అప్రమత్తంగా ఉండడంతోపాటు దాని కారకాలకు ప్రజలు దూరంగా ఉండాలని గుండె వైద్య నిపుణుడు డా.ఐ.బాబూరావు పేర్కొన్నారు. బుధవారం స్థానిక వైఏ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్లాస్టిక్, పొగతాగడం, మద్యం సేవించడం, ఖైనీ, తంబాకు వంటి దురలవాట్లుకు దూరంగా ఉండాలన్నారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా.మురళి, ఇన్నర్‌వీల్ క్లబ్ సభ్యులు సుభాషిణి, రూప, నళిని, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు ప్రారంభించండి

ఎంపీడీవో స్వరూపారాణి

పంగులూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలలో శ్రమశక్తి సంఘాలను ఏర్పాటు చేసి వెంటనే ఉపాధి హామీ పనులను ప్రారంభించాలని ఎంపీడీవో కె.స్వరూపారాణి అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి పనులపై బుధవారం సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. శ్రమశక్తి సంఘాలను ఏర్పాటు చేసి ఒక్కో గ్రూపునకు 20 నుంచి 50 మంది కూలీలను రిజిస్టర్ చేయాలన్నారు. రైతువారి కుంటలు, కాలువ పనులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఉదయం పనులు ప్రారంభించిన వెంటనే నేషనల్ మానిటరింగ్ మస్టర్ యాప్‌లో నమోదు చేసి పంపించాలని ఏపీవో సంతోషంకు సూచించారు. పని ప్రదేశంలో కూలీలు నాలుగు గంటలు అందుబాటులో ఉండి కొలతల ప్రకారం పని చేయాలన్నారు. ఎలాంటి అవినీతికి తావులేకుండా నిబంధనలకు అనుగుణంగా పనులు నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

నిస్వార్థ సేవకుడు జ్యోతయ్య

విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి

అద్దంకి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): నిస్వార్థ సేవకుడు పంతంగి జ్యోతయ్య అని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. సంఘ సేవకుడు, రిటైర్డ్ మిలటరీ ఉద్యోగి పంతంగి జ్యోతయ్య అనారోగ్యంతో బాధపడుతూ బెంగళూరులోని మిలటరీ వైద్యశాలలో సోమవారం మృతి చెందారు. జ్యోతయ్య మృతదేహాన్ని బుధవారం అద్దంకి లోని పోలీస్‌స్టేషన్ ఎదురు స్వగృహం వద్ద ఉంచారు. మంత్రి గొట్టిపాటి రవికుమార్ బుధవారం ఉదయం జ్యోతయ్య మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ జ్యోతయ్య పేదల కోసం నిత్యం పరితపిస్తూ ఎక్కడైనా ఫంక్షన్‌ల వద్ద భోజనాలు మిగిలిపోయినా వెంటనే అర్ధరాత్రి సమయంలో సైతం పేదలకు చేర్చి పంచి పెట్టే వారన్నారు. అద్దంకిలో పచ్చదనం


జ్యోతయ్య మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి రవికుమార్

అలుముకోవడానికి జ్యోతయ్య ఆద్యుడన్నారు. ఆయన మృతి అద్దంకి పట్టణ ప్రజలకు తీరని లోటన్నారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. టీడీపీ నేతలు లహరి, గట్టుపల్లి రామారావు, సందిరెడ్డి శ్రీనివాసరావు, మన్నం త్రిమూర్తులు, రోటరీ క్లబ్ సభ్యులు చప్పిడి వీరయ్య, వీరవల్లి రుద్రయ్య, దివాకర్‌దత్, దేవపాలన, జ్యోతి చంద్రమౌళి, చుండూరి మురళి, బాషా, కాటూరి వెంకటనర్సయ్య, రఫీ, భువనేశ్వరి నివాళులర్పించారు.

విద్యుత్ వినియోగదారుల సత్వర సేవలకు చర్యలు

ఈఈ మస్తాన్‌రావు

అద్దంకి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ వినియోగదారులకు సత్వర సేవలు అందించే విధంగా చర్యలు చేపట్టినట్లు విద్యుత్ ఈఈ నల్లూరి మస్తాన్‌రావు తెలిపారు. విద్యుత్ కనెక్షన్‌లు, వ్యవసాయ కనెక్షన్‌లు, అదనపు లోడు, బిల్లుల చెల్లింపు తదితర అంశాలకు సంబంధించి ఈఈ కార్యాలయం కు అందిన అన్ని ప్రతిపాదనలు, అర్జీలకు ఎప్పటికప్పుడు ఫోన్ ద్వారా సమాచారం అందించటం జరుగుతుందన్నారు.పారదర్శకంగా సేవలు అందించేందుకు అన్ని చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈఈ కార్యాలయంలో బుధవారం నుంచి వినియోగదారులకు ఫోన్ ద్వారా సమాచారం అందించేందుకు ప్రత్యేకంగా ఒక విగ్ ను ప్రారంభించినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన వాట్సాప్ గవర్నెన్స్‌లో మన మిత్ర పౌర సేవలలో ఎనర్జీ సేవలు కూడా ఉన్నందున వినియోగదారులు 9552300009 నెంబర్‌ను వినియోగించుకోవాలన్నారు.

విధులకు ప్రశాంతంగా వెళ్లేలా సహకరించాలి

ఆర్టీసీ సిబ్బంది కుటుంబ సభ్యులతో డీఎం రామ్మోహనరావు

అద్దంకి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ డ్రైవర్‌లు విధులకు వెళ్లేటప్పుడు ప్రశాంతతతో వెళ్లేలా కుటుంబ సభ్యులు తమవంతు సహకారం అందించాలని ఆర్టీసీ డీఎం రామ్మోహనరావు కోరారు. రోడ్డు భద్రత మాసోత్సవాలలో భాగంగా బుధవారం స్థానిక డీఎం కార్యాలయంలో ప్రమాదాలు చేసిన డ్రైవర్‌లు, కుటుంబ సభ్యులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. డ్రైవర్‌లు ప్రశాంతంగా విధులు నిర్వహించినప్పుడే ప్రమాదాలు తగ్గుతాయన్నారు. ఇందు కోసం కుటుంబసభ్యుల సహకారం ఎంతైనా అవసరం అన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డీఎం మహబూబీ పాల్గొన్నారు.


ఆర్టీసీ డ్రైవర్‌లు, కుటుంబసభ్యులతో మాట్లాడుతున్న డీఎం రామ్మోహనరావు

రైతులు పేర్లు నమోదు చేయించుకోవాలి

మార్టూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : ఏపీ ఫార్మర్స్ రిజిస్ట్రీలో రైతులందరూ తమ పేర్లు నమోదు చేయించుకోవాలని తద్వారా రైతులందరికీ ఐడీ నంబరును కేటాయిస్తారని మార్టూరు సహాయ వ్యవసాయ సంచాలకులు కేవీ శ్రీనివాసరావు అన్నారు. పొలంపిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని మార్టూరు, నాగరాజుపల్లి గ్రామాలలో మొక్కజొన్న, వేరుశనగ పంటలను శ్రీనివాసరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆ యన రైతులతో మాట్లాడారు. ప్రతి రైతు పంట నమోదు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయఅధికారి బీ అంజిరెడ్డి, వ్యవసాయ సహాయకులు హరి, సువర్చల, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రాజశేఖర్ పాల్గొన్నారు.

యద్దనపూడి : యద్దనపూడి మండలంలో బుధవారం గన్నవరం, పూనూరు గ్రామాల్లో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి మేరమ్మ రైతుల వెంట వెళ్లి శనగ పొలాలను పరిశీలించారు. వారికి శనగ పైరులో కుంకుమ తెగులు నివారణకు మందుల వినియోగంపై సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏసుబాబు, హరీష్ పాల్గొన్నారు.

డ్రోన్‌తో సమయం, ఖర్చు ఆదా

మేదరమెట్ల : డ్రోన్‌ల వినియోగంతో తక్కువ సమయంలో తక్కువ మోతాదు పురుగు మందులను పచికారీ చేసుకోవచ్చని ఏడీఏ ధనరాజ్ తెలిపారు. బుధవారం మండలంలోని పి.గుడిపాడు, తిమ్మనపాలెం గ్రామాల్లో డ్రోన్‌ల వినియోగంపట్ల ఆయన రైతులకు వివరించారు. డ్రోన్‌లతో పురుగు మందు పిచికారీ చేయడంవల్ల పురుగుమందు ఖర్చు తగ్గడంతో పాటు మందు సమపాళలలో అన్ని మొక్కలకు పడుతుందన్నారు. ప్రభుత్వం 80 శాతం సబ్సిడీతో ప్రతి మండలానికి 2 లేదా 3 రైతుల గ్రూపులకు అందిస్తుందన్నారు. కార్యక్రమంలో ఏవో శ్రీనివాసరావు, ఏఏవో షరీఫ్, మేరి గ్రామ రైతులు పాల్గొన్నారు.



డ్రోన్ వినియోగంపై వివరిస్తున్న ఏడీఏ ధనరాజ్

ఇంకొల్లు : వాతావరణంలో వచ్చిన మార్పుల కారణంగా శనగలో కుంకుమ తెగులు రాకుండా చర్యలు తీసుకోవాలని వ్యవసాయాధికారి వేణుగోపాల్ అన్నారు. మండలంలోని నాగండ్ల, సూదివారిపాలెంలో బుధవారం శనగను ఆయన పరిశీలించారు. శనగలో కుంకుమ తెగులు రాకుండా ఎకరాకు 400మిల్లీ హెక్సకోనోజోల్ పిచికారీ చేయాలన్నారు. పూత రాలకుండా ప్లానోఫిక్స్, కంటాప్లస్‌ను పిచికారీ చేసుకోవాలని సూచించారు. పొగాకు పంటలో కాండం తొలుచు పురుగు నివారణకు ఎకరాకు ఫ్లూబెండమైడ్ 50 మి.లీ. పిచికారీ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పశు సంవర్ధ శాఖ, వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

పంట మార్పిడితో అధిక దిగుబడులు

బల్లికురవ : రైతులు పంట మార్పిడి పద్ధతి పాటిస్తే అధిక దిగుబడులతో లాభాలు గడించ వచ్చని ఏవో కుమారి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని అంబడిపూడి, వల్లాపల్లి గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా ఏవో మొక్కజొన్న పంటను పరిశీలించి కత్తెర పురుగుపట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆనంతరం దాల్వా పంటగా వరి సాగు చేస్తున్న రైతులతో అమె మాట్లాడుతు పంట దుక్కులలో ఎకరాకు 20కేజీల వంతున జింక్‌ను చల్లాలని తెలిపారు. వరి నాటు వేసే రైతులు అయిదు నుంచి ఆరు మొక్కలను నాటాలని తెలిపారు. ఒక పంట సాగు చేశాక వెంటనే అదే పంట వేయకుండా మరలా వేరే రకం పంట వేయడం వలన దిగుబడులు పెరగడంతో పాటు తెగుళ్ల కూడా తగ్గుతాయని తెలిపారు. కార్యక్రమంలో వీఏఏలు ప్రవీణ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

అద్దంకిటౌన్ : మొక్కజొన్నలో సమగ్ర ఎరువుల యాజమాన్యం చేపట్టాలని ఏవో కొర్రపాటి వెంకటకృష్ణ తెలిపారు. బుధవారం కొటికలపూడి, కుంకుపాడు గ్రామాల్లో పొలంపిలుస్తోందిలో భాగంగా రబీలో సాగు చేసిన మొక్కజొన్నను పరిశీలించారు. కార్యక్రమంలో ఉద్యాన అధికారి దీప్తి, ఏఈవో కోటేశ్వరరావు పాల్గొన్నారు.

నూరు వసంతాలు నిండిన మసీదు

రూ.కోటితో పునఃనిర్మాణం

పర్చూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : పర్చూరులో ఉన్న మసీద్‌కు 100 ఏళ్లు నిండాయి. దాని స్థానంలో నూతన మసీద్‌ను నిర్మించుకునే విధంగా అడుగులు పడుతున్నాయి. సుమారు శతాబ్ద కాలం కిందట ముస్లిం సోదరులు ప్రార్థనలు జరిపించుకునే విధంగా మసీదు నిర్మాణం జరిగింది. అయితే ప్రస్తుతం మసీద్ ప్రాంగణం లోతుట్టు ప్రాంతంగా మారి కొద్దిపాటి వర్షం కురిస్తే నీరు లోపలికి చేరడంతో ఇబ్బంది కరంగా మారింది. ఏళ్లనాటిది కావడంతో నూతన మసీద్‌ను నిర్మించుకోవాలని ముస్లింలు నిర్ణయించారు. పాత భవనాన్ని తొలగించి కొత్తదాన్ని నిర్మించేందుకు చర్యలు చేపట్టారు బుధవారం ముస్లిం మత పెద్దల సారథ్యంలో మసీద్ తొలగింపు కార్యక్రమం చేపట్టారు. రూ.కోటి వ్యయంతో నూతన మసీద్‌ను నిర్మించనున్నారు.


నూరు వసంతాలు నిండిన మసీదును తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్

చిన్నారులకు బలమైన ఆహారం అందించాలి

బల్లికురవ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : రక్తహీనత లేకుండా చిన్నారులకు బలమైన పౌష్టికాహారం అందించాలని ఐసీడీఎస్ సంతమాగులూరు ప్రాజెక్టు సీడీపీవో సుధ కోరారు. మండలంలోని ఎస్ఎల్ గుడిపాడు గ్రామంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలను సీడీపీవో బుధవారం తనిఖీలు చేశారు. ఈసందర్భంగా చిన్నారుల ఎత్తు బరువులను సీడీపీవో తనిఖీలు చేసి తల్లులకు పలు సూచనలు చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న సౌకర్యాల గురించి వారికి వివరించారు. ప్రతినెలా అయిదో తేదీన అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీలను చేసి కేంద్రాల బలోపేతానికి కృషి చేస్తామని ఈ సందర్భంగా అమె తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సలోమి, అంగన్‌వాడీ కార్యకర్త నాగమణి పాల్గొన్నారు.

రుణాలను సకాలంలో చెల్లించాలి


సమావేశంలో మాట్లాడుతున్న స్త్రీనిధి మేనేజర్ నాగశంకర్

బల్లికురవ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : పొదుపు సంఘాల బలోపేతానికి మహిళలు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లింపులు జరిగేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని స్త్రీనిధి మేనేజర్ నాగశంకర్ కోరారు. గురువారం బల్లికురవ మండల మహిళా సమాఖ్య సమావేశం ఏపీఎం రాజారావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా పొదుపు గ్రూపులకు అందిస్తున్న స్త్రీనిధి, ఉన్నతి, సామాజిక పెట్టుబడి నిధి తదితర అంశాలపై అధికారులు వీవోఏలకు సూచనలు చేశారు. పొదుపు సంఘాలకు రుణాలను సకాలంలో అందజేసేలా చర్యలు చేపడుతున్నట్లు వారు తెలిపారు. సమావేశంలో సమాఖ్య అధ్యక్షురాలు రమాదేవి, ఎల్‌సీ భాస్కర్, సీసీ పేరయ్య, ఫార్మర్ మిత్ర అంజయ్య పాల్గొన్నారు.

నిరాశ్రయులకు చేయూత

చీరాలటౌన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : నిరాశ్రయలైన వృద్ధులకు అవకాశం ఉన్న మేరకు చేయూత అందించాలని పద్మభాస్కర్ ఫౌండేషన్ ప్రతినిధి గంటా అనిల్‌కుమార్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని సాయికాలనీలోని సుమారు 35 వృద్ధ కుటుంబాలకు నిత్యావసరాలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ తన తల్లి పేరుతో నిస్వార్థంగా సేవలు చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో కవిత, నవ్య, మాకినేని ప్రదీప్ పాల్గొన్నారు.


పేదలకు నిత్యావసరాలను పంపిణీ చేస్తున్న అనిల్

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు

జిల్లా వార్తలు

గురువారం 6 ఫిబ్రవరి 2025



నెల్లూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఏదో అర్జీ వచ్చిందా... దాన్ని ఫార్వార్డ్ చేసి చేతులు దులుపుకున్నామా ?.. అన్న పద్ధతి ఇక మీదట పనికిరాదు..! అర్జీనేగా వచ్చింది.. దానికి ఏదో ఒక సమాధానం చెప్పి తప్పించుకుందాంలే.. అన్న ధోరణి కూడా ఇక క్షేత్రస్థాయి అధికారుల్లో ఉండడానికి వీల్లేదు..! ఈ నిర్లక్ష్యపు విధానానికి ఇక స్వస్తి చెప్పాల్సిందే..! ఎందుకంటే ప్రజాఅర్జీలపై ప్రభుత్వం సీరియస్‌గా దృష్టిసారించింది. ప్రతి సోమవారం కలెక్టరేట్, ఇతర ప్రభుత్వ శాఖల్లో నిర్వహించే ప్రజావిజ్ఞప్తుల పరిష్కార వేదికలో వచ్చే అర్జీలే కాకుండా గ్రామసభలు, ప్రజాప్రతినిధుల సమావేశాల్లో వచ్చే ప్రతి అర్జీని ఆన్‌లైన్ చేస్తున్నారు. వివిధ సమస్యలపై ప్రజలు అందించిన వినతులను సంబంధిత అధికారులు తప్పనిసరిగా పరిశీలించాలి. అంతేకాక పరిష్కారం చూపేలా ప్రభుత్వం నూతన విధానాలను ప్రవేశపెట్టింది.

ఆడిట్ కీలకం

అర్జీల పరిష్కారంలో కీలకమైంది ఆడిట్ విధానం. ఈ విధానంలో భాగంగా కింది స్థాయి అధికారులు సమస్య పరిష్కారమైనట్లుగా చూపిస్తూ క్లోజ్ చేసిన అర్జీలను పైస్థాయిలో మానిటరింగ్ చేస్తారు. ఇందుకోసం కలెక్టరేట్‌లో ప్రత్యేక ఆడిట్‌సెల్‌ను కలెక్టర్ ఓ ఆనంద్ ఏర్పాటు చేశారు. ఇందులో తొమ్మిదిమంది ఉద్యోగులు ఉంటారు. ఒక్కొక్కరికి కొన్నిశాఖలను కేటాయించారు. ఆయాశాఖల అర్జీలను వారు పర్యవేక్షిస్తారు. మండల స్థాయి నుంచి అర్జీ పరిష్కారమైనట్లు క్లోజ్ అవ్వగానే ఈ ఆడిట్ సెల్‌కు అది ఫార్వార్డ్ అవుతుంది. ఈ సెల్ నుంచి సంబంధిత అర్జీదారుడికి నేరుగా ఫోన్ చేసి మాట్లాడతారు. సదరు అర్జీదారుడు సంతృప్తి చెందకపోతే సమస్యను లోతుగా పరిశీలిస్తారు. అది పరిష్కరించదగినదా...? లేదా..? అన్నది నిర్ధారించుకుంటారు. ఒకవేళ పరిష్కరించ గలిగినా, మండల అధికారులు పరిష్కరించకపోతే ఆడిట్ సెల్ నుంచే ఆ అర్జీని రీ ఓపెన్ చేస్తారు. ఇలా రీ ఓపెన్ అయిన అర్జీలను జిల్లా ఉన్నతాధికారులు సమీక్షిస్తారు. ఆ సమస్య పరిష్కారమయ్యే వరకూ ఆడిట్ సెల్ నుంచి పర్యవేక్షణ ఉంటుంది.



కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఆడిట్ సెల్‌లో ఉద్యోగులు

- ప్రజల సమస్యలు తీర్చేందుకు ప్రత్యేక ఆడిట్
- తొమ్మిది మందితో కలెక్టరేట్‌లో సెల్ ఏర్పాటు
- 18 మంది జిల్లా అధికారులకు బాధ్యతలు
- ప్రతి అర్జీదారుడితో నేరుగా మాట్లాడాల్సిందే ?
- వారు సంతృప్తి చెందకుంటే అర్జీ రీ ఓపెన్
- అలా జరిగిందంటే బాధ్యులకు మెమోలు

పరిష్కారమే లక్ష్యం

18 మందికి బాధ్యతలు

కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఆడిట్‌సెల్‌నే కాకుండా ఆడిట్ బాధ్యతలను మరో18 మంది జిల్లాస్థాయి అధికారులకు కలెక్టర్ అప్పగించారు. వీరిలో అర్జీలు ఎక్కువ వచ్చే ప్రధానమైన శాఖల అధికారులున్నారు. జడ్పీ సీఈవో విద్యారమను ఈ ఆడిట్ విభాగానికి నోడల్ అధికారిగా నియమించారు. ఈ అధికారులు కూడా 10 శాతం అర్జీలను ర్యాండమ్‌గా ఆడిట్ చేయాల్సి ఉంటుంది. ఈ విధానం ద్వారా అంతిమంగా అర్జీదారుడి సమస్యను పరిష్కరించనున్నారు. ఇప్పటివరకూ కలెక్టరేట్‌లోని ఆడిట్‌సెల్‌కు 16,179 అర్జీలు పరిష్కారమైనట్లుగా వచ్చాయి. వాటిలో 11,767 అర్జీలపై ఆడిట్ పూర్తి చేశారు. నేరుగా అర్జీదారులతో మాట్లాడి నివేదికలు సిద్ధం చేశారు. అందులో భాగంగా 459 అర్జీలను రీ ఓపెన్ చేశారు. ఇవన్నీ పరిష్కరించగలిగినవి అయినా మండల స్థాయిలో పరిష్కరించలేదని నిర్ధారించారు. ఇందుకు బాధ్యులైన అధికారులకు మెమోలు జారీ చేసేందుకు వీలుగా నివేదికలు సిద్ధం చేసి కలెక్టర్‌కు అందించనున్నారు.

అలానే 18 మంది జిల్లా స్థాయి అధికారులకు 2543 పరి ష్కారమైన అర్జీలు ఫార్వర్డ్ అయ్యా యి. ఇందులో సీఎం కార్యాలయం నుంచి వచ్చిన 766 అర్జీలు కూడా ఉన్నాయి. ఇప్పటి వరకూ 2196 అర్జీలకు సంబంధించి ఆడిట్ పూర్తి చేశారు. అందులో 77 అర్జీలను రీఓపెన్ చేశారు. సీఎం కార్యాల యం నుంచి వచ్చినా వాటిలో 48 అర్జీలు రీఓపెన్ కావడం గమ నార్హం. అంటే క్షేత్రస్థాయి అధికా రులు ఏ స్థాయిలో సమస్యలు పరిష్కరిస్తున్నారో దీన్ని బట్టి అర్థం చేసుకోవచ్చు. ఇలా నిర్లక్ష్యంగానో లేక ఉద్దేశపూర్వకం గానో సమస్యను పరిష్కరించ కుండా అర్జీలను క్లోజ్ చేస్తున్న మండల అధికారులకు మెమోలు ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. కొన్నాళ్లపాటు ఇదే విధానం కొనసాగితే చాలా వరకూ అర్జీలు క్షేత్రస్థాయిలోనే పరిష్కార మయ్యే అవకాశం ఉందని ఉన్నతాధికారులు అభిప్రాయపడుతున్నారు.



అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

ఇబ్బందులు తలెత్తకుండా

ధాన్యం కొనుగోళ్లు

- రైతులకు మద్దత ధర అందేలా చూడాలి
- అధికారుల సమీక్షలో కలెక్టర్ ఆనంద్

నెల్లూరు(వ్యవసాయం), ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఓ ఆనంద్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ లోని ఆయన చాంబర్‌లో బుధవారం వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రైతులకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈనెల 25లోగా ఈ క్రాప్ పూర్తి చేయాలన్నారు. సీసీఆర్‌సీ కార్డులు పొందిన కౌలు రైతులకు అవసరమైన బ్యాంకు రుణాలను మంజూరు చేయించాలని ఆదేశించారు. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించేలా జిల్లా సహకారశాఖ ఆధ్వర్యంలో ఎంపిక చేసిన పీఏసీఎస్‌ల్లో పురుగు మందు రహిత వ్యవసాయ ఉత్పత్తుల స్టాళ్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. పైలట్ ప్రాజెక్టుగా మార్కెటింగ్ శాఖ పరిధిలో ఓ గోదామును జాతీయ గోదాముల అభివృద్ధి ప్రాధికార సంస్థ, న్యూఢిల్లీ వారి గుర్తింపు పొందేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విడతల వారీగా అన్నీ గోదాములకు ఈ గుర్తింపు లభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దగదర్తి పీఏసీఎస్‌లో పురుగు మందు రహిత వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్ ఏర్పాటు చేయనున్నామని డీసీవో గుర్రప్ప తెలియజేశారు. జిల్లాలో మూడువేల ఎకరాల్లో డ్రిప్ పరికరాలు అమర్చినట్లు ఏపీఎంఐపీ పీడీ శ్రీనివాసులు తెలిపారు. సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి పీ.సత్యవాణి, మత్స్య శాఖ జేడీ నాగేశ్వరరావు, పశుసంవర్ధకశాఖ జేడీ రమేష్‌నాయక్, జిల్లా ఉద్యానశాఖాధికారి సుబ్బారెడ్డి, ప్రకృతి వ్యవసాయ సంస్థ పీడీ మాల కొండయ్య, మార్కెటింగ్‌శాఖ ఏడీ అనిత, మార్క్‌ఫెడ్ డీఎం పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



కందుకూరు ప్రాంతంలో నల్లి సోకటంతో గిడసబారిన మిరప తోట

ముంచుతున్న మిర్చి!

- మిరప పైరుకు తెగుళ్లు, తామర పురుగు బెడద
- దారుణంగా పడిపోయిన దిగుబడులు, ధరలు
- ఈ ఏడాది భారీ నష్టాలే అంటున్న అన్నదాతలు
- ఏసీలో నిల్వచేసిన రైతుల పరిస్థితి దయనీయం

కందుకూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఎర్ర బంగారంగా పిలుచుకునే మిర్చి సాగు ఈ ఏడాది రైతుకు శాపంగా పరిణమించింది. ధరలు, దిగుబడి తగ్గడం, తెగుళ్ల ఇలా అన్నిరకాల సమస్యలు సాగుదారులపై ముప్పేట దాడి చేస్తుండటంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నాడు. ప్రతిఏడాది లాభాలు పొందిన మిరప రైతులు ఈసారి మాత్రం పరిస్థితులు తారుమారయ్యాయి. జనవరి నుంచి మార్చి నెలాఖరు వరకు రోజుకో రీతిలో పైరు పెరుగుతూ కొమ్మలు నిండుగా పూత పిందెతో కళకళలా డాల్సిన మిరపతో టలు నల్లి, తామర పురుగు ధాటికి కొనలు మాడి పోయి కళావిహీనంగా కనిపిస్తున్నాయి.

- ఈ ఏడాది దిగుబడులు 25 శాతం మించవు..

దీంతో సాధారణ దిగుబడుల్లో 25శాతం కూడా వచ్చే పరిస్థితి లేదు. మరోపక్క మిర్చి ధరలు నేలచూపులు చూస్తుండటంతో దారుణంగా నష్టపోక తప్పని పరిస్థితులు కనిపిస్తున్నాయి. సాధారణంగా ఏపంటలైనా డిమాండ్ సప్లై సూత్రంపై ఆధారపడి మార్కెట్లో ధరలు పలుకుతుంటాయి. పంట ఉత్పత్తులు అంచనాలకు మించి వస్తే ధరలు తగ్గటం, దిగు బడులు అంచనాలకు అందుకోలేకపోతే గిరాకీ ఏర్పడి ధరలు పెరగటం సహజంగా జరుగుతుంది. అయితే మిర్చి విషయంలో అనూహ్యంగా దిగుబడులు పడిపోతున్నా ధరలు కూడా రోజుకోరీతిలో తగ్గిపోతుండటం అంతుబట్టక

- మిగతా 6లో

ఇంటర్ ఒకేషనల్ ప్రాక్టికల్స్

ప్రారంభం

- తొలిరోజు పరీక్షలు ప్రశాంతం



నెల్లూరు : జీవీఆర్ఆర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఆర్ఐవో శ్రీనివాసులు తదితరులు

నెల్లూరు(విద్య), ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఇంటర్ ఒకేషనల్ ప్రాక్టికల్ పరీక్షలు బుధవారం ప్రారంభం కాగా, తొలిరోజు ప్రశాంతంగా జరిగాయి. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు జరిగిన ప్రథమ సంవత్సరం పరీక్షలకు 284 మంది హాజరు కావాల్సి ఉండగా, 264 మంది హాజరయ్యారు. 20 మంది గైర్హాజరయ్యారు. అలాగే మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు జరిగిన ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 265 మంది హాజరు కావాల్సి ఉండగా 246 మంది హాజరయ్యారు. 19 మంది గైర్హాజరయ్యారు. నెల్లూరులోని జీవీఆర్ ఆర్ జూనియర్ కళాశాల కేంద్రాన్ని ఆర్ఐవో డాక్టర్ ఏ.శ్రీనివాసులు తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ జిల్లాలో ప్రాక్టికల్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని, ఎలాంటి మాల్‌ప్రాక్టీస్‌లు నమోదు కాలేదన్నారు. తొలి విడతగా 11 పరీక్ష కేంద్రాల్లో ఒకేషనల్ ప్రాక్టికల్స్ ప్రారంభమయ్యాయని, ఈ నెల 10 నుంచి రెండోవిడత ప్రాక్టికల్స్ ప్రారంభం కానున్నాయన్నారు. ఈ పరీక్షలను 88 కేంద్రాల్లో జనరల్ విద్యార్థులకు, నాలుగు కేంద్రాల్లో ఒకేషనల్ విద్యార్థులకు నిర్వహించనున్నామని వివరించారు. మూడు విడతలుగా జరిగే ఈ పరీక్షలకు జనరల్ విద్యార్థులకు 121 కేంద్రాలు, ఒకేషనల్ విద్యార్థులకు 21 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.

అనధికార లే అవుట్లపై

నుడా.. కొరడా!

- 2019-24 మధ్యకాలంలో వేసిన వాటిపై దృష్టి

వివరాలు 6లో..

- గత ప్రభుత్వంలో ఆగిన మరుగుదొడ్ల పథకం
- కూటమి సర్కారులో పునఃప్రారంభం
- వ్యక్తిగతానికి 6 వేలు, సామాజికానికి 526 దరఖాస్తులు
- అర్హులంతా దరఖాస్తు చేసుకోండి : ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ

స్వచ్ఛాంధ్రకు

మళ్లీ ఊపిరి



కోవూరు సచివాలయం వద్ద నిర్మించిన సామాజిక మరుగుదొడ్లు

నెల్లూరు (జడ్పీ), ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో జిల్లాలో ఆగిపోయిన స్వచ్ఛాంధ్ర మరుగుదొడ్ల పథకానికి కూటమి ప్రభుత్వం మళ్లీ ఊపిరిపోసింది. స్వచ్ఛ భారత్ -స్వచ్ఛ ఆంధ్రలో భాగంగా బహిరంగ ప్రదేశాల్లో మలవిసర్జన చేయకూడదని, ప్రతి ఒక్కరూ స్వచ్ఛత పాటించడం ద్వారా, ఆరోగ్యంగా ఉండాలన్న ఆకాంక్షతో 2014-19వరకు అప్పటి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యక్తిగత, సామాజిక మరుగుదొడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టాయి. దీంతో గ్రామాల్లో సైతం ఇళ్లలోనే పేదలంతా మరుగుదొడ్లను నిర్మించుకుని బహిరంగమలవిసర్జనకు స్వస్తి పలికారు.

- పథకాన్ని నీరుగార్చిన వైసీపీ

ఈ పథకాన్ని వందశాతం ప్రజలకు అందించాల్సి ఉండగా, రాష్ట్రంలో 2019లో వైసీపీ అధికారంలోకి రావడంతో దాన్ని పూర్తిగా అటకెక్కించింది. స్వచ్ఛాంధ్ర లక్ష్యాన్ని నీరుగార్చింది. అయితే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఈ పథకం ఊపిరిపోసుకుంది. దీంతో పల్లెలతోపాటు పట్టణాలు, నగరాలు, అన్నీ ప్రాంతాల్లో అవసరమైనవారికి మరుగుదొడ్ల నిర్మాణానికి అధికారులు శ్రీకారం చుట్టారు. అలాగే పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ కార్యాలయాల్లోనూ సామాజిక మరుగుదొడ్లు ఏర్పాటు చేసుకోవాలని ప్రభుత్వం సూచించింది.

- ప్రారంభమైన పనులు

జిల్లాలో ఇంకా మిగిలి ఉన్న గృహాలు, కొత్తగా నిర్మించుకున్న ఇళ్ల యజమానులు వ్యక్తిగత, సామాజిక మరుగుదొడ్లకు దరఖాస్తు చేసుకోవాలని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు తెలిపారు. దీంతో ఇప్పటివరకు ఆరు వేలకుపైగా వ్యక్తిగత మరుగుదొడ్లకు దరఖాస్తులు అందాయి. ఒక్కొక్క మరుగుదొడ్డికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.15వేలు అందజేయనున్నాయి. కాగా ఇప్పటివరకు 834 మరుగుదొడ్లు పూర్తి అయ్యాయి. మిగతా మరుగుదొడ్ల పనులు జరుగుతున్నాయి. అలాగే సామాజిక మరుగుదొడ్లను ఆలయం, బస్టాండు, బీచ్‌లు, తదితర ప్రాంతాల్లో మంజూరు చేస్తుండడంతో వాటికి 526 దరఖాస్తులు వచ్చాయి. వాటికి ఒక్కోదానికి రూ.3లక్షల వరకు మంజూరు చేస్తున్నారు. ఇప్పటి వరకు 88సామాజిక మరుగుదొడ్లు పూర్తి చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. అలాగే ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించి 486 దరఖాస్తులు రాగా, వాటికి ఒక్కో మరుగుదొడ్డికి రూ. 36వేలు మంజూరు చేయనున్నారు. ఇప్పటికి ఇవి 136 పూర్తికాగా, మిగిలినవాటి పనులు జరుగుతున్నాయి.

అర్హులంతా దరఖాస్తు చేసుకోవచ్చు

మరుగుదొడ్ల నిర్మాణానికి తెల్లరేషన్ కార్డు కలిగిన పేదలంతా దరఖాస్తు చేసుకోవచ్చు. వ్యక్తిగత మరుగుదొడ్డికి రూ.15వేలు, సామాజిక మరుగుదొడ్లకు రూ. 3లక్షలు, ప్రభుత్వ కార్యాలయాలకు రూ. 36వేలు నిధులు మంజూరు చేస్తాం. ఈ పథకాన్ని అర్హులంతా సద్వినియోగం చేసుకుని బహిరంగ ప్రదేశాల్లో మలవిసర్జనకు స్వస్తి పలకాలి.

- డీ వెంకటరమణ, ఎస్ఈ, ఆర్‌డబ్ల్యుఎస్

దళారులు చెప్పిందే ధర

- వారు చెప్పిన రేటుకే ఉప్పు విక్రయాలు
- పదేళ్లుగా ఇదే తంతు
- పండించిన రైతుకు దక్కని ఫలితం
- ఏటేటా తగ్గుతున్న ఉత్పత్తి

అల్లూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఉప్పు రైతులను సైతం దళారులు వదలకపోవడంతో వారు ప్రతి ఏటా నష్టపోతున్నారు. తాము చెప్పిందే ధరగా దళారులు ఉప్పును కొనుగోళ్లు చేస్తుంటారు. లేదంటే కుప్పలు అక్కడే ఉండాల్సిందే. పూటగడవడం కష్టంగా మారడంతో కొంతమంది రైతులు తాము ఉత్పత్తి చేసిన ఉప్పును తెగనమ్ముకోవాల్సి వస్తున్నది. ఉప్పునకు గిట్టుబాటు ధర ఉన్నా దళారులు చెప్పే ధరకే విక్రయించాల్సి వస్తుండడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. దీంతో గతంలో జిల్లావ్యాప్తంగా 50వేల ఎకరాలకు పైగా విస్తీర్ణంలో ఉత్పత్తి చేసే ఉప్పు ప్రస్తుతం కేవలం 10వేల ఎకరాల్లోనే సాగుచేస్తున్నారు. అదీ కూడా అల్లూరు మండలంలోనే ఏడువేల ఎకరాల్లో ఉత్పత్తి చేస్తున్నారు.



ఉప్పును లారీకి లోడ్ చేస్తున్న హమాలీలు

- నిల్వ సౌకర్యం లేకనే...

తాము ఉత్పత్తి చేసిన ఉప్పును నిల్వ చేసుకునేందుకు రైతులకు వసతి లేదు. దీంతో అక్కడికక్కడే చెప్పిన ధరకే ఉప్పు విక్రయిస్తున్నారు. ఇదే అదునుగా దళారులు దోపిడీకి పాల్పడుతున్నారని రైతులు వాపోతున్నారు. సాధారణంగా జనవరి నుంచి ఉప్పు ఉత్పత్తికి రైతులు సన్నాహాలు చేస్తారు. ఫిబ్రవరి నెలాఖరు నుంచి ఉప్పు ఉత్పత్తి అయ్యే అవకాశం ఉంది. ఉత్పత్తి చేసిన ఉప్పును రైతు తన అవసరాన్ని బట్టి విక్రయించుకునే పరిస్థితి ఉంటుంది.

- ధరల పరిస్థితి ఇదీ...

క్వింటా ఉప్పు ఉత్పత్తికి సుమారుగా రూ.100 నుంచి రూ.150 ఖర్చవుతోంది. ఇందుకు రెట్టింపు ధరకు విక్రయిస్తేనే రైతులకు గిట్టుబాటు అవుతుంది. కానీ ఇక్కడ దళారులు మాత్రం రూ.150 నుంచి రూ.200లోపే ధర నిర్ణయించి కొనుగోలు చేస్తున్నారు. దీంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది. గత ఏప్రిల్‌లో ఉత్పత్తి చేసిన నాణ్యమైన ఉప్పు ధర నేడు రూ.300 పలుకుతోంది. ఇటీవల రూ.350 ఉన్న ధర మళ్లీ కొత్త ఉత్పత్తి ప్రారంభమయ్యే నాటికి పడిపోవడంతో రైతులు లబోదిబోమంటున్నారు.

- పదేళ్లుగా ఇదే తంతు

గత దశాబ్దకాలంగా ఉప్పు రైతులను దళారులు అడ్డంగా దోచుకునే ప్రయత్నం చేస్తూనే ఉన్నారు. దీంతో ఉప్పు రైతులు ఎప్పటికీ అలాగే ఉండిపోతున్నారు. పెట్టుబడి పెట్టడం ఒక వంతైతే, ఉత్పత్తి చేసిన ఉప్పునకు గిట్టుబాటు ధర లేకపోవడం మరో సమస్యగా మారింది. రైతుల వద్ద తీసుకునే ధరకంటే రెండింతలుగా మార్కెట్లో దళారులు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఈ క్రమంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు ఉప్పు నిల్వలకు గోదాములు ఏర్పాటు చేయాలి. అలాగే వారికి గిట్టుబాటు ధర కల్పించాలి. సాల్ట్ బోర్డు ఏర్పాటుకు కృషి చేయాలి.

ఉప్పునకు ప్రత్యేక గుర్తింపు ఉండాలి



అన్నీ పంటల మాదిరిగానే ఉప్పునకు ప్రత్యేక గుర్తింపు ఉండాలి. ప్రత్యేక శాఖను కేటాయించి ఉప్పు రైతులకు సహ కారం అందించాలి. ప్రతీ పంటకు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసినట్టే ఉప్పు పంటకూ ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలి. తద్వారా రైతులను ఆదుకుని దళారీ వ్యవస్థను రూపుమాపాలి.

- అనంతరాజు బాలకృష్ణంరాజు, ఉప్పురైతు, అల్లూరు, అల్లూరు మండలం

దళారులు దోచుకుంటున్నారు..



దళారుల కారణం గా ఉప్పు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. కష్టపడి ఉత్పత్తి చేస్తున్న ఉప్పును దళారుల చేతుల్లో పెట్టి వారిచ్చిన ధరను తీసుకునే దౌర్భాగ్య పరిస్థితి వాటిల్లింది. దశాబ్దాల కాలంగా వారి చేతుల్లోనే నలిగిపోతున్నాం. ప్రభుత్వ చొరవ తీసుకుంటే తప్ప ఉప్పు రైతుల మనుగడ కష్టం.

- దానం రజని, ఉప్పురైతు, ఇస్కపల్లి మజరా జవ్వాగు, అల్లూరు మండలం

పట్టించుకునేవారేరి ?



అన్నీ రంగాల రైతుల పరిస్థితి ఓ ఎత్తయితే, ఉప్పు రైతులది మరో ఎత్తు. అత్యధికంగా నష్టపోయేది ఉప్పు రైతులే. ఈ విషయాన్ని ప్రభుత్వాలు గుర్తించి ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. లేకుంటే రైతులు అభివృద్ధి చెందే పరిస్థితి లేదు.

- దానం జాషువా, ఉప్పురైతు, ఇస్కపల్లి మజరా జవ్వాగు, అల్లూరు మండలం



వీల్‌చైర్ లేక దివ్యాంగ వృద్ధుడిని నడిపించుకుపోతున్న కుటుంబ సభ్యులు



డాక్టర్ వద్దకు వెళ్లాలంటే సొంత వీల్‌చైరే దిక్కు

వీల్‌చైర్లలో వస్తువులు..
దివ్యాంగులకు అవస్థలు

- జీజీహెచ్‌లో తీవ్ర అసౌకర్యం
- దాతలిచ్చిన కుర్చీలు ఇతర పనులకు వినియోగం

నెల్లూరు (వైద్యం), ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో దివ్యాంగులకు కష్టాలు తప్పడం లేదు. ఆసుపత్రి నిర్వాహకులు కనీసం వీల్‌చైర్లు కూడా అందుబాటులో ఉంచకపోవటంతో దివ్యాంగులు నానా అగచాట్లు పడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 32,638 మంది దివ్యాంగులు ప్రభుత్వం నుంచి ప్రతినెలా రూ.6 వేలు పింఛను తీసుకుంటున్నారు. అయితే గత వైసీపీ ప్రభుత్వం నుంచి అర్హత లేనివారు కూడా దివ్యాంగుల పింఛను తీసుకుంటున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి వచ్చింది. ఈ నేపథ్యంలో దివ్యాంగులందరినీ పరీక్షించి వారు పెన్షన్‌కు అర్హులా... కాదా.. అని తేల్చే పనిలో ఉంది. ఇందులో భాగంగా జిల్లాలో ఏడు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రధానంగా నెల్లూరులోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ప్రతీ రోజూ 400 మంది దివ్యాంగులను పరీక్షించేలా నాలుగు కేంద్రాలను ఏర్పాటు చేశారు. అయితే ఆయా కేంద్రాల్లో సరైన ఏర్పాట్లు చేయలేదు. ఇక్కడికి వచ్చే దివ్యాంగులలో ఎక్కువ మంది నడవలేని వారున్నారు. వీరికి వీల్‌చైర్ తప్పనిసరి. ఇదిలా ఉండగా పలువురు దాతలు జీజీహెచ్‌కు 15కుపైగా వీల్‌చైర్లు ఇచ్చి ఉన్నారు. మంగళవారం నగరంలోని కందప్ప మేస్త్రి సత్రం నిర్వాహకులు కూడా రెండు వీల్‌చైర్లు, మరో రెండు ట్రైసైకిళ్ల వితరణ చేశారు. కానీ, దాతలిచ్చిన ఈ వీల్‌చైర్లను జీజీహెచ్ అధికారులు దివ్యాంగులకు అందుబాటులో ఉంచటం లేదు. ఆఫీసు ఫైళ్ల, రోగుల వార్డుల్లో దుప్పట్లు తరలించేందుకు వాడుతున్నారు. దీంతో దివ్యాంగులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. కొందరు దివ్యాంగుల కుటుంబ సభ్యులు స్వంతంగా వీల్‌చైర్ తెచ్చుకుంటున్నారు. ఈ క్రమంలో ఆసుపత్రి అధికారుల తీరుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.





వీల్‌చైర్‌లో రోగుల దుప్పట్లు తీసుకుపోతున్న ఆసుపత్రి సిబ్బంది

వీల్‌చైర్‌లో జీజీహెచ్ కార్యాలయ పుస్తకాల తరలింపు

ప్రభగిరిపట్నానికి
పూర్వ వైభవం దక్కేనా!?


- మసకబారుతున్న ఏళ్లనాటి చరిత్ర!
- కనుమరుగవుతున్న నాటి ఆనవాళ్లు

చరిత్ర

పొదలకూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : పొదలకూరుకు సుమారు 10 కి.మీ దూరంలో ఉన్న ప్రభగిరిపట్నం నాడు చరిత్ర పుటల్లో నిలిచింది. ప్రస్తుతం ఉన్న ఆనవాళ్లు కూడా కనుమరుగవుతోంది. 11వ శతాబ్దంలో శ్రీకృష్ణదేవరాయలుకు సామంతరాజుగా ఉన్న ప్రభాకరవర్ధనుడు పాలించడం వల్ల ఈ ప్రాంతానికి ప్రభగిరి పట్నం అన్న పేరు వచ్చినట్లు తెలుస్తోంది. రెండు వైపులా ఉన్న కొండల వలన శత్రుదుర్భేదంగా ఉండటంతో ఈ ప్రాంతాన్ని కేంద్రంగా చేసుకుని ప్రభాకరవర్ధనుడు పాలించేవాడు. దీంతో ఈ గ్రామం వ్యాపార కేంద్రంగా మారి నిత్యం వర్తకులతో రద్దీగా ఉండేది. ప్రభాకర వర్ధనుడికి దైవభక్తి ఎక్కువ కావడంతో ఈ ప్రాంతంలో 101 దేవాలయాలు, 101 కోనేర్లు నిర్మించారు. వీటిలో పెరుమాళ్లస్వామి, అభయాంజనేయస్వామి, శివాలయాలు ముఖ్యమైనవి. ప్రభాకరవర్ధనుడు నిత్యం సమీపంలోని పెన్నానదిలో స్నానమాచరించి సొరంగ మార్గం ద్వారా ఆలయానికి చేరుకుని స్వామివార్లకు పూజలు చేసే వారని పురాణాలు చెబుతున్నాయి. తన శిల్పకళా వైభవానికి చిహ్నంగా భావించి నిర్మించిన ఆలయాలు కాలగమనంలో శత్రురాజులు జరిపిన దండయాత్రలో చాలావరకు ధ్వంసమవగా మిగిలిన దేవాలయాలు, కోనేర్లు కాలక్రమంలో శిథిలావస్థకు చేరుకున్నాయి. నేటికి గ్రామంలో అక్కడక్కడా పురాతన చరిత్రకు సాక్ష్యంగా దేవాలయాలు, కోనేరులు దర్శనమిస్తాయి. పురాతన కోనేరులలో నీటిని గ్రామస్థులు తాగునీటి వాడకంతోపాటు వ్యవసాయ వాడకాలకు వినియోగిస్తున్నారు. ఆలయాలు, కోనేర్లు శిథిలావస్థకు చేరుకోవడంతో అక్రమార్కుల కన్ను వీటిపై పడింది. దాంతో మిగిలిన దేవాలయాలతోపాటుగా శివాలయం పూర్తిగా ధ్వంసమైంది. దాంతో స్థానికులు దేవాలయాల దుస్థితిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించిన అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం 2008లో అప్పటి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చొరవతో జీర్ణోద్ధరణ పనులకు శ్రీకారం చుట్టారు. అభయాంజనేయస్వామికి ఎంతో అతీతశక్తులు ఉన్నట్లు గ్రామస్థుల నమ్మకం. అందువలనే ఇక్కడ ప్రతి ఏటా హనుమాన్ జయంతి సందర్భంగా ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తారు. ఈ ఉత్సవాలకు చుట్టుపక్కల గ్రామాలతోపాటుగా సుదూర ప్రాంతాల నుంచి భక్తులు తండోపతండాలుగా వచ్చి స్వామిని దర్శనం చేసుకుంటారు. ఉత్సవాలలో ఎడ్ల పందాలు, కీలుగుర్రం నాట్యం ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయి. నేటికీ అభయాంజనేయ స్వామి దేవాలయంలో అనారోగ్యంతో బాధపడేవారు నిద్ర చేస్తే తమకు ఆరోగ్యం కుదుటపడుతుందనే నమ్మకముంది. ఇంత చరిత్ర ఉన్న దేవాలయంలో స్వామివార్లకు ధూపదీప నైవేద్యం పెట్టే పూజారికి ఇప్పటికీ గ్రామస్థులు చందాలతో జీతం ఇస్తున్నారంటే పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థమవుతోంది.



చెట్టు కింద ఉన్న పురాతన శిలా విగ్రహాలు



పురాతన ఆంజనేయస్వామి ఆలయం

● పురాతన విగ్రహాలకు భద్రత కరువు

దెబ్బతిన్న విగ్రహాలను అభయాంజనేయ స్వామి ఆలయంలోని చెట్టు కింద ఉంచడంతో ఎంతో చరిత్ర కలిగిన దేవతామూర్తుల విగ్రహాలు ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ దర్శనమిస్తున్నాయి. ఎంతో విలువైన విగ్రహాలను జాగ్రత్తగా భద్రపరచకుండా నిర్లక్ష్యంగా వదిలివేయడం పట్ల భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఘన చరిత్ర కలిగిన దేవాలయాలను కాపాడాల్సిన అధికారులు, గత పాలకులు తమకేం పట్టనట్లు వ్యవహరించారు. ఇకనైనా పూర్తిస్థాయిలో అభివృద్ధి పనులు చేసి ఆలయానికి, గ్రామానికి పూర్వవైభవాన్ని తీసుకురావాలని పర్యావరణ, పురావస్తు ప్రేమికులు కోరుతున్నారు.


సచివాలయ ఏఎన్‌ఎంలకు
ఉద్యోగోన్నతి కల్పించండి

- డీఎంహెచ్‌వోకు ఎన్‌జీవో సంఘం వినతి

నెల్లూరు (వైద్యం), ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : సచివాలయ ఏఎన్‌ఎంలకు గ్రేడ్-3 ఉద్యోన్నతి కల్పించాలని ఏపీ ఎన్‌జీవో అసోసియేషన్ నాయకులు కోరారు. ఈ మేరకు బుధవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాతకు వినతిపత్రం అందించారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మన్నేపల్లి పెంచలరావు మాట్లాడుతూ సచివాలయ ఏఎన్‌ఎంలు ఉద్యోగోన్నతి కోసం వేచి చూస్తున్నారన్నారు. దీనిపై కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఈ నెల 2న ఆదేశాలు జారీ చేశారన్నారు. వాటి ప్రకా రం ఉద్యోగోన్నతి కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్య క్షుడు బండారుపల్లి వెంకటేశ్వర్లు, జిల్లా కార్య దర్శి గాదిరాజు రామకృష్ణ, అసోసియేట్ అధ్య క్షుడు నందిమండలం అంజనేయవర్మ, పులి సతీష్‌బాబు, శ్రీనివాసులు పాల్గొన్నారు.



డీఎంహెచ్‌వోకు వినతిపత్రం అందిసున్న ఎన్‌జీవో అసోసియేషన్ నాయకులు



వెంగాయ గారిపాలెం రోడ్డులో అనధికార లేఅవుట్‌లో ధ్వంసమైన సీసీ కాలువలు

అనధికార లే అవుట్లపై
నుడా.. కొరడా!

- 2019-24 మధ్యకాలంలో వేసిన వాటిపై దృష్టి
- జాబితా ప్రకారం మున్సిపల్, మండల అధికారుల చర్యలు
- లేఅవుట్లలో హద్దురాళ్లు, కాలువలు, రోడ్లు ధ్వంసం
- ప్లాట్లు కొనుగోలు చేసిన వారిలో గుబులు
- వైసీపీలో కాకరేపుతున్న ఈ వ్యవహారం

కావలి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): కావలి నియోజకవర్గంలో 2019-24 మధ్య వేసిన లేఅవుట్లపై నెల్లూరు పట్టణాభివృద్ధి సంస్థ (నుడా) అధికారులు దృష్టి సారించారు. సర్వే నెంబర్లతో సహా అనధికార లేఅవుట్లను గుర్తించి వాటి వివరాలను మున్సిపల్ అధికారులకు, ఎంపీడీవోలకు పంపి చర్యలు తీసుకోవా లంటూ ఆదేశాలు జారీ చేశారు. దీంతో స్థానిక అధికర యంత్రాంగం ఆ జాబితాలు పట్టుకుని అనధికార లే అవుట్లపై పడ్డారు. హద్దు రాళ్లు, కాలువలు, రోడ్లను ఎక్స్‌వేటర్ల సహాయంతో ధ్వంసం చేస్తుండటంతో రియల్టర్ల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. ఇక రూ.లక్షలు పోసి ప్లాట్లల కొనుగోలు చేసిన ప్రజల్లోనూ ఆందోళన రేగుతోంది.

● ప్రభుత్వ స్థలాలు ఏమైనట్టు?

కావలి పురపాలక సంఘ పరిధిలో వేసిన లేఅవుట్లలో ఉన్న 128 ఎకరాల ప్రభుత్వ భూమి ఎక్కడుందో దానిని స్వాధీనం చేసుకుంటారా!? లేదా!? అనే చర్చ విస్తృతంగా నడుస్తోంది. మరోవైపు అనధికార లేఅవుట్లలో హద్దురాళ్ల, కాలువలు, రోడ్లు తొలగించే ప్రక్రియను కూడా ముమ్మరంగా చేపట్టారు. ప్రభుత్వ భూములు ఉంటే ఎందుకు చర్యలు తీసుకోవటం లేదని వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి తరచూ అధికారులను ప్రశ్నిస్తున్నారు. దీంతో రియల్టర్లుగా ఉన్న వారంతా వైసీపీ నాయకులు కావటంతో మాజీ ఎమ్మెల్యేపై గుర్రుగా ఉన్నారు. వైసీపీలో ఈ వ్యవహారం రాజకీయ చిచ్చు మొదలైంది.



వెంగాయగారిపాలెం- తుమ్మలపెంట రోడ్డు మధ్యలో అనధికార లేఅవుట్

● కొనుగోలుదారుల్లో ఆందోళన

లేఅవుట్లలో సరిహద్దు రాళ్ల, రోడ్లు, కాలువలు చెరిపేస్తుండటంతో ఎవరి ప్లాట్లు ఎక్కడ ఉన్నాయో తెలియక ప్లాట్ల కొనుగోలుదారులు ఆందోళన చెందుతున్నారు. అనధికార లేఅవుట్ల కావటంతో వాటిని అధికారికంగా గుర్తించేందుకు ఎలాంటి అవకాశాలు లేవు. లేఅవుట్ మ్యాప్‌లన్నీ లేఅవుట్‌దారులు సొంతంగా తయారు చేసుకున్నవి కావటంతో సరిహద్దు రాళ్ల పోతే ఆ తర్వాత ఎవరి ప్లాటు ఎక్కడుంటుందో తెలియక గొడవలు జరిగే అవకాశాలు ఉన్నాయి.

● నాటిపాలకుల పాపమే

గత పాలకులు, అధికారులు దొంగలు.. దొంగలు ఊళ్లు పంచుకున్నట్లుగా ఎవరి వాటా వారు తీసుకుని అనధికార లే అవుట్లు వేసుకునేందుకు సహకరించారు. దీంతో రియల్టర్లు అనధికార లేఅవుట్లు వేయడమేగాక వాటి పక్కన ఉన్న కాలువల, గుంటలు, వంకలు, వాగులు ఆక్రమించుకుని లేఅవుట్లలో కలిపేసుకున్నారు. ఆ లేఅవుట్లలో నిర్మాణాలకు అధికారులు అనుమ తులు కూడా ఇవ్వడంతో అనేక భవనాలు వెలిశాయి. దీంతో ప్రజలు కూడా ఆ ప్లాట్లు సక్రమమేనని ఎగబడి ప్లాట్లు కొన్నారు. అదే అధికారులు ఇప్పుడు ఆ లేఅవుట్ల అక్రమమని వాటిని చేరిపేస్తుండటంతో ప్రభుత్వాలు మారినపుడల్లా చట్టాలు మారతాయా అని ప్లాట్లు కొనుగోలు దారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

8 వరకు దరఖాస్తుల గడువు పొడిగింపు

- 10న మద్యం దుకాణాలకు లక్కీడిప్

నెల్లూరు(క్రైం), ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): గీత కులాల వారికి మద్యం దుకాణాల కేటాయింపునకు ఈనెల 5లోగా ప్రభుత్వం దరఖాస్తులు ఆహ్వానించిన విషయం తెలిసిందే. అయితే ఈ గడువును ఈనెల 8వతేదీ సాయంత్రం 5 గంటల వరకు పొడిగిస్తూ ఎక్సైజ్ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలో 18 మద్యం దుకాణాలను గీతకులాలకు కేటాయించారు. గీతకులాల్లో ఉప కులాలకు సంబంధించి గౌడ్‌కు 6, గౌడకు 7, గమళ్ళకు 4, గౌండ్లకు 1 దుకాణాన్ని లాటరీ విధానంలో కేటాయించనున్నారు. ఈనెల8 వరకు దరఖాస్తులు స్వీకరించి, 10న జెడ్పీ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ లక్కీడిప్ తీసి, దుకాణాలు కేటాయించనున్నారు. బుధవారం వరకు ఎక్సైజ్‌శాఖ 27 దరఖాస్తులు అందాయి. వాటిలో నెల్లూరు కార్పొరేషన్‌కు కేటాయించిన మద్యం దుకాణానికి అత్యధికంగా 7 దరఖాస్తులు అందాయని ఎక్సైజ్ అధికారులు తెలిపారు.

సోమశిలలో 65.936 టీఎంసీల నిల్వ

అనంతసాగరం ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ నుంచి బుధవారం 1,317 క్యూసెక్కుల ప్రవాహం వస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రాజెక్టు సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా 65.936 టీఎంసీల నిల్వ ఉంది. దిగువ కండలేరుకు 200, డెల్టాకు 2,750, ఉత్తర కాలువకు 650, దక్షిణ కాలువకు 350 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

సైనిక సంక్షేమ అధికారిగా హరికృష్ణ



నెల్లూరు (హరనాథపురం), ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : జిల్లా సైనిక సంక్షేమ అధికారిగా జీ హరికృష్ణ బుధవారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం కలెక్టర్ ఆనంద్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

భూ ఆక్రమణదారులపై
చర్య తీసుకోవాలి

- దళిత హక్కుల సమితి రాష్ట్ర అధ్యక్షుడు నీలం నాగేంద్ర

ఉలవపాడు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): చాకిచర్ల గ్రామంలో దళితుల సాగు భూమిని ఆక్రమించిన వ్యక్తు లపై ల్యాండ్ గ్రాబింగ్ కింద కేసు నమోదు చేయాలని దళత హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు నీలం నాగేంద్ర డిమాండ్ చేశారు. ఈ విషయంపై బుధవారం ఆయన బాధిత రైతులతో తహసీల్దారు లావణ్యవేణికి వినతిపత్రం అందజేశారు. గ్రామం లోని సర్వేనెంబర్ 926-1లో 28ఎకరాల 65 సెంట్లు సోష ల్ ఫారెస్టు భూమిని అన్ని కులాల రైతు లు, పల్లెకారులు సాగు చేసుకో వచ్చని 20ఏళ్ల క్రితం గ్రామపెద్దలు ఒప్పందం చేసుకున్నారని పేర్కొన్నారు. పల్లెకారుల నివాసం కోసం వేరే సర్వే నెంబర్లులో ఇళ్ల స్థలాలు కేటాయిం చినా దళితుల భూములను ఆక్రమిం చుకొని సాగు చేసుకునెందుకు ప్రయ త్నిస్తూ బెదిరింపులకు దిగుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో దళిత నాయకుడు నీలం నాగేంద్ర, పుల్లా కిరణ్‌రెడ్డి, వీరమల్లు కొండయ్య, మాల మహా నాడు అధ్యక్షుడు దారా అంజయ్య, కాకు మాని రవి, చాకిచర్ల రైతులు పాల్గొన్నారు.



తహసీల్దారుకు వినతిపత్రం ఇస్తున్న నీలం నాగేంద్ర, బాధిత రైతులు



మహీధరరెడ్డితో భేటీ అయిన ఆదాల ప్రభాకర్‌రెడ్డి, రంగారెడ్డి

మహీధరరెడ్డితో ఆదాల భేటీ

కందుకూరు, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): కందుకూరు నియోజకవర్గ నేత, మాజీ మంత్రి మానుగుంట మహీధరరెడ్డిని బుధవారం వైసీపీ నెల్లూరు పార్లమెంటు పరిశీలకుడు, మాజీ ఎంపీ ఆదాల ప్రభాకరరెడ్డి మాచవరం గ్రామానికి వచ్చి కలవడం రాజకీయవర్గాల్లో చర్చనీయాంశమైంది.గత కొంతకాలంగా మహీధరరెడ్డి వైసీపీ కార్యకలాపాలకు దూరంగా ఉంటూ స్వతంత్రంగా వ్యవహరిస్తున్న విషయం తెలిసిందే. గత ఎన్నికల సమయంలో సిటింగ్ ఎమ్మెల్యేగా ఉన్న మహీధరరెడ్డిని కాదని వైసీపీ అధిష్ఠానం కనిగిరి ఎమ్మెల్యేగా ఉన్న బుర్రా మధుసూదన్ యాదవ్‌ను కందుకూరులో పోటీకి నిలిపారు. ఎన్నికల సమయంలోనే వైసీపీతో అంటీముట్టనట్లు వ్యవహరించిన మహీధరరెడ్డి తర్వాత పార్టీకి పూర్తిగా దూరంగా ఉంటున్నారు. కందుకూరులో ఉన్న తన కార్యాలయంలో కూడా జగన్మోహనరెడ్డి, ఇతర వైసీపీ నేతల ఫోటోలను పూర్తిగా తీసివేయించి కేవలం తన ఫొటో, తన తండ్రి దివంగత ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి ఫొటోలను మాత్రమే ఉంచారు. ఇటీవలికాలంలో పార్టీ కార్యకలాపాల విషయంలో బుర్రా మధుసూదన్ యాదవ్‌పై క్యాడర్‌లో భరోసా సడలుతుండటం, ఆయనను తిరిగి కనిగిరికే పంపిస్తారన్న వార్తలు వినిపిస్తున్నాయి. సమావేశంలో పలు అంశాలపై చర్చించుకున్నా ప్రధానంగా రాజకీయ భవిష్యత్తుకు సంబంధించిన అంశంపైనే చర్చ జరిగినట్టు సమాచారం. ఆదాల వెంట నెల్లూరు విజయ డెయిరీ ఛైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి ఉన్నారు.

‘పాడిపరిశ్రమ పరిశీలన’ అంశంపై సదస్సు

కావలి టౌన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక జేబీ డిగ్రీ కళాశాలలోని ఎస్ఆర్.శంకరన్‌హాల్‌లో బుధవారం జాతీయ రంగంలో పాడిపరిశ్రమ పరిశీలన అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా డెయిరీ సైన్స్ హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడు అవార్డు గ్రహీత మల్లికార్జున రెడ్డి పాల్గొని మాట్లాడారు. దేశంలో పాడి పరిశ్రమ దినదినాభివృద్ధి చెందుతుందన్నారు. క్షీర విప్లవంతో పాడిపరిశ్రమలో నూతన పద్ధతులు అందుబాటులో వచ్చాయని వాటితో గణనీయమైన ఉత్పత్తి సాధించామన్నారు. విద్యార్థులు తరచూ డెయిరీలను సందర్శించి ప్రత్యక్ష పరిజ్ఞానాన్ని పొందాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుబ్రమణ్యంనాయుడు, సెల్ఫ్‌హెల్ప్ కోర్సుల డైరెక్టర్ ఆర్.మాల్యాద్రి, డెయిరీ సైన్స్ హెడ్ రమణ పాల్గొన్నారు.



ఉపన్యసిస్తున్న డాక్టర్ మల్లికార్జున రెడ్డి

ముంచుతున్న మిర్చి!

(5వ పేజీ తరువాయి)

రైతులు తలపట్టుకుంటున్నారు. దశాబ్ద కాలంలో మిర్చిసాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. గతంలో కందుకూరు వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో వెయ్యి ఎకరాల లోపు మాత్రమే సాగయ్యే మిర్చి కొన్నేళ్లుగా ఏటా సరాసరిన 4వేల ఎకరాలలో సాగవుతోంది.

● క్వింటాల్ రూ.13వేలకు..

ప్రతి ఏడాది మిరప క్వింటాల్‌కు రూ.16వేలకు తక్కువ కాకుండా అత్యధికంగా రూ.25 వేలు పలికింది. సరాసరిన రూ.19వేల వరకు లభించేది. కానీ ఈ ఏడాది క్వింటాల్ రూ.13వే లకు మించడం లేదని రైతులు వాపోతున్నారు.

● ఎకరానికి 10 క్వింటాళ్లు అనుమానమే

గతంలో సరాసరిన ఎకరానికి 30 క్వింటాళ్ల దిగుబడి వచ్చే మిరప.. ఈ ఏడాది 10 క్వింటాళ్ల దిగుబడి రావటం కూడా గగనంగా కనిపి స్తోంది. కొందరు రైతులు ఇప్పటికే తోటలను పూర్తిగా వదిలేయగా మరికొందరు తంటాలు పడుతున్నారు. వారు కూడా ఎకరానికి 10క్విం టాళ్ల దిగుబడి తీయగలుగుతారన్న నమ్మకం లేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. నల్లి, నల్లతామర నియంత్రణ కోసం మార్కెట్లో అందుబాటులో ఉన్న అధునాతన మందులు కూడా భారీగా ధర పలుకుతుండటంతో కొందరు బ్లాక్ మార్కెట్లో మందులు కొనుగోలు చేసి పైరుకు కొడుతున్నారు. ఎకరానికి ఒకసారి స్ప్రే చేయాలంటే రూ.5వేల వరకు ఖర్చవుతోందని, తిరిగి నాల్గవరోజు స్ప్రే చేస్తే తప్ప ఫలితం లేకపోవటంతో అంత భారీ పెట్టుబడి పెట్టలేక వదిలేస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. గతేడాది ఇదే సీజన్‌లో క్వింటాల్ రూ.22 వేలు ధర ఉన్నా మరింత ధరను ఆశించి అనేకమంది రైతులు మిర్చిని ఏసీ గోదాముల్లో నిల్వచేశారు. అంతకుక్రితం సీజన్‌లో సాగు చేసిన మిర్చినీ ఏసీలలో ఇప్పటికీ నిల్వచేసి ఉన్న రైతులూ ఉన్నారు. అయితే ధర పెరగకపోగా పతనమవుతోంది. ప్రస్తుతం క్వింటం రూ.13వేలకు అమ్ముకోగ చేయగలిగింది లేదు. దీంతో రెండేళ్లుగా వడ్డీలు, ఏసీ గోదాముల బాడుగలు చూసుకుంటే వారు తీవ్రంగా నష్టపోతున్నారు. కేవలం కందుకూరు ప్రాంతంలోనే ఇలా నిల్వచేసి ఉన్న మిరప 20వేల క్వింటాళ్ల వరకు ఉంటుందని అంచనా. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం కనీస మద్దతు ధరను ప్రకటించి ఎగుమతులు వచ్చేలా చర్యలు తీసుకుంటే తప్ప అప్పుల ఊబి నుంచి బయటపడలేరని పలువురు మిర్చి రైతులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

తరగతులను తొలగించొద్దని తల్లిదండ్రుల ఆందోళన



పాఠశాల ముందు ఆందోళన చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

ఆత్మకూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మున్సిపల్ 17వ వార్డు నాగులపాడు ప్రాథమిక పాఠశాలలోని తరగతులను తొలగించొద్దని విద్యార్థుల తల్లిదండ్రులు బుధవారం పాఠశాల ఎదుట ఆందోళన చేశారు. నాగులపాడు పాఠశాలలోని 3, 4, 5 తరగతులను చెర్లో యడవల్లి పాఠశాలలో కలిపి మోడల్ పాఠశాలను ఏర్పాటు చేయనున్నారు. దీన్ని వ్యతిరేకిస్తూ తల్లిదండ్రులు ఆందోళన చేశారు. నాగులపాడు పాఠశాలలో యథావిధిగా తరగతులు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈమేరకు ఎంఈవోకు వినతిపత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసీ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

టీడీపీ నేత వెంకటయ్య మృతి తీరని లోటు : కాకర్ల



వెంకటయ్య చిత్ర పటానికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్ తదితరులు

సీతారామపురం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : మాజీ సొసైటీ అధ్యక్షుడు, తెలుగుదేశంపార్టీ నాయకుడు వెంగళశెట్టి వెంకటయ్య మృతి పార్టీకి తీరని లోటని ఉదయగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే కాకర్ల సురేష్, వారి సోదరులు కాకర్ల వెంకట్, కాకర్ల సునీల్ తెలిపారు. బుధవారం వెంకటయ్య స్వగ్రామం సంగసానిపల్లికి విచ్చేసి కుటుంబ సభ్యులను ఓదార్చారు. అనంతరం తెలు గుదేశంపార్టీ కార్యాలయంలో పార్టీ కార్యకర్తల సమస్యలు అడిగి తెలుసు కున్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ కప్పా ప్రభాకర్‌రాజు, సీతారామపురం సర్పంచ్ కొడవటికంటి భాగ్యకుమారి, మండల క్లస్టర్ ఇన్‌చార్జి వెంగలశెట్టి వెంకటేశ్వర్లు, పిడుగు రమేష్, ఎడమ ప్రవీణ్, తిరుపతయ్య, షేక్ బాబు, మనోజ్‌బాబు,సింగాల నాగేశ్వరరావు, మండల టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి



నిత్యావసరాలు అందజేస్తున్న మున్సిపల్ కమిషనర్

కావలి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్ తెలిపారు. మున్సిపల్ అవుట్ సోర్సింగ్ పారిశుధ్య కార్మి కులకు బుధవారం స్థానిక కార్యాలయ ఆవరణలో సబ్బులు, కొబ్బరి నూనె, చెప్పులు పంపిణీ చేశారు. అవుట్‌సోర్సింగ్ కార్మికులకు ప్రతి నెలా జీతాలు అందచేస్తున్నట్లు తెలిపారు. దినసరి కార్మికులకు కూడా రెండునెలలకోసారి జీతాలు ఇస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ రెవెన్యూ అధికారి ఫణికుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



ఆటోవాలాలకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ శ్రీనివాసులు

ఉదయగిరి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఆటోవాలాలు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ ప్రమాదాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ శ్రీనివాసులు సూచించారు. బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా ఆటోవాలాలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూచించిన పార్కింగ్ ప్రదేశాల్లోనే ఆటోలు నిలపాలన్నారు. పరిమితికి మించి ప్రయాణికులను చేరవేయరాదన్నారు. ప్రయాణికుల పట్ల మర్యాదపూర్వకంగా నడుచుకుంటూ ప్రతిఒక్కరూ లైసెన్సు కలిగి ఉండి యూనిఫాం ధరించాలన్నారు. మద్యం సేవించి వాహనం నడిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

విద్యార్థుల అభ్యసన, పఠనా సామర్థ్యాల పరిశీలన

ఉదయగిరి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల విద్యాబోధన విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా ఉండాలని ఎంఈవో-1 షేక్ మస్తాన్‌వలి సూచించారు. బుధవారం ఆయన పట్టణంలోని మెయిన్ ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేసి విద్యార్థుల అభ్యసనా, పఠనా సామర్థ్యాలను పరిశీలించారు. అలాగే ఎంఈవో-2 శ్రీనివాసులు మండలంలోని వెంగళరావునగర్ మెయిన్, ఉర్దూ పాఠశాలలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనాన్ని రుచిచూసి విద్యార్థుల, ఉపాధ్యాయుల రిజిస్టర్లను పరిశీలించారు.

క్యాన్సర్‌పై అవగాహన సదస్సు

బిట్రగుంట, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): కడనూతలోని ఆర్ఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం ప్రిన్సిపాల్ పీవీఎన్ రెడ్డి ఆధ్వర్యంలో వరల్డ్ క్యాన్సర్ డే సందర్భం గా బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. సీనియర్ అధ్యాపకురాలు లక్ష్మీ పాల్గొని క్యాన్సర్ వ్యాధి ఎలా వస్తుందో వివరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ కిరణ్‌కుమార్ ఉన్నారు.

పబ్లిక్ నోటీసు

భారత పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (BPCL) వారు సర్వే నెంబరు 161-H & 161-1C, కొత్తపల్లి కొరుగుంట గ్రామము, దగదర్తి మండలం, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్ 1750.0 చదరపు మీటర్లలో ఉత్తరం: అంబటి బుజ్జమ్మ భూమి, దక్షిణం: మాగుంట పార్వతమ్మ మరియు పంగా నరసింహారావు భూమి, తూర్పు: అంబటి బుజ్జమ్మ మరియు కాకు లిఖిత రాజ్ భూమి, పడమర: జాతీయ రహదారి (NH16) చెందిన భూమికి హద్దులుగా వున్న స్థలము రిటైల్ అవుట్ లెట్‌ను ఏర్పాటు చేయాలని ప్రతిపాదిస్తున్నట్లు తెలియచేయడం. శ్రీమతి అంబటి బుజ్జమ్మ భర్త శ్రీనివాసులు (లేట్) మరియు శ్రీమతి కాకు లిఖిత రాజ్ తండ్రి రాజేంద్రప్రసాద్, కొత్తపల్లి కొరుగుంట గ్రామము, దగదర్తి మండలం, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా.

ఏదైనా వ్యక్తి లేదా సంస్థ (వ్యవస్థీకృత లేదా అవ్యవస్థీకృత) పేర్కొన్న ఆస్తిపై ఏదైనా పద్ధతిలో ఏదైనా హక్కు లేదా క్లెయిమ్ కలిగి వుంటే నేటి నుండి 7 రోజులలోపు మద్దతు ఇవ్వడానికి సంబంధిత మరియు అవసరమైన టైటిల్ డాక్యుమెంట్‌లతో పాటు దిగువ పేర్కొన్న చిరునామాలో దిగువ సంతకము చేసిన వారికి తెలియచేయవచ్చు.

సంప్రదించడానికి: టెరిటరి మేనేజర్, (రిటైల్), నెల్లూరు

భారత పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్, 26-3-171/1, బి.వి.నగర్ మినీబైపాస్ రోడ్, నెల్లూరు నగరం, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, A.P, 524004.

తేది: 06-02-2025

స్వచ్ఛత యంత్రాలకు తుప్పు

- వాడకుండానే మూలకు..
- రూ. కోట్ల ప్రజాధనం వృథా



కార్యాలయ ఆవరణలో నిరుపయోగంగా ఉన్న ష్రెడ్డర్ యంత్రాలు



సచివాలయంలో నిరుపయోగంగా ఫాగింగ్ యంత్రం

ఉదయగిరి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో స్వచ్ఛతకు కొనుగోలు చేసిన యంత్రాలు వినియోగంలో లేక తుప్పు పట్టిపోతున్నాయి. స్వచ్ఛభారత్‌లో భాగంగా గ్రామాల్లో ఇంటింటా సేకరించే వ్యర్థాల నుంచి ప్లాస్టిక్‌ను వేరు చేసి ముక్కలు చేసి ముద్దగా చేసే యంత్రాలు (ష్రెడ్డర్) కొనుగోలు చేశారు. ఒక్కోదానికి సుమారు రూ.2 లక్షలు వెచ్చించారు. వాటిని జిల్లాలోని అన్ని మేజర్ పంచాయతీలకు అందజేశారు. ఆయా పరికరాలను నడిపే సిబ్బందిని నియమించకపోవడంతో అవి మూలకు చేరాయి. పంపిణీచేసిన ఫాగింగ్ యంత్రాలను కొన్ని పంచాయతీలు ఒక్కరోజు కూడా వినియోగించిన పాపాన పోలేదు. కొన్ని యంత్రాలను అరకొరగా వినియోగించిన వెంటనే మరమ్మతులకు గురికావడంతో వాటిని మరమ్మతులు చేయించేందుకు క్రాంటాక్టర్ స్పందించకపోవడంతో అటకెక్కాయి. దీంతో కోట్ల రూపాయల నిధులు వృథా అయ్యాయి. ఉదయగిరి మేజర్ పంచాయతీకి అందజేసిన యంత్రాలు గత నాలుగేళ్లుగా ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ నిరుపయోగంగా మారాయి. ఇప్పటికైనా సంబంధిత జిల్లా ఉన్నతాధికారులు స్పందించి యంత్రాలను వాడుకలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

కంది సాగులో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



కందుకూరు: కంది పైరును పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

కందుకూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): కంది పైరులో పిండినల్లి, గూడుపురుగు ఉన్నట్లు గుర్తించామని రైతులు తక్షణం సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని ఇన్‌చార్జి ఏఓ గీతాప్రకాష్ సూచించారు. బుధవారం జీ.మేకపాడులో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఏడీఏ అనసూయతో కలిసి కందిపైరును పరిశీలించారు. పురుగు నివారణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు రోశిరెడ్డి, నాగరాజు పాల్గొన్నారు.

● దుత్తలూరు(ఉదయగిరి) : శనగ సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలని కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ డీ విజయకుమార్‌నాయక్, డీఆర్సీ ఏవో గీతాకుమారి సూచించారు. బుధవారం మండలంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా ఆహార, పోషణ భద్రతా పథకం కింద లక్ష్మీపురం గ్రామంలో సాగులో ఉన్న శనగ పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంటల సాగులో రైతులు తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం పొందాలన్నారు. శనగ పంట విత్తన శుద్ధి, విత్తన మోతాదు ప్రతి రైతు తప్పక పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఎస్.వెంకటసుబ్బారెడ్డి, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

● వలేటివారిపాలెం: శనగ పంట లో సమగ్ర సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడులు సాధించవచ్చని ఏఓ హేమంత్‌భరత్‌కుమార్ తెలిపారు. కళవళ్లలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో శనగపంటను పరిశీలించి రైతులకు తగు సలహాలు అందించారు. శనగపంటలో వేరుకుళ్లు తెగులు, నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. రబీసీజన్లో సాగు చేసిన పంటలకు ఈ పంట నమోదు చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

చెత్త సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలి



సీతారామపురం: సంపద తయారీ కేంద్రం వద్ద పంచాయతీ కార్యదర్శులకు సూచనలు ఇస్తున్న డీఎల్‌పీవో ఆదినారాయణ

ఉదయగిరి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఈనెల 15వ తేదీలోపు పంచాయతీల్లో నిర్మించిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలకు వినియోగంలోకి తీసుకురావాలని ఆత్మకూరు డీఎల్‌పీవో దాసరి నారాయణరావు పేర్కొన్నారు. బుధవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో మండలంలోని పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించి వాటి నిర్వహణపై తగు సూచనలు, సలహాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మార్చి చివరి నాటికి పంచాయతీల్లో ఇంటి, కొళాయి పన్నులు నూరు శాతం వసూలు చేయాలన్నారు. వేసవి దృష్ట్యా మంచినీటి పథకాలు సమగ్రంగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు కరీముల్లా, నాగూర్‌బీ, హీనా, జ్యోత్స్న, భవాని, శేఖర్, తేజ, ఆంజనేయులు, వీరేంద్ర, మహబూబ్‌బాషా పాల్గొన్నారు.

●సీతారామపురం : మండల కేంద్రమైన సీతారామపురం గ్రామ పంచాయతీ రికార్డులను డిఎల్‌పిఓ ఆదినారాయణ బుధవారం పరిశీలించారు. అనంతరం పంచాయతీలోని చెత్త నుండి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా డిఎల్‌పిఓ ఆదినారాయణ మాట్లాడుతూ గ్రామంలో సేకరించిన పొడి, తడి చెత్తను వేరు చేసి వర్మికంపోస్ట్ తయారుచేయాలని తెలిపారు. సంపద తయారీ కేంద్రం వద్ద మండల పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించి వారికి సూచనలు సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీతారామపురం సర్పంచ్ కొడవటికంటి భాగ్యకుమారి, ఈవోపీఆర్డీ భార్గవి, తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

కావలి టౌన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి సైన్స్ ఎగ్జిబిట్స్ పోటీలకు స్థానిక నలంద ఒలింపియాడ్ పాఠశాల విద్యార్థుల ప్రాజెక్ట్ ఎంపిక కావడంపై సర్వత్రా హర్షం వ్యక్తం అవుతుంది. బుధవారం పాఠశాల డైరెక్టర్ ఎండీ.వశీం విద్యార్థులు బీవీఎస్. మోక్ష, జె. భారతిలను అభినందించారు.

వైసీపీ నేతకు నివాళి

లింగసముద్రం, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): స్థానిక వైసీపీ నాయకుడు కిలారి సుబ్బరాయుడు చిత్రపటానికి బుధారం మాజీ మంత్రి మానుగుంట మహీధర్‌రెడ్డి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట వరికూటి కృష్ణారెడ్డి, తిరుపతిరెడ్డి, మధుసూదనరావు, చీమల శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు



ఆక్రమణల తొలగింపు చర్యలు చేపట్టిన ఎమ్పీడీవో, ఎస్ఐ

కావలి రూరల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): అన్నగారిపాలెంలో ఆక్రమణలకు గురైన పాఠ శాల, శ్మశానవాటిక స్థలాల ఆక్రమణలను బుధవారం ఎమ్పీడీవో శ్రీదేవి పరిశీలించి వాటి లోని తొలగించారు. ఆ వివరాలు ఇలా ఉన్నాయి. 40ఏళ్ల కిందట అప్పట్లో పాఠశాల స్థలం గా ఉన్న 15సెంట్ల భూమిని ఆక్రమించుకుని పశువుల మేత సాగుచేస్తున్నారన్న ఫిర్యాదులు అందాయి. అలాగే అదేగ్రామంలోని బలిజపాలెంలో 50సెంట్ల శ్మశానవాటిక స్థలం ఉన్నది. ఆక్రమణలను తొలగించి ఎక్స్‌కవేటర్ సాయంతో తొలగించారు. కార్యక్రమంలో రూరల్ ఎస్ఐ తిరుమల రెడ్డి, ఇన్‌చార్జీ ఈవోపీఆర్డీ అబ్దుల్ సమద్, వీఆర్వో రమణయ్య, కార్యదర్శి రామ్‌కిరణ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దాడిచేసిన వారిపై కేసు నమోదు చేయాలి



సుబ్బారావును పరామర్శిస్తున్న యాదవ జేఏసీ నాయకులు

కందుకూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఈతముక్కలమ్మ ఆలయం వద్ద గత నెల 29న యాదవ యువకుడు అమ్మనబోయిన సుబ్బారావుపై దాడిచేసి తీవ్రంగా గాయపరిచిన ఏకాంబరం మస్తాన్‌పై కేసు నమోదు చేయాలని యాదవ జేఏసీ అధ్యక్షుడు మిరియం శ్రీనివాసులు, జిల్లా అధ్యక్షుడు చిరుమామిళ్ల గోపికృష్ణయాదవ్‌లు డిమాండ్ చేశారు. బుధవారం వారు స్థానిక ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్న అమ్మనబోయిన సుబ్బారావును పరామర్శించారు. మస్తాన్ దాడితో తీవ్ర మనస్తాపం చెందిన సుబ్బారావు పురుగు మందు తాగి ఆత్మహత్యయత్నం చేశాడని ఆవేదన వ్యక్తం చేశారు.

సీపీడబ్ల్యూఎస్ పథకం పునరుద్ధరణకు చర్యలు



అధికారులతో సమీక్షిస్తున్న జడ్పీ సీఈవో విద్యారమ

ఆత్మకూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు మండలంలో జడ్పీ సీఈవో ఎం విద్యారమ బుధవారం పర్యటించారు. మండలంలోని అప్పారావుపాళెం గ్రామంలో మండలంలోని 14 గ్రామీలకు తాగునీటి సరఫరా చేయవలసిన సీపీడబ్ల్యూఎస్ పథకం మరమ్మతులకు గురి కావడంతో పరిశీలించారు. పునరుద్ధరించేందుందుకు ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీరింగ్ అధికారులతో చర్చించి తగు సూచనలు చేశారు. ఈనెల 9వ తేదీన ఆంధ్రప్రదేశ్ దేవాదాయ శాఖ మంత్రిచే శంకుస్థాపన చేయనున్న పంచాయతీ రాజ్ అతిథిగృహ స్థలాన్ని పరిశీలించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీపీ జడ్పీసీఈవోను శాలువాతో సత్కరించారు. అనంతరం కార్యాలయంలో మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో వివిధ పథకాలకు సంబంధించి సమీక్ష నిర్వహించారు. ఎస్‌డబ్లుపీసీ కేంద్రాలను అన్ని గ్రామ పంచాయతీలలో వినియోగంలోకి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌డీవో రమణయ్య ఎంపీడీవో ఐజాక్ ప్రవీణ్, ఆర్‌డబ్ల్యుఎస్ డీఈ మోహన్‌రావు, ఏఈ ఆర్‌డబ్ల్యుఎస్, ఈవోపీఆర్డీ పాల్గొన్నారు.

రాయితీ రుణాలకు దరఖాస్తు చేసుకోండి

ఉదయగిరి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): బీసీ కార్పొరేషన్ ద్వారా రాయితీ రుణాల కోసం అర్హులైన వారు ఈనెల 7వ తేదీ లోపు ఓబీఎంఎస్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో అప్పాజీ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 8 నుంచి 11 వరకు దరఖాస్తుల పరిశీలన, 12 నుంచి 14 వరకు మండల, బ్యాంక్ అధికారులు క్షేత్ర పరిశీలన చేసి లబ్ధిదారుల ఎంపిక, 17 నుంచి 20 వరకు బ్యాంకర్లు ఇచ్చిన లబ్ధిదారుల జాబితా మంజూరుకు జిల్లా అధికారులకు నివేదించడం, 21 నుంచి 23 వరకు జిల్లా కలెక్టర్ మంజూరు పంపుతారన్నారు. బీసీ, ఈడబ్ల్యూఎస్ మరియు కాపు కులాల్లో అర్హులైన లబ్ధిదారులు ఆధార్, రేషన్‌కార్డు, ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు, ఫోటోలతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని అర్హులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ●అల్లూరు : ప్రభుత్వం కల్పించే సబ్సిడీ రుణాలకు అర్హులైన యువతీయువకులు దరఖాస్తు చేసుకోవాలని స్థానిక నగర పంచాయతీ కమిషనరు ఉమా మహేశ్వరరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. జనవరి 30నుంచి ఫిబ్రవరి 7వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు. బీసీ, ఈడబ్ల్యూయస్, కాపు కార్పొరేషన్లలో సంబంధిత కులాలకు చెందిన వారు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఆధార్ కార్డులు, ఆదాయ ధ్రువీకరణ పత్రం, కుల ధ్రువీకకరణ పత్రం, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, ఏపీఓబీఎం ఎంఎస్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

అధికారుల తీరుపై సీపీఐ నేతల ఆగ్రహం



తహసీల్దారుకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కనియంపాడు గ్రామ సమీపంలోని అగ్రిగోల్డ్ భూముల్లో జామాయిల్ చెట్లను నరికి యధేచ్ఛగా తరలిస్తున్నప్పటికీ అధికారులు స్పందించక పోవడం దారుణమని సీపీఐ జిల్లా సమితి కార్యదర్శి దామా అంకయ్య, సంస్థ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుపతయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం ఆ భూములను పరిశీలించి మాట్లాడుతూ వారం రోజుల్లోపు చర్యలు చేపట్టి లారీలను సీజ్ చేయాలన్నారు. అనంతరం తహసీల్దారు హేమంత్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శంకరయ్య, మాల్యాద్రి, ఉపాధ్యక్షులు కృష్ణయ్య, సభ్యులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

పోస్టు కార్డులతో ప్రధానికి ధన్యవాదాలు



పోస్టుకార్డులు ప్రదర్శిస్తున్న బీజేపీ నేతలు

కావలిటౌన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): బడ్జెట్ కేటాయింపులపై స్థానిక బీజేపీ నాయకులు యువమోర్చ ఆధ్వర్యంలో పోస్టుకార్డులతో ప్రధాని మోదీకి ధన్యవాదాలు తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పార్టీ పట్టణాధ్యక్షుడు మంద కిరణ్ మాట్లాడారు. ఆదాయపు పన్ను రూ.12లక్షల వరకు మినహాయింపు కల్పించడం, విమానాశ్రయాల అభివృద్ధికి నిధులు కేటాయించడం, చిన్నతరహా పరిశ్రమలకు రూ.5- 10కోట్ల వరకు రుణపరిమితి పెంచడం, వ్యవసాయానికి పెద్దపీట వేయడం, రైల్వేలకు పెద్దఎత్తున నిధులు కేటాయించడం శుభ సూచకం అన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు బ్రహ్మానందం, సవీంద్ర, మురళీకృష్ణ, తిరుపతి స్వామి, రాకేష్ పాల్గొన్నారు.

ప్రాథమిక పాఠశాలల ప్రాముఖ్యతపై అవగాహన

కొండాపురం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం 2025-26 విద్యా సంవత్సరంలో ఏర్పాటు చేయనున్న ప్రైమరీ ఆదర్శ పాఠశాలలు, ఫౌండేషన్, బేసిక్ ప్రైమరీ పాఠశాలల ప్రాముఖ్యతపై విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించాలని మండల ఎంఈవో 1- 2లు రవికుమార్, ఆనందరావులు బుధవారం క్లస్టర్ల పరిధిలోని హెచ్‌ఎంలకు అవగాహన కల్పించారు. వీలైనంత త్వరలో సమావేశం ఏర్పాటు చేసి విధానాలను పూర్తిస్థాయిలో తెలియజేయాలన్నారు.

నృత్య పదర్శనకు ప్రశంసలు

కావలి టౌన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): భీమవరంలోని మాముళ్లమ్మ తల్లి అమ్మవారి ఆలయ మహోత్సవాల్లో భాగంగా కావలి జయం కూచిపూడి నృత్యాలయంకు చెందిన చిన్నారులు భావన, ఆరాధ్య, నిఖిత, సమన్విత, ప్రణమ్య, మాన్వి, సంహిత, శ్రీదేవిష్ణులు చేసిన నృత్య పదర్శన ఉత్తమంగా నిలిచినట్లు నృత్యాలయ నిర్వాహకురాలు జమున తెలిపారు. ఈ సందర్భంగా నృత్య గురువు జాహ్నవితో పాటు చిన్నారులను భీమవరం కళాప్రముఖులు, ఆయల ఈవో, చైర్మన్‌ల ప్రశంశలు అందుకున్నట్లు జమున తెలిపారు.

రాళ్లపాడు రోడ్డు ప్రమాదంపై కేసు నమోదు

లింగసముద్రం, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): పెంట్రాల పంచాయతీ శాగంవారిపాలెం అడ్డరోడ్డు వద్ద ఈ నెల 2న మోటారు సైకిల్, ట్రాక్టర్ ఢీకొన్న ప్రమాదంపై కేసు నమోదు చేసినట్లు బుధవారం మండల ఎస్ఐ షేక్ మహబూబ్ సుబానీ తెలిపారు. పాస్టర్ ఎఫ్రాయిమ్ బావమరిది రేవు సుబ్బారావు ఫిర్యాదు మేరకు ఈ చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

రైతులకు ఎలుకల నివారణ మందుల పంపిణీ

అనంతసాగరం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): పొలాల్లో ఎలుకల నివారణకు ప్రభుత్వం రైతు సేవా కేంద్రాల ద్వారా ఉచితంగా మందులు అందిస్తున్నట్లు ఆత్మకూరు ఏడీ దేవసేనమ్మ తెలిపారు. బుధవారం అనంతసాగరం సచివాలయం1లో రైతులతో సమావేశం నిర్వహించి సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏవో శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జబర్దస్త్ నటుడు శాంతి స్వరూప్ సందడి

కావలి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): జబర్దస్త్ నటుడు శాంతి స్వరూప్ బుధవారం పట్టణ పోలీస్ సర్కిల్ కార్యాలయం, అన్నా క్యాంటీన్‌లకు వెళ్లి కొంతసేపు సందడి చేశారు. బోగోలు మండలానికి చెందిన శాంతి స్వరూప్ సొంత పనుల మీద స్వగ్రామం వచ్చి సీఐ పాపారావును మర్యాదపూర్వకంగా కలిశారు. రూరల్ సీఐ రాజేశ్వరరావు, ఒకటో పట్టణ సీఐ ఫిరోజ్, రెండో పట్టణ సీఐ గిరిబాబులు అక్కడకు చేరుకుని ఆయనతో కొంతసేపు ముచ్చటించి శాలువతో సత్కరించారు. అన్నా క్యాంటీన్‌కు వెళ్లి జనాలకు భోజనం వడ్డించారు. అందరినీ ఆప్యాయంగా పలకరించారు.

ప్రధాన రహదారిలో పిచ్చి మొక్కలు తొలగించాలి

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఉన్నత పాఠశాల సమీపంలోని ప్రధాన రహదారిలో ఉన్న విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా మారాయి. దీంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ఏపుగా పెరిగిన కంపచెట్లు, పిచ్చి మొక్కల మధ్య ఆ స్తంభాలు చిక్కుకుపోవడంతో నిరంతరం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతున్నది. జోరుగా గాలి వీచిన సమయంలో నిప్పురవ్వలు ఎగిసి పడుతుండడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఆ సమయంలో నివాసాల్లోని విద్యుత్ సామగ్రి సైతం పాడవుతున్నాయని స్థానికులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా విద్యుత్ ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.